




www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సిటీ








సంపుటి 29, సంచిక: 101 | బుధవారం | 30-09-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00





02
ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
30-09-2026
www.prajapaksham.in
ఎడిట్
PEOPLE'S VIEWS



# మమత, సిపిఐ(ఎం) దగ్గరవటం సాధ్యమా?

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనేది ప్రాచుర్యం పొందిన నానుడి. పశ్చిమ బెంగాల్‌లో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు ఐదారు మాసాల క్రితం వరకు ఎవరూ ఊహించనివి. రాష్ట్రంలో మూడు దశాబ్దాల లెఫ్ట్‌ఫ్రంట్ పరిపాలనకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం చేసి దాన్ని అధికారం నుంచి తొలగించిన వ్యక్తి–శక్తి తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ. లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం పట్ల కాంగ్రెస్ మెతకగా వ్యవహరిస్తోందని ఆరోపించి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఆమె అవిశ్రాంత పోరాటం సాగించారు. ఆ క్రమంలో పరస్పర దాడులు, హత్యలు యిత్యాది హింసాకృత్యాలు సర్వసాధారణంగా సాగాయి. ఇప్పటి బిజెపి ముఖ్యమంత్రి సువేందు అధికారి కూడా మమతా బెనర్జీతోపాటు కాంగ్రెస్ నుంచి బయటకువచ్చి ఆమెతో కలిసి సిపిఐ(ఎం)పై పోరాటాలు నడిపిన వారే. గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రాంలో, మొన్నటి ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని అధికారి ఓడించారు. అతడు గెలుచుకున్న రెండవ స్థానం నందిగ్రాంకు ఆయన రాజీనామా చేయటం వల్ల రేపు 6వ తారీఖు ఉప ఎన్నిక జరగనుంది. టాటాల నానో కార్ల ఫ్యాక్టరీకోసం రైతులనుంచి భూసేకరణకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ నడిపిన పోరాటమే లెఫ్ట్‌ఫ్రంట్ పరిపాలన అంతానికి హేతువైంది. ఆమె 15 సంవత్సరాల ఏకపక్ష నిరంకుశ పాలన 2026 అసెంబ్లీ ఎన్నికలో అంతమైంది – బిజెపిపై సర్ ప్రక్రియ సహా అనేక అక్రమాల ఆరోపణలున్నప్పటికీ, అది తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికింది. మమతా బెనర్జీ ఎమ్మెల్యేలు, ఎంపిల తిరుగుబాటుకు గురై చివరకు పార్టీ పేరు, ఎన్నికల గుర్తు కోల్పోయే చిక్కుల్లో పడ్డారు. నందిగ్రాం ఉప ఎన్నికల్లో ఆమె ప్రకటించిన అభ్యర్థిని ముఖ్యమంత్రితో ముచ్చట అనంతరం పోటీ నుంచి తప్పుకున్నారు. రాజకీయ చాతుర్యం గల మమతా బెనర్జీ వెనువెంటనే తటపటాయింపు లేకుండా కాంగ్రెస్ అభ్యర్థికి తోడ్పాటు ప్రకటించారు. ముఖ్యమంత్రి దుష్ట చాతుర్యంతో, నందిగ్రాం పోరాటకాలంలోని ఒక హత్యకేసు బయటకు తీసి కాంగ్రెస్ అభ్యర్థిని అరెస్టు చేయించారు. అతనిపై 5 క్రిమినల్ కేసులున్నాయి. ఎట్టకేలకు ఆ అభ్యర్థికి హైకోర్టు నిన్న బెయిలు మంజూరు చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో అవమానకరమైన ఓటమి తర్వాతగాని మమతా బెనర్జీకి తత్వం బోధపడలేదు. బిజెపి మతోన్మాద, దుష్ట పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షపార్టీల – సిపిఐ(ఎం) సహా – ఐక్యతకు పిలుపు ఇచ్చారు. గత 15 సంవత్సరాల్లో – ఒకనాటి బద్ధ శత్రువులైన కాంగ్రెస్, సిపిఐ(ఎం) ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్న, విడివిడిగా పోటీ చేసిన సందర్భాలున్నాయి. మొన్నటి ఎన్నికల్లో చెరొక అసెంబ్లీ సీటు గెలుచుకున్నాయి. కాని పై రెండు పార్టీల్లో ఏదీ మమతా బెనర్జీ పార్టీతో ఎన్నికల సర్దుబాటు కుదుర్చుకున్న సందర్భం లేదు. అయినా ప్రతిపక్ష ఐక్యతకు ఆమె పిలుపు ఇచ్చారంటే అది ఆమె దయనీయ స్థితిని తెలియజేసింది.

ఈ నేపథ్యంలో, సర్ నిర్వహణలో సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్ష పోకడపై సహకమిషనర్లు అభ్యంతరాలు తెలియజేశారన్న వార్తల దృష్ట్యా, ప్రజాస్వామ్య రక్షణకై ప్రతిపక్షాల ఐక్య పోరాటం ఆవశ్యకత వక్కాణిస్తూ సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అన్ని పక్షాలతోపాటు మమతా బెనర్జీకి కూడా లేఖ పంపారు. ఆమె సానుకూలంగా స్పందించి బేబీకి ఫోన్ చేయటం విశేషం. బెంగాల్ రాజకీయాల్లో ఇదో పెద్ద పరిణామం. పరస్పర హింసాకాండ, హత్యల్లో సతమతమైన పార్టీల మధ్య సయోధ్యపై తొందరపాటు ఊహాగానాలు, వ్యాఖ్యానాలు బయలుదేరాయి. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి లాంఛనంగా లేఖ రాసినంత మాత్రాన పశ్చిమ బెంగాల్ యూనిట్‌ను ఒప్పించటం చాలా కష్టం. క్షేత్రస్థాయి క్యాడర్ అసలే ఒప్పుకోరు. ఎందుకంటే మమతా తృణమూల్ కాంగ్రెస్, సిపిఐ(ఎం) మధ్య ఉన్నది వైరుధ్యం కాదు, శతృత్వం, లోతుగా వేళ్లాని ఉంది. రాష్ట్ర సిపిఐ(ఎం) కార్యదర్శి ఎండి సలీం తమ అసంతృప్తిని కేంద్ర నాయకత్వానికి తెలియజేశారు. అయితే ఇండియా కూటమిలో ఇతర అనేక ప్రతిపక్షాలతోపాటు కాంగ్రెస్, తృణమూల్ (మమత) కాంగ్రెస్, సిపిఐ(ఎం) కలిసి పని చేస్తున్న వాస్తవం విస్మరించరానిది.

రాష్ట్రాల్లో ప్రత్యేక పరిస్థితులున్నా, జాతీయాంశాలపై ప్రతిపక్షాల ఐక్యతలో భాగంగా విరుద్ధ శక్తులు కలిసి పనిచేయవలసిన సందర్భాలు వుంటాయి. దాన్ని ఎలా నిర్వహించాలో ఆ సందర్భాన్నిబట్టి రాష్ట్రస్థాయిలో పార్టీలు నిర్ణయించుకుంటాయి. తమ ప్రధాన కార్యదర్శితో మమతా బెనర్జీ మాట్లాడటం అన్నది ఎన్నికల అవగాహన కాదని, ప్రస్తుత అంశంలో దేశం ప్రధానం అని సలీం చెప్పారు. అది వాస్తవం.

మూడు ప్రతిపక్షా లు దగ్గరికి రాగలిగితే అది బిజెపికి అవరోధమవుతుంది. ముందే జాగ్రత్తపడాలనుకుంటున్న ముఖ్యమంత్రి అధికారి తృణమూల్, సిపిఐ(ఎం) మధ్య పాత ఘర్షణలు, దౌర్జన్యాలు, హత్యలు ఘటనలు గుర్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రికి అంత దడ అవసరం లేదు. బెంగాల్ రాజకీయాల్లో మూడు ప్రతిపక్షాల ఐక్యత సులభతర ప్రక్రియ కాదు. బిజెపి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా ఆయా సమస్యలను బట్టి ప్రతిపక్షాలు కలిసి పనిచేసే సందర్భంగా ఏర్పడవచ్చు. ఎన్నికల అవగాహనకు – ప్రజాసమస్యలపై వేదిక పంచుకోవటానికి ఎంతో దూరం ఉంటుంది. అందువల్ల ఊహాగానాలు అనవసరం. ●



## మా ఆందోళనలు గుర్తించకుంటే ఇబ్బందులు

**ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుంది. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది.**

– కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్



## మహిళా ఆరోగ్యం – ఫిట్‌నెస్ జాతీయ దినోత్సవం

కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత ఆశయ సాధనలు, పిల్లల పెంపకం, కెరీర్ బాధ్యతలతో సతమతం అవుతున్న మహిళలకు తమ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్, శ్రేయస్సు పట్ల ఆలోచించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట సెప్టెంబర్ చివరి బుధవారం రోజున, అనగా 30 సెప్టెంబర్ 2026 రోజున మహిళా ఆరోగ్యం–ఫిట్‌నెస్ జాతీయ దినోత్సవం (నేషనల్ ఉమెన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. మహిళా ఆరోగ్యం చాలా సంక్లిష్టతతో కూడి పలు సవాళ్ల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మహిళలకు కౌమార దశ నుంచి వృద్ధాప్యం వరకు మోనోపాజ్, గర్భం దాల్చడం, పిల్లల్ని కనడంతో పాటు వారి ఆలనాపాలనా చూసుకోవడం, రుతు స్రావ సమస్యలు, పిఓసిఎస్ సమస్యలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. దీనికి తోడుగా ఆందోళనలు, నిరాశ, ఒత్తిడులు, పని ఆధార ఒత్తిడులు, సామాజిక కట్టుబాట్లకు లోనవుతూనే ఉంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మహిళలకు అనారోగ్యం, శారీరక సమస్యలు, మానసిక ఉద్రేకాలు, భావోద్వేగ సమస్యలను అదుపులో ఉంచుకోవడానికి తగు సమాధానాలను ప్రచారం చేయడం నిరంతరం కొనసాగించాలి. కుటుంబ బాధ్యతలు, పని ప్రదేశంలో ఒత్తిడులు, పిల్లల పెంపకం బాధ్యతలు, వ్యక్తిగత సమస్యల పట్ల సమతుల్యత సాధించడానికి తమ ఆరోగ్యాలను సహితం పణంగా పెట్టడం జరుగుతోంది. మహిళల ఆరోగ్యం ఫిట్‌నెస్ సాధించుట వల్ల జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండడం, మానసిక శ్రేయస్సు పెరగడం, సరైన సమయంలో నిద్ర పోవడం, ఏకాగ్రత పెరగడం, దీర్ఘ కాలిక ఆరోగ్య ప్రయోజనాలు కలగడం లాంటి ఉపయోగాలు కలుగుతాయి.

**మహిళా ఆరోగ్య పరిరక్షణ మార్గాలు:** మహిళలు సమతుల పోషకాహారం తీసుకోవడం, పోషకాహారలోపాలను గమనించి ఆహార అలవాట్లు మార్చుకోవడం, ప్రతి రోజు తగు నీటిని తాగడం, బరువును అదుపులో ఉంచుకోవడం, పోషకాహారాన్ని మాత్రమే తయారు చేయడం, ప్రాసెస్డ్ ఫుడ్ వాడకాన్ని తగ్గించడం, శరీర స్వభావాన్ని బట్టి ఆహారం ఎంపిక చేసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మహిళలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలి. మానసిక వికాసానికి అవసరమైన వ్యాయామాలు, ఒత్తిడి నియంత్రణ, మానసిక స్పష్టత, నిద్రలేమి సమస్యను దూరం చేయడం, ఆశావహ సామాజిక సంబంధాలను నెలకొల్పడం, నిలకడను పెంచుకోవడం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటం, ఆరోగ్యం పరిరక్షించుకుంటూ, ఇతరులకు మార్గదర్శకులుగా నిలుస్తూ, సామాజిక చైతన్యాన్ని కలుగజేస్తూ, వృత్తిలో రాణిస్తూ ముందుకు సాగడానికి మహిళలు ప్రతినబూనాలి.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఎన్నికల సంఘంపైనే విశ్వాసం సన్నగిల్లితే..



తుంగా లక్ష్మీ నారాయణ

ప్రజాస్వామ్యం ఎన్నికలతో మాత్రమే కాదు – ఎన్నికల విశ్వసనీయతతో బతుకుతుంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకుంటున్నాం. రాజ్యాంగ బద్ధంగా, క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించబడుతున్నాయి. కోట్లాది మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి.అధికార మార్పిడులు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసాన్ని పెంచే రీతిలో నిర్వహించడానికి, 18 ఏళ్ళు నిండిన పౌరులను ఓటర్లుగా నమోదు చేయడానికి, నిష్పాక్షికంగా ఓటర్ల జాబితాను తయారు చేయడానికి, భారత రాజ్యాంగం భారత ఎన్నికల సంఘానికి అత్యంత కీలకమైన బాధ్యతను అప్పగించింది.

అందుకే, ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉండే విశ్వాసం సాధారణ పరిపాలనా అంశం కాదు. అది ప్రజాస్వామ్యానికి పునాది.

ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం తీవ్రమైన రాజకీయ ఆరోపణలు, అంతర్గత విభేదాలపై వచ్చిన వార్తలు, సిఇసి రాజీనామాను కోరుతూ దేశ వ్యాపితంగా ప్రజా నిరసనలు, అలాగే ఎన్నికల కమీషనర్ల నియామకానికి సంబంధించిన చట్ట సవరణపైన మరియు ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరుతో కొట్లాది మంది ఓట్ల తొలగింపు వివాదంపై సుప్రీంకోర్టులో రాజ్యాంగపరమైన న్యాయపోరాటం జరుగుతున్నది. ఎన్నికల నిర్వహణపై అనుమానాలు, ఆందోళనలు, నిరసనలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్యం భవిష్యత్తు పట్ల ప్రజల్లో రోజు రోజుకు ఆందోళన అధికమవుతున్నది. దీన్ని ఒక ప్రమాద హెచ్చరికగా పరిగణించాలి. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల పనితీరు మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభం యొక్క తీవ్రతను తెలియ జేస్తున్నది.

ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వయం ప్రతిపత్తి గల స్వతంత్ర సంస్థ. కానీ, నేడు దేశం ముందున్న ప్రశ్న చాలా లోతైనది. ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తితో పనిచేస్తున్నదా? అన్నదే కాకుండా, అది స్వతంత్రంగా పనిచేస్తోందని ప్రజలు కూడా విశ్వసించాలి. ఇది ఒక వ్యక్తిపై తీర్పు కాదు. ఇది ఒక ప్రజాస్వామ్య సూత్రం. ఎన్నికల నిర్వహణ మాత్రమే సరిపోదు. రాజ్యాంగబద్ధంగా నిర్వహించబడ్డాయన్న విశ్వాసాన్ని ప్రజలకు కలిగించేలా ఎన్నికల ప్రక్రియ ఉండాలి. ఆ పరిస్థితి నేడు లేదు. ఇటీవల సుప్రీంకోర్టులో సిఇసి మరి యు ఇసిల నియామక సవరణ చట్టంపై జరిగిన విచారణ ఈ ప్రశ్నకు మరింత ప్రాధాన్యతను తెచ్చింది. 2023 చట్టం ప్రకారం ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చారు. దాంతో ముగ్గురు సభ్యుల కమిటీలో ప్రభుత్వం తరఫున ఇద్దరు సభ్యులు, ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. అత్యంత లోపభూయిష్టమైన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సెప్టెంబర్ 23న సుప్రీంకోర్టు పెద్ద ధర్మాసనం పరిశీలించేందుకు మార్గం సుగమం చేసింది. క్రికెట్ క్రీడలో అంపైర్ ఎంపిక ఒక జట్టు ఆధిపత్యంలో, వారికి అనుకూలుడైన వ్యక్తిని ఎంపిక చేస్తే, ఆ అంపైర్ నిర్ణయం ఎవరికి అనుకూలంగా ఉంటుందో ఊహించుకోగలరు కదా! అంపైర్ పై అనుమానం ఉంటే మ్యాచ్‌పై విశ్వాసం దెబ్బతింటుంది. ఎన్నికల విషయంలో ఈ సూత్రం మరింత కీలకమైనది. ప్రధా న ఎన్నికల కమిషనర్ గా జ్ఞానేశ్ కుమార్ ను నియమించిన నాటి నుంచే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నికల షెడ్యూల్స్ ప్రకటించడంలో, ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో పక్షపాతంగా వ్యవహరించారనే ఆరోపణలు లేకపోలేదు.

ఓటు హక్కు చుట్టూ పెరుగుతున్న ఆందోళన: ఓటర్ల జాబితాలను శుద్ధి చేయడం ప్రజాస్వామ్యానికి అవసరమే. మరణించినవారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారినవారి పేర్లు తొలగించడం ఎన్నికల జాబితాల విశ్వసనీయతను పెంచుతుంది. అయితే అదే ప్రక్రియలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదు.

పశ్చిమ బెంగాల్ 'సర్' సందర్భంగా 27.16 లక్షల ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. వారిలో 22.21 లక్షల మంది తిరిగి తమను ఓటర్ల జాబితాలో చేర్చాలని అప్పీల్ చేశారు. ఎన్నికలకు ముందు కేవలం 1,607 మంది మాత్రమే తిరిగి చేర్చబడ్డారని ఎన్నికల సంఘం తెలిపింది. తొలగింపులు, గైర్హాజరు, మారిపోయిన, మరణించిన లేదా డూప్లికేట్ నమోదులను గుర్తించే ప్రక్రియలో భాగమని ఎన్నికల సంఘం వివరించింది. అందువల్ల ఇక్కడ అసలు ప్రశ్న ఎంత మంది పేర్లు తొలగించబడ్డాయి? అన్నదొక్కటే కాదు. ఎంత మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా రక్షించబడ్డారు? అన్నదే ప్రజాస్వామ్యానికి ముఖ్యమైన ప్రశ్న.

పార్లమెంట్ బలహీనపడితే జవాబుదారీతనం ఎక్కడ? ఒక వైపు ఎన్నికల సంఘంపై విశ్వాసం తగ్గింది. మరొకవైపు, ఎన్నికల ద్వారా ఏర్పడిన ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచే పార్లమెంటు పనితీరు అత్యంత జుగుప్సాకారంగా ఉన్న ది.

17వ లోక్‌సభ ఐదేళ్లలో 274 రోజులు మాత్రమే సమావేశాలు జరిగాయి. పూర్తి కాలం పనిచేసిన అన్ని లోక్‌సభలతో పోలిస్తే ఇది అత్యల్ప సమావేశాల సంఖ్య. సగటున సంవత్సరానికి 55 రోజులు మాత్రమే సమావేశమైంది. 15 సమావేశాల్లో 11 ముందుగానే ముగిశాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. కానీ, ప్రభుత్వాన్ని ప్రజలకు జవాబుదారీగా ఉంచాలాంటే పార్లమెంటు జవాబుదారీతనంతో నిర్వహించబడాలి. చట్ట సభల్లో దేశం మరియు ప్రజల సమస్యలపై చర్చించకపోతే, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రశ్నించకపోతే, నిశితంగా పరిశీలించకపోతే ఎన్నికల మధ్య కాలంలో ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ఎవరు ప్రశ్నించాలి? చట్ట సభలు మెరుగైన చట్టాలను ఎలా చేస్తాయి?




న్యాయవ్యవస్థ — చివరి రాజ్యాంగ భరోసా: ఇక్కడ న్యాయవ్యవస్థ పాత్ర అత్యంత కీలకం. ఎన్నికల సంఘం నియామక విధానంపై సుప్రీంకోర్టులోనే రాజ్యాంగపరమైన ప్రశ్నలు లేవనెత్తబడటం, 'సర్'కు సంబంధించిన వివాదాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం — భారత ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ తనిఖీలు ఇంకా పనిచేస్తున్నాయనే ఆశకు సంకేతాలు. అయితే, కొన్ని అత్యంత కీలకమైన కేసుల్లో ఇచ్చిన తీర్పులు, న్యాయం అందడంలో ఆలస్యం, పేరుకుపోతున్న కేసుల సంఖ్య, న్యాయమూర్తుల ఖాళీలు, న్యాయమూర్తుల్లో కొందరు రిటైర్ అయిన వెనువెంటనే నామినేటెడ్ పదవులను స్వీకరించడం, 'క్విడ్ ప్రోకో' వంటి ఆరోపణలను ఎదుర్కోవడం, న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లెలా చేశాయి. అందువల్ల న్యాయవ్యవస్థపై కూడా తీవ్ర విమర్శలు ఉన్నాయి. 2026 మార్చి 16 నాటికి సుప్రీంకోర్టులో 92,876 కేసులు, హైకోర్టుల్లో 63,98,686 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర న్యాయశాఖ లోక్‌సభకు తెలిపింది. అంతకుముందు ఫిబ్రవరి 10 నాటికి జిల్లా, దిగువ కోర్టులతో కలిపి దేశవ్యాప్తంగా పెండింగ్ కేసుల సంఖ్య 5.46 కోట్లకు పైగా ఉన్నట్లు ప్రభుత్వమే వెల్లడించింది. 2026 మార్చి 6 నాటికి దేశంలోని హైకోర్టుల్లో 1,122 మంజూరైన న్యాయమూర్తుల పోస్టులకు గాను 810 మంది మాత్రమే పనిచేస్తుండగా, 312 పోస్టులు ఖాళీగా ఉన్నాయని న్యాయశాఖ తెలిపింది. ఇవి న్యాయవ్యవస్థను మొత్తం విఫలమైంది అని నిర్ధారించే గణాంకాలు కావు. కేసుల సంక్లిష్టత, మౌలిక సదుపాయాలు, న్యాయవాదులు, దర్యాప్తు సంస్థలు, సాక్షులు వంటి అనేక కారణాలు కేసులు పేరుకుపోవడానికి కారణం కావచ్చు. కానీ, సాధారణ పౌరుడి ప్రశ్న, న్యాయం ఎప్పుడు లభిస్తుంది?

న్యాయం ఆలస్యమైతే, రాజ్యాంగ హక్కులు కాగితంపై ఉన్న హామీలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది.

అసలు సంక్షోభం — సంస్థల వైఫల్యమా? విశ్వాసం కోల్పోవడమా? ఎన్నికల సంఘం, పార్లమెంట్, న్యాయ వ్యవస్థ — ఈ మూడు సంస్థలను విడివిడిగా కాకుండా రాజ్యాంగ పరస్పర నియంత్రణ వ్యవస్థలోని మూడు కీలక భాగాలుగా చూడాలి. ప్రజాస్వామ్యం ఒక్కరోజులో కూలిపోదు. ముందుగా ప్రజలు సంస్థలను ప్రశ్నించడం ప్రారంభిస్తారు. తరువాత సంస్థల నిర్ణయాలపై అనుమానాలు పెరుగుతాయి. వ్యవస్థలు తమను తాము సమర్థించుకునే పని చేస్తాయి. ఏది నిజం? అన్న ప్రశ్నకంటే ఎవరిని నమ్మాలి? అన్న ప్రశ్న గంభీరంగా దేశం ముందుకొస్తుంది. అదే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన దశ. ఎన్నికల సంఘంపై విశ్వాసం తగ్గితే ఓటరు తన ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని నమ్మలేడు. పార్లమెంటుపై విశ్వాసం తగ్గితే తన ప్రతినిధి తన గొంతును వినిపిస్తున్నాడని నమ్మలేడు. న్యాయవ్యవస్థపై విశ్వాసం తగ్గితే రాజ్యాంగం చివరికి తన హక్కులను కాపాడుతుందని నమ్మలేడు. ఈ మూడు నమ్మకాలూ బలహీనపడితే, ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రజాస్వామ్యం క్రమేపీ బలహీనపడే ప్రమాదం ఉంది.

**ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన సమయం:** భారత ప్రజాస్వామ్యం కుప్పకూలిపోయిందని చెప్పడం అతిశయోక్తి. కానీ, వాస్తవ పరిస్థితులను నిశితంగా గమనించాలి. ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజలు ఓటు వేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి. పార్లమెంట్ పనిచేస్తోంది. న్యాయస్థానాలు రాజ్యాంగ ప్రశ్నలను పరిశీలిస్తున్నాయి. పౌర సమాజం, మీడియా, రాజకీయ పార్టీలు వ్యవస్థలను మరియు సంస్థలను ప్రశ్నిస్తున్నాయన్న భ్రమల్లో ప్రజలు ఉండకూడదు. ఆ వ్యవస్థలు మరియు సంస్థలు సక్రమంగా పనిచేయడం లేదు, కాబట్టే ప్రజాస్వామ్యంపై విశ్వాసం దెబ్బతింటున్న సంకేతాలు విస్పష్టంగా కనపడుతున్నాయి. వాటిని చూడ నిరాకరిస్తే భవిష్యత్తు అంధకారమే.

ఎన్నికల సంఘం పారదర్శకంగా ఉండాలి. దాని నిర్ణయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండాలి. ఓటర్ల జాబితాలో అర్హుడైన ఒక్క పౌరుడి పేరు కూడా తొలగించబడకూడదు. పొరపాట్లు జరిగితే వాటిని సకాలంలో సరిదిద్దే వ్యవస్థ ఉండాలి. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం, ప్రక్రియ సందేహాలకు తావులేకుండా ఉండాలి. ఎన్నికలు నిర్వహించే సంస్థ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరిస్తుందని ప్రజలకు విశ్వాసం కలిగించాలి. పార్లమెంటు ఎక్కువ సమయం సమావేశమై దేశం మరి యు ప్రజా సమస్యలపై లోతైన చర్చ జరపాలి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. న్యాయవ్యవస్థ, ప్రజల్లో తన విశ్వసనీయతను పెంచుకోవాలి. ఎన్నికల సంఘం మీద విశ్వాసం పటిష్టంగా ఉంటేనే ఎన్నికల ఫలితాలపై ప్రజల విశ్వాసం బలపడుతుంది. పార్లమెంటు సమర్థవంతగా పనిచేస్తేనే ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరిస్తుంది. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, సమర్థంగా పనిచేస్తేనే భారత రాజ్యాంగం అమలుకు, పౌరుల హక్కులకు భరోసా ఉంటుంది.

ప్రజలు తమ ఓటుకు విలువ ఉందని, తమ గొంతుకు స్థానం ఉందని, తమ హక్కులకు రాజ్యాంగ రక్షణ ఉందని విశ్వసించే స్థితి ఉన్నప్పుడే – ప్రజాస్వామ్య ఆరోగ్యంగా ఉన్నట్లు.

# ఏటుకూరి కృష్ణమూర్తి... ఒక శతాబ్దపు పోరాట జ్ఞాపకం

ఏటుకూరి కృష్ణమూర్తి జీవితం ఒక వ్యక్తి జీవిత చరిత్ర కాదు. అది భారతదేశం స్వాతంత్ర్యోద్యమం నుంచి స్వాతంత్ర్యానంతర ప్రజా ఉద్యమాల వరకు సాగిన ఒక సుదీర్ఘ చారిత్రక ప్రయాణానికి సజీవ సాక్ష్యం. ఒక శతాబ్దానికి పైగా జీవించిన ఆయన, దేశంలో చోటుచేసుకున్న అనేక రాజకీయ, సామాజిక పరిణామాలను ప్రత్యక్షంగా చూసారు. వాటిలో కొన్నింటిలో స్వయంగా భాగస్వామి అయ్యారు. తాను చూసిన కాలాన్ని, తాను నడిచిన ఉద్యమాలను తరువాతి తరాలకు అందించేందుకు జీవితాంతం కృషి చేశారు.

గుంటూరు జిల్లా ఏటుకూరులో జన్మించిన కృష్ణమూర్తి బాల్యం దేశ స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా సాగుతున్న కాలంలో గడిచింది. ఆయన సోదరుడు ఏటుకూరి బలరామమూర్తి ప్రభావం ఆయనపై గాఢంగా పడింది. ఆ ప్రభావంతో చిన్ననాటి నుంచే సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు, దేశ స్వాతంత్ర్యం, కమ్యూనిస్టు ఉద్యమం వంటి అంశాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. కుటుంబ వాతావరణం, ఆ కాలంలోని రాజకీయ పరిస్థితులు ఆయన ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశాయి.

1942లో బ్రిటిష్ సైన్యంలో చేరడం ఆయన జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు. అయితే సైన్యంలో చేరినప్పటికీ ఆయనలోని దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్ష మరింత బలపడింది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం కొత్త దశలోకి ప్రవేశించింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సైనికుల్లో కూడా అసంతృప్తి పెరిగింది. 1946 నౌకాదళ తిరుగుబాటు ఆ అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది.

ఆ సమయంలో సైనికులను చైతన్యపరిచే ప్రయత్నం చేసినందుకు కృష్ణమూర్తి అరెస్టయ్యారు. 7 మరింత బలపరిచింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ప్రజా సమస్యల పట్ల ఆయన ఆసక్తి, సామాజిక మార్పు పట్ల ఆయన నిబద్ధత కొనసాగింది. స్వాతంత్ర్యం అనంతరం ఆయన రెవెన్యూ శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే ఉద్యోగుల సమస్యల పట్ల స్పందించారు. ఎన్.జి.ఓ. అసోసియేషన్‌లో నాయకత్వ బాధ్యతలు చేపట్టి ఉద్యోగుల హక్కుల కోసం కృషి చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల సంఘంతోనూ అనుబంధం కొనసాగించారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన కాలంలోనూ ప్రజా జీవితంతో ఆయన సంబంధం తెగిపోలేదు.

కమ్యూనిస్టు ఉద్యమంతో ఆయనకు ఉన్న అనుబంధం జీవితాంతం కొనసాగింది. కమ్యూనిస్టు ఉద్యమం కేవలం ఒక రాజకీయ సంస్థకు సంబంధించిన వ్యవహారం కాదని, అది సమాజంలోని పేదలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, అణగారిన వర్గాల హక్కుల కోసం సాగిన విస్తృత ప్రజా ఉద్యమమని ఆయన తన జీవితానుభవాల ద్వారా అర్థం చేసుకున్నారు. అందుకే వయసు పెరుగుతున్న కొద్దీ ఆయన ప్రజా ఉద్యమాల పట్ల ఆసక్తి తగ్గలేదు. శాంతి, స్నేహ ఉద్యమాలతో ఆయనకు ఉన్న అనుబం ధం కూడా ప్రత్యేకంగా ప్రస్తావించదగినది. ఇస్కస్, తరువాత ఇస్కఫ్ వంటి సంస్థల ద్వారా భారత ప్రజలకు ఇతర దేశాల ప్రజలతో స్నేహ సంబంధాలు పెంపొందించేందుకు, ప్రపంచ శాంతి కోసం నిర్వహించిన



కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ బాధ్యతలను నిర్వహిస్తూ ఈ ఉద్యమాలను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేశారు.

ఆయనలోని మరో విశిష్టమైన లక్షణం చరిత్రను భద్రపరచాలనే తపన. సాధారణంగా ఉద్యమాల్లో పాల్గొన్నవారి జ్ఞాపకాలు వారితోనే అంతరించిపోతాయి. కానీ కృష్ణమూర్తి తన అనుభవాలను రచనల రూపంలో భద్రపరిచారు. తాను చూసిన కాలాన్ని, ఎదుర్కొన్న పరిస్థితులను, తన సహచరుల అనుభవాలను భావితరాలకు అందించేందుకు ప్రయత్నించారు. ముఖ్యంగా గుంటూరు జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో భాగస్వాములైన యోధుల చరిత్రను సేకరించి అక్షరబద్ధం చేయడం ఆయన చేసిన విలువైన కృషి.

ఇది కేవలం చరిత్ర రచన కాదు. చరిత్రను సృష్టించిన సాధారణ ప్రజల జీవితాలను గుర్తించి, వారి పాత్రను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే బాధ్యతను నిర్వర్తించడం. అధికారిక చరిత్రల్లో తరచుగా కనిపించని అనేకమంది ఉద్యమకారుల జీవితాలు, వారి త్యాగాలు, వారి ఆశయాలు ప్రజా ఉద్యమాల చరిత్రలో ఎంతో విలువైనవి. ఆ జ్ఞాపకాలను కాపాడేందుకు కృష్ణమూర్తి చేసిన ప్రయత్నం ప్రత్యేకంగా గుర్తించాల్సినది.

104 సంవత్సరాల సుదీర్ఘ జీవితంలో ఆయన ఎన్నో మార్పులను చూశారు. బ్రిటిష్ పాలనను చూశారు. స్వాతంత్ర్యాన్ని చూశారు. స్వాతంత్ర్యానంతర భారతదేశ నిర్మాణాన్ని చూశారు. ప్రజా ఉద్యమాల ఉత్థాన పతనాలను చూశారు. రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన అనేక మార్పులకు సాక్షిగా నిలిచారు. అయినప్పటికీ ప్రజల పట్ల నిబద్ధత, సామాజిక న్యాయం పట్ల విశ్వాసం, శాంతి–స్నేహ భావనల పట్ల ఆయన అనుబంధం చివరి వరకు కొనసాగింది.

2026 సెప్టెంబర్ 20న 104 సంవత్సరాల వయసులో ఏటుకూరి కృష్ణమూర్తి కన్నుమూశారు. ఒక దీర్ఘ జీవితం ముగిసింది. కానీ ఆయనతో పాటు ఒక చారిత్రక తరం జ్ఞాపకాలన్నీ ముగిసిపోలేదు. ఆయన రచనల్లో, ఆయనను కలిసిన వారి జ్ఞాపకాల్లో, ఆయనతో కలిసి పనిచేసిన ఉద్యమాల్లో, ఆయన నడిచిన మార్గంలో అవి కొనసాగుతూనే ఉంటాయి.

కృష్ణమూర్తి మరణాన్ని కేవలం ఒక శతాయుష్షు వ్యక్తి మరణంగా చూడటం ఆయన జీవితానికి న్యాయం చేయదు. ఆయన ఒక కాలానికి సాక్షి. ఒక ఉద్యమానికి సహచరుడు. ప్రజా చరిత్రకు జ్ఞాపక భాండాగారం. శాంతి–స్నేహ ఉద్యమానికి కార్యకర్త. కమ్యూనిస్టు ఉద్యమంతో జీవితాంతం అనుబంధం కొనసాగించిన యోధుడు. నేటి తరానికి ఆయన జీవితం ఒక ముఖ్యమైన సందేశా న్ని అందిస్తుంది. చరిత్ర పుస్తకాల్లో మాత్రమే ఉండదు; దానిని నిర్మించిన మనుషుల జీవితాల్లో కూడా ఉంటుంది. ప్రజా ఉద్యమాల చరిత్రను కాపాడటం అంటే గతాన్ని స్మరించుకోవ డం మాత్రమే కాదు— భవిష్యత్తు తరాలకు ఒక విలువైన సామాజిక వారసత్వాని ్న అందించడం.

ఏటుకూరి కృష్ణమూర్తి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన జీవించిన విలువలు, ఆయన భద్రపరిచిన జ్ఞాపకాలు, ఆయన విశ్వసించిన ప్రజా ఉద్యమాల ఆశయాలు కొనసాగుతూనే ఉంటాయి. ఒక శతాబ్దం జీవించిన ఆయన జీవితం ముగిసింది; కానీ ఆయన జీవితం చెప్పే చరిత్రకు ముగింపు లేదు.

**కాగితాల రాజశేఖర్**
రాష్ట్ర అధ్యక్షులు, ఇస్కఫ్ (ISCUF), ఆంధ్రప్రదేశ్
9948317270

***(ఏటుకూరి కృష్ణమూర్తి సంస్మరణ సభ అక్టోబర్ 1న హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో జరుగుతున్న సందర్భంగా)***

ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 29, సంచిక: 101 | బుధవారం | 30-09-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

PRAJAPAKSHAM సిటీ

ఢిల్లీలో ఇసి ప్రధాన కార్యాలయం వద్ద

## వామపక్షాల నిరసన ప్రదర్శన

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియ నిలిపివేత సహా
- ఓటర్ల హక్కుల పునరుద్ధరణకు డిమాండ్
- నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు




**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ప్రక్రియపై నెలకున్న పెను వివాదం నేపథ్యంలో న్యూఢిల్లీలోని ఎన్నికల సంఘం కేంద్ర ప్రధాన కార్యాలయం నిర్వచన్ సదన్ ఎదుట వామపక్షాల నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఉదయం నిరసన ప్రదర్శన జరిపారు. భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని లేదా పదవికి ఆయనే స్వయంగా రాజీనామాచేసి విచారణ ఎదుర్కోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. అ త్యున్నతమైన రాజ్యాంగ పదవిలో ఆయన కొనసాగడాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని, అనుమతించబోమని వామపక్షాలు తీవ్ర నిరసన తెలియజేశాయి. ఈ నిరసన ప్రదర్శనలో భారత కమ్యూనిస్టుపార్టీ నాయకురాలు, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్షురాలు నిషా సిధు, సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, ఆ పార్టీ నాయకురాలు బృందా కారత్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ సెంట్రల్ కమిటీ సభ్యులు సుచేతా దే,శ్వేతా రాజ్ తదితరులు ప్రదర్శనలో పాల్గొన్నవారిలో ఉన్నారు. దీంతో పోలీసులు బలవంతంగా వామపక్షాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు.ఎన్నికల సంఘం తమ వాదనలను వినడానికి బదులుగా తమను పోలీసులు అక్రమంగా బలవంతంగా అదుపులోకి తీసుకున్నారని సుచేతాదే విమర్శించారు. ఎం.ఎ.బేబీ ఇతరులపట్ల తరువాయి 8లో




ఇసితో ప్రధాని మ్యాచ్‌ఫిక్సింగ్

# మోదీ రాజీనామా చేయాలి

- తక్షణం సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి
- 'సర్'లో తొలిగించిన 13 కోట్ల ఓటర్ల పేర్లను తిరిగి పునరుద్ధరించాలి
- పార్లమెంట్‌లో, కోర్టుల్లో, వీధుల్లో శాంతియుత పోరాటం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం, ప్రధానమంత్రి మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడినందున నరేంద్ర మోదీ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర ఆరోపణలు చేస్తూ తక్షణమే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, 'సర్'ను రద్దు చేయాలని, ఇప్పటికే తొలగించిన 13 కోట్ల ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన జరిగిన మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ మాజీ అధినేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కె.సి. వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం వేణుగోపాల్‌తో కలిసి జైరాం రమేష్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సిడబ్ల్యుసి సభ్యులు రాహుల్ గాంధీ 20–25 నిమిషాల పాటు ప్రసంగించారని, ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన విషయాలు బయటకు రావడానికి కాంగ్రెస్ కారణమని ఆయన ప్రధానంగా చెప్పారని తెలిపారు. 'హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన అంశాలను రాహుల్ గాంధీ స్వయంగా లేవనెత్తారు. అప్పుడు కొందరు ఆయన మాటలను నమ్మలేదు, కానీ ఇప్పుడు ఆయన చెప్పింది నిజమని రుజువైంది' అని రమేష్ అన్నారు. 'మన దేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగడం లేదు. ఇవి 'మ్యాచ్‌ఫిక్సింగ్' ఎన్నికలు అంటే ఎన్నికల కమిషన్‌కు, ప్రధాని–హోంమంత్రి ద్వయానికి మధ్య కుదిరిన మ్యాచ్‌ఫిక్సింగ్' అని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ కేవలం 'విరోధ్' (వ్యతిరేకత) తెలిపే పార్టీ మాత్రమే కాదు, 'ప్రతిరోధ్' (ప్రతిఘటన) చేసే పార్టీ అని రాహుల్ గాంధీ అన్నారని రమేష్ పేర్కొన్నారు. ఒకప్పుడు రాహుల్ గాంధీకి మాత్రమే ఉన్న దృఢ విశ్వాసం, ఇప్పుడు జవాబుదారీతనం, పారదర్శకత, భారత ఎన్నికల వ్యవస్థ పవిత్రతను పునరుద్ధరించాలనే దేశవ్యాప్త డిమాండ్‌గా మారిందని సిడబ్ల్యుసి ఆమోదించిన తీర్మానం గుర్తించింది. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, సిడబ్ల్యుసి కొన్ని నిర్ణయాలను తీసుకుంది. 'నైతిక, సంస్థాగత అధికారాన్ని కోల్పోయిన సిఇసి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం, 'సర్' ద్వారా రూపొందించబడుతున్న ఓటర్ల జాబితాల విశ్వసనీయత, పారదర్శకత, 'సర్' ప్రక్రియ రాజ్యాంగబద్ధతపై ఉన్న తీవ్రమైన ఆందోళనల దృష్ట్యా, దానిని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేయడం' వంటివి ఉన్నాయి. ఓటర్ల జాబితా నుండి తొలగించిన 13 కోట్ల 30 లక్షల పేర్లను తక్షణమే పునరుద్ధరించాలని కూడా సిడబ్ల్యుసి డిమాండ్ చేసింది. 'ప్రధానమంత్రి (నరేంద్ర మోదీ), హోం మంత్రి (అమిత్ షా) తరపున సిఇసి ఈ బరితెగించిన 'ఓటు దొంగతనం' నిర్వహించింది. వారి రాజీనామా తప్ప మరేదీ మన రాజ్యాంగానికి, తరువాయి 8లో



జ్ఞానేష్ కుమార్ సస్పెన్షన్‌కు పిటిషన్

## విచారణకు 'సుప్రీం' ఓకె

వచ్చేవారం విచారణ ప్రారంభం

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ, ఆయన నేతృత్వంలోని ఎన్నికల సంఘం ఇద్దరు ఎన్నికల కమిషనర్ల (ఇసి)ల ఆమోదం లేకుండానే నిర్ణయాలు తీసుకుందని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్)పై వచ్చే వారం విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందు ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. ఈ విషయాన్ని ప్రస్తావించిన సీనియర్ అడ్వకేట్ వికాస్ సింగ్, చట్టబద్ధమైన పథకం ప్రకారం బహుళ తరువాయి 8లో

మిలిటరీ ఆయుధాల చోరీ కేసు..

## మల్లేశ్‌కు ఆర్మీ సిబ్బంది సహకారం?

ప్రజాపక్షం/హైదరాబాద్

బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాగారం నుంచి తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ కేసులో దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. మాజీ హవాల్దార్ ఉప్పుతొల్ల మల్లేశ్‌ను పోలీసులు విచారిస్తున్న క్రమంలో ఆయుధాగారంలో విధులు నిర్వహించిన నలుగురు మాజీ సహచరులతో అతడికి నిరంతర సంబంధాలు ఉన్నట్లు వెల్లడైనట్టు పోలీసులు చెబుతున్నారు. ఆయుధాగారంలోని సిసి కెమెరాలు రాత్రి సమయంలో పనిచేయకపోవడం, ఆదివారాల్లో గార్డుల కదలికలు తక్కువగా ఉండటం వంటి కీలక సమాచారాన్ని వారితో పరిచయం ద్వారా మల్లేశ్ తెలుసుకున్నట్లు దర్యాప్తులో తేలినట్టు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఆగస్టు 30 రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆయుధాగారానికి చేరుకున్న మల్లేశ్ ఇనుప రాడ్‌తో కోటె, మ్యాగజైన్ గదుల తాళాలు పగులగొట్టి ఆయుధాలను బయటకు తీసుకెళ్లినట్లు విచారణలో వెల్లడైనట్టు సమాచారం. తాళాలు పగులగొట్టేందుకు యాప్రాల్‌లోని రోడ్డు పక్కన దుకాణంలో రూ.150కు ఇనుప రాడ్ కొనుగోలు చేసినట్లు మల్లేష్ చెప్పినట్టు పోలీసులు వెల్లడించారు. సుమారు 90 నిమిషాలపాటు ఆయుధాలను ప్యాక్ చేసి, అక్కడే ఉన్న ఇసుక గన్నీ సంచుల్లో తరువాయి 12లో

## తుమ్మిడిహెట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

- పిఆర్‌ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయండి
- కృష్ణా జలాల వినియోగంపై త్వరగా టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సిఎం తెలియజేశారు. ఢిల్లీలో జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ తరువాయి 8లో

## సమాజ మార్పు కోసం ఉద్యమం

- విద్యార్థులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపు
- సమస్యలపై స్పందించేది వామపక్ష విద్యార్థి సంఘాలే : వినోద్ కుమార్
- ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల్లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




ప్రజాపక్షం/హనుమకొండ

సమాజ మార్పు కోసం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉద్యమించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా రెండవ రోజు హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలోని బాల వికాస కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విష బీజాలు నాటేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, దానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలన్నారు. విద్యార్థి సంఘాల ద్వారానే ఉత్తమ నాయకులు తయారు అవుతారని, తామంతా ఎఐఎస్ఎఫ్ నుంచే వచ్చామని, విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. నాటి నుండి సిపిఐ జాతీయ నాయకులందరూ తరువాయి 12లో



## నందిగ్రామ్‌లో సిపిఐ అభ్యర్థిపై దాడి

- శాంతిగోపాల్ గిరిపై విరుచుకుపడిన బిజెపి గుండాలు
- ఉప ఎన్నికల ప్రచారంలో ఘటన
- ఖండించిన సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం

**నందిగ్రామ్/న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ రాష్ట్రం నందిగ్రామ్ శాసనసభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికలోవామపక్ష ఫ్రంట్ తరఫున పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి శాంతి గోపాల్ గిరిపై సోమవారం నాడు బిజెపి,ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తీవ్రంగా దాడి చేశారు. నందిగ్రామ్‌లోని నైనన్ ప్రాంతంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శుభమ్ బెనర్జీ, నబేందు ఘరాలతో కలిసి ఆయన ప్రచారం చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనను సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గం తీవ్రంగా ఖండించింది. స్థానిక బిజెపి నాయకుడు అకస్మాత్తుగా వారిని అడ్డుకొని తన అనుచరుల సమక్షంలో, ఆ ప్రాంతానికి చెందిన ఒక వామపక్ష కార్యకర్తపై దాడి చేసి చెంపదెబ్బ కొట్టాడు. వెంటనే, ఇతర వామపక్ష కార్యకర్తలు ఆయనను ఆపేందుకు ప్రయత్నించగా, బిజెపి కార్యకర్తలు మిగిలిన వారిపై కూడా విరుచుకుపడ్డారు. వామపక్ష కార్యకర్తలు ఆ దాడిని బలంగా తిప్పికొట్టారు. బిజెపి కార్యకర్తలను వారించేందుకు సిపిఐ అభ్యర్థి శాంతి గిరి ప్రయత్నిస్తుండగా, బిజెపి నాయకుడు, ఆయన అనుచరులు ఆయనపై కూడా దాడి చేశారు. దీంతో ఆయన గాయపడ్డారు. ఆయనను వెంటనే సిపిఐ కార్యకర్తలు ప్రాథమిక చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల తరువాయి 8లో



# క్రీడలు, కళలతో ఉద్యోగుల్లో నూతనోత్సాహం

మంత్రి జూపల్లి కృష్ణారావు

సచివాలయ సాంస్కృతిక ఉత్సవంలో ఉద్యోగుల కళా ప్రతిభకు ప్రశంసలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగులు విధులను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం వంటి రంగాలపై ఆసక్తి పెంచుకోవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. పని ఒత్తిడితో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులకు సాంస్కృతిక కార్యక్రమాలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు కొత్త ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సచివాలయ సాంస్కృతిక ఉత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు స్పెషల్ సిఎస్ మహేష్‌దత్ హెక్కా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు కేవలం ఫైళ్లు, విధులు, బాధ్యతలకే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. కార్యక్రమాల్లో గెలుపు, ఓటమి కంటే పాల్గొనడం, తమ ప్రతిభను ప్రదర్శించడం, సహచరులతో కలిసి ఆనందాన్ని పంచుకోవడమే ముఖ్యమన్నారు. ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు సచివాలయంలో తరచూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉద్యోగులు ఉత్సాహంగా, సమర్థంగా పని చేస్తే దాని ప్రభావం ప్రభుత్వ పనితీరుపైనా, ప్రజలకు అందే సేవలపైనా ఉంటుందని జూపల్లి అన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు రాధాకృష్ణ, తెలంగాణ సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జే. ప్రేమ్, ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, కల్చరల్ సెక్రటరీ యామిని కనకతార తదితరులు పాల్గొన్నారు.

# ‘డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్’ల ఆధునీకరణ

జెటిసి చంద్రశేఖర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రైవింగ్ పరీక్షలను మరింత పారదర్శకంగా, కఠినంగా నిర్వహించడంతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించే లక్ష్యంతో రాష్ట్రంలోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఎఐ ఆధారిత వీడియో అనలిటిక్స్ విధానంతో ఆధునీకరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జెటిసి) ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మొదటి దశలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని ఐదు డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లతో పాటు కరీంనగర్ ఆర్‌టిఓ ట్రాక్‌ను ఆధునీకరించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం కొండాపూర్, నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీందర్ కుమార్, ఆర్‌టిఓ రఘునందన్, హెచ్‌ఎండిఎ అధికారులతో కలిసి జెటిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ పరీక్షల ప్రక్రియలో మానవ జోక్యాన్ని తగ్గించి, సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐ ఆధారిత వీడియో అనలిటిక్స్ ద్వారా డ్రైవింగ్ పరీక్షలను నిర్వహించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో హెచ్‌ఎండిఎ అధికారులు శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, విక్రమ్, ఆర్కిటెక్ట్ ఆకాష్‌రెడ్డి, కమిటీ సభ్యులు అమృత వర్షిణి, అభిలాష్ నాయక్, నేహా, ఆర్‌టిఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పరిసరాలు అభివృద్ధి చేయండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ్మిడికుంట, సున్నం చెరువుల పరిసరాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారులను ఆదేశించారు. రానున్న దసరా పండుగ సందర్భంగా ఈ రెండు చెరువులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను సమీక్షించారు. చెరువుల్లో పూడిక తీత, లోతు పెంపు పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, వీటి చుట్టూ బలమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పాత్వే, గ్రీనరీ (హరితహారం) పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సున్నం చెరువు ఇన్‌లెట్ కాలువ వద్ద కల్వర్టు నిర్మించి, రహదారి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గాయత్రినగర్, బోరబండ ప్రాంతాల నుంచి చెరువుకు వచ్చే దారులను కూడా ఆధునీకరించాలని, ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలను సుందరీకరించాలని ఆదేశించారు. ఒకప్పటి సున్నం చెరువుతో పోలిస్తే నేడు ఎంతో అద్భుతమైన మార్పు వచ్చిందని స్థానికులు ఈ సందర్భంగా కమిషనర్‌ను కలిసి సంతోషం వ్యక్తం చేశారు. ఎన్ కన్వెన్షన్‌ను తొలగించి తమ్మిడికుంటను పునరుద్ధరించిన తీరును, ఎన్నో అవరోధాలను అధిగమించి చెరువులను సుందరంగా తీర్చిదిద్దిన హైడ్రా కృషిని వారు ప్రశంసించారు.



## ఒక్క నిమిషం.. గుండె ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం

యశోద హాస్పిటల్స్ ‘1 మినిట్ హార్ట్ ఛాలెంజ్’కు హైదరాబాద్‌లో విశేష స్పందన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు రోజువారీ జీవితంలో శారీరక చురుకుదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో యశోద హాస్పిటల్స్ నిర్వహించిన ‘1 మినిట్ హార్ట్ ఛాలెంజ్’కు హైదరాబాద్‌లో విశేష స్పందన లభించింది. వరల్ హార్ట్ డే సందర్భంగా కెబిఆర్ పార్క్, బొటానికల్ గార్డెన్స్, ట్యాంక్‌బండ్, కమ్యూనిటీ సెంటర్లు, సికింద్రాబాద్ క్లబ్, జిమ్‌లు, యశోద హాస్పిటల్స్ నాలుగు యూనిట్లలో కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వేలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రెడ్‌మిల్, స్టేషనరీ సైక్లింగ్, స్కిప్పింగ్, పుష్‌అప్స్ వంటి వ్యాయామాల్లో పాల్గొన్న వారికి వైద్య బృందాలు పర్యవేక్షణ అందించాయి. తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, హైదరాబాద్ సిపి వి.సి.సజ్జనార్ కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్న సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ‘1 మినిట్ హార్ట్ ఛాలెంజ్’ ఉద్దేశమని ఆయన తెలిపారు.

## గురుకుల క్యాంపస్‌లో మహిళా సిబ్బంది

# విద్యార్థుల భద్రతపై ఆందోళన

లైంగిక వేధింపుల ఫిర్యాదులపై విచారణ జరపాలి : సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి,/యాచారం/ఇబ్రహిం-పట్నం :** ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడలోని బిసి, మైనారిటీ గురుకుల క్యాంపస్‌లో విద్యార్థులు, మహిళా సిబ్బంది భద్రతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి క్యాంపస్‌ను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శ్రీలతతో మాట్లాడి క్యాంపస్‌లోని పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, సిబ్బంది నుంచి సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించలేదని వారు ఆరోపించారు. క్యాంపస్‌లో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్‌పై విద్యార్థులు, మహిళా సిబ్బంది లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు విచారణలో నిజమని తేలితే సంబంధిత వ్యక్తిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాము క్యాంపస్‌ను సందర్శించిన సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాటా ఎంట్రీ ఆపరేటర్ హాజరు కాలేదని, దీనిపై కూడా అధికారులు వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా విద్యార్థులు, సిబ్బంది ఉండే క్యాంపస్‌లో పురుష సిబ్బంది నియామకంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. గురుకుల విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన, భయరహిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా స్పందించాలని సూచించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల నుంచి పూర్తి నివేదిక తెప్పించుకోవాలని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల్ పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలలో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు విద్యను అందించాలన్నారు. పాఠశాలలో సమస్యలు ఉంటే పరిష్కరిస్తానని తెలిపారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపల్ శారదను ఆదేశించారు.

## ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించే

# అధికారులపై చర్యలు తప్పవు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగు నీరు, విద్యుత్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, తహసీల్దార్ సునిత, ఎంపిడిఒ ప్రమీలా, ఎడిఎ విద్యాధరీతో పాటు నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధిస్తాం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** త్వరలో జరగనున్న మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు బిజెపి సన్నాహాలు ప్రారంభించింది. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడంతో పాటు బూత్ స్థాయి నుంచి బలమైన కార్యాచరణ రూపొందించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ రెండు ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రభావం చూపనున్నాయని రాంచందర్‌రావు అన్నారు. నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగుల సమస్యలు, నెరవేరని హామీలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను బిజెపి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందని, అభ్యర్థుల ఎంపిక అనంతరం పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేసి రెండు స్థానాల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై దృష్టి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో పాఠశాలల నిర్వహణ, విద్యాప్రమాణాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాలల్లో బోధనా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారులు (ఎంఇఒ), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు (సిహెచ్‌ఎంఎస్), అకడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ (ఎపిఐటి) బృందాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల నమోదు, ఎఫ్‌ఎల్‌ఎన్, పాఠశాలల సందర్శనలు, అభ్యసన ఫలితాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరుపై కఠినంగా వ్యవహరించాలని, ప్రతి ఉపాధ్యాయుడు ప్రతిరోజూ తప్పనిసరిగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా లేదా సరైన కారణం లేకుండా ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఇఒను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. డ్రాప్‌బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలను ఇంపోర్ట్ చేయాలని సూచించారు. డ్రాప్‌బాక్స్‌లో ఏ ఒక్క విద్యార్థి వివరాలు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. మండలాలు, కాంప్లెక్స్‌ల వారీగా విద్యార్థుల నమోదు, హాజరు ప్రగతిని నిరంతరం సమీక్షించాలని, వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, అకడమిక్ బృందాలు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచాలని అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

## వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** అక్టోబర్ 4న ఆదివారం ఎన్జీవోస్ కాలనీ వివేకనంద పార్కులో మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ నందకిషోర్, అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి గిరిజాపతి, కోశాధికారి అభిరామ్ పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీల్లో శంకర్‌పల్లి జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం మోకిలా రైతు వేదిక వద్ద సోమవారం అండర్ 14 జోనల్ స్థాయి క్రీడల్లో జరిగిన వాలీబాల్ పోటీల్లో శంకర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వాలీబాల్ ఆడిన నలుగురు విద్యార్థులు ఎం.కిరణ్ నాయక్, వి. సాయికుమార్, ఎండి. సుఫియాన్, ఎం.ధనుష్ జిల్లాకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అతిక్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు వాలీబాల్ లో మొదటి స్థానంలో గెలిచినందుకు అభినందించారు. వాలీబాల్‌లో గెలిచిన టీంకు మోకిలా సర్పంచ్ చిట్టెంపల్లి శేఖర్ మెమెంటో అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాపా గారి ఆశీర్వాదం, కవ్వ గూడెం శ్రీను, పిడి అరుంధతి, మోకిలా పిఎసిఎస్ చైర్మన్ గోపాల్, మోకిలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌండ్ర సత్యం పాల్గొన్నారు.

## నిరుపేదలకు సుకన్య సమృద్ధి యోజన పథకం వరం



**ప్రజాపక్షం/షాబాద్:** నిరు పేదలకు సుకన్య యోజన పథకం గొప్ప వరం అని లక్ష్మ ణరావు గూడ సర్పంచ్ శ్రీరంగాపురం కుమార్ అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని లక్ష్మ ణరావుగూడలో కారోబార్‌గా గ్రామంలో సేవలందించిన గంటల శివకుమార్ కొన్ని రోజుల కిందట అకస్మికంగా మరణించారు. అతడి కుటుంబానికి సర్పంచ్ ఆధ్వర్యంలో యువకులు అండగా నిలిచి మరణించిన శివకుమార్ 11 నెలల చిన్నారికి రూ.1లక్ష50 వేల రూపాయలు సేకరించి చిన్నారి పేరుపై సుకన్య యోజన పథకం కింద పోదుపు సంఘంలో డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సిపిఆర్‌ఒను కలిసిన జెడ్‌పిహెచ్‌ఎస్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**ప్రజాపక్షం/షాబాద్:** సిఎంసిపిఆర్‌ఒను షాబాద్ జెడ్‌పిహెచ్‌ఎస్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. షాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళశాల, ప్రభుత్వ ఆసుపత్రి, అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సహకారంతో ముఖ్యమంత్రి కార్యాలయంలో అధికారులను కలసిన్నట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి అభివృద్ధి జరిగేలా చూస్తామని హామీ ఇచ్చిన్నట్లు పేర్కొన్నారు.

## రైతు సంక్షేమం కోసం వ్యవసాయ సహకార సంఘం నిరంతరం కృషి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతు సంక్షేమం కోసం వ్యవసాయ సహకార సంఘం నిరంతరం కృషి చేస్తున్నట్లు వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం షాద్‌నగర్ వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు కోటి రూపాయల ధీర్ఘాకాలిక రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పని ముట్లు, రాయితీ పై అందిస్తున్నట్లు పేర్కొన్నారు.వ్యవసాయ సహకార సంఘాని బలోపేతం చేసేందుకు రైతులందరూ సహాకరించాలని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ఇతర రైతులకు సహకరించాలని వివరించారు. చాల మంది రైతులకు డైరీ ఫాంకు అధిక రుణాలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాక్షులు శేఖర్, డైరెక్టర్లు అంబాటి విజయ్, రత్నమ్మ, శ్రీధర్ రెడ్డి, దాస్య నాయక్, రాజేందర్ రెడ్డి, రఘునందన్ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నేడు సహకార సంఘం సమావేశం

**ప్రజాపక్షం/యాచారం :** బుధవారం యాచారం మండల సహకరా సంఘం కార్యాలయంలో రైతుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని సహకార సంఘం చైర్మన్ తొటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి, సహకార సంఘం సిఈఒ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

### నేడు ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటన

యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వివిధ గ్రామాల్లో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో అయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని అయన కోరారు.

## ఇసి 2పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కృత్రిమ మేధస్సు యంత్ర అభ్యాస రంగాల్లో ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు అనురాగ్ యూనివర్సిటీలోని ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలోని థింక్‌క్లౌడ్ క్లబ్ ఏడబ్ల్యూఎస్ అకాడమీ సహకారంతో సెప్టెంబర్ 9న అమెజాన్ ఈసీ2పైఒక రోజు ప్రత్యేక శిక్షణతో నిర్వహించింది.130 మంది విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ ఎ.మల్లికార్జున రెడ్డి ప్రారంభించి. క్లౌడ్ కంప్యూటింగ్‌లో పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. ప్రత్యేక్ష శిక్షణతో సాంకేతిక నైపుణ్యాలు సమన్వయకర్త డాక్టర్ కెసి శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ ఈసీ2 వినియోగంపై ప్రయోగాత్మక శిక్షణ అందించారు. సాంకేతికతతో అనుసంధానించేలా కార్యక్రమం సాగింది.



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించక పోతే ఇక పోరుబాటే

తెలంగాణా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘ కోశాధికారి మోతె వెంకట రెడ్డి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించటంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం సరైన దిశలో చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని తెలంగాణా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘ కోశాధికారి మోతె వెంకటరెడ్డి హెచ్చరించారు. మల్లాపూర్‌లో మంగళ వార ం నిర్వహించిన ఉప్పల్ నియోజకవర్గ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా నేటి వరకు జర్నలిస్టుల సంక్షేమ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టక పోవటం విచారకరమన్నారు. ప్రజాపాలన పేరిట జర్నలిస్టులకు పెద్దపీట వేస్తామంటూ సిఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలుగా మారి కేవలం కాగితాలకే పరిమితమయ్యా యన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లాలోని పాత్రికేయు లందరికి అక్రిడిటేషన్‌లు దక్కేలా సంఘం కృషి చేసిందని, సంఘటితంగా ఉంటేనే సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరమవుతాయన్నారు. జిల్లా కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.మల్కయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాంప్రసాద్ శర్మ, కెసి మోహన్, పంజాల శ్రీనివాస్ గౌడ్, అక్బర్, ఆదిమూలం శ్రీనివాస్, రంగు మల్లేష్, జిల్లా హెల్త్ కమిటి కన్వీనర్లు చంద్రమౌళి, విజయ్, టియుడబ్ల్యుజె ఉప్పల్ నియోజకవర్గ కమిటి వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, ఉపాధ్యక్షుడు నర్సింగ్, కోశాధికారి శంకర్, ఉప్పల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జ్యోతిర్మయచారి, ఉప్పల్ ప్రింట్ అండ్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఓటరు నమోదు వేగవంతం చేయాలి : కెటిఆర్

ప్రజాపక్షం/నవాబుపేట్: తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్)ను నవాబుపేట్ మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గజ్జలపూర్వకంగా శాంతికుమార్ కలిశారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్‌తోపాటు కెటిఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా రానున్న పట్టభద్రుల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కెటిఆర్ సూచించారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అలాగే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు పార్టీ మరింత చేరువ కావాలని సూచించినట్లు శాంతికుమార్ తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కెటిఆర్ సూచించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారని తెలిపారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కెటిఆర్ పేర్కొన్నట్లు శాంతికుమార్ వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత ఉంటుందని కెటిఆర్ హామీ ఇచ్చినట్లు శాంతికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్‌పార్టీ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/దుండిగల్:పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంస్థాగత నిర్మాణం లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ దమ్ముల యాదగిరి మాదిగ అధ్యక్షతన సూరారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అండ్ బాబు జగ్జీవన్ రామ్ భవనంలో జరిగిన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జ్ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ సమావేశానికి విచ్చేసి నూతన కమిటీలను ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా కొప్పుల దేవరాజు మాదిగ, ఎంఎస్‌పి పార్టీ మండల అధ్యక్షులుగా మంచాలకట్ల నాగేశ్వరరావు మాదిగ అధికార ప్రతినిధిగా సంతూర్ శ్రీనివాస్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బుర్రి పొంచ మాదిగ ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మాజీ అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జాతీయ నాయకులు కేశపాగ రామచందర్ మాదిగ, సిలువేరు శ్రీనివాస్ మాదిగ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి కారుతో ఢీ... ఏడుగురికి గాయాలు

ప్రజాపక్షం/చర్లపల్లి: కారు ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం త్రిశూల్ బార్‌లో పనిచేస్తున్న ఏడుగురు పని ముగించుకుని ఇంటికి బయలుదేరుతున్న సమయంలో మార్గమధ్యంలో దేవి మెడికల్ షాప్ ఎదురుగా న్యూడైమెన్షన్ కాలేజ్ దగ్గరలో గుర్తు తెలియని వ్యక్తి కారు(ఏపి 10 ఏయు 1232)ను నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా నడుపుతూ ఏడుగురిని ఢీకొట్టి పారిపోయాడు. గాయాలైన వారిని శ్రీకర హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స చేశారు. ముగ్గురు అజయ్‌కుమార్, బిపిన్ కుమార్, రాకేష్ యాదవ్‌లకు అధిక గాయాలు కావడంతో చికిత్స అవసర నిమిత్తం సూర్య హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### ఎంఎంసి, సిఎంసి కమిషనర్ల పర్యటనలు

# అధికారుల ఉరుకులు పరుగులు





ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు డా. సృజన, టి.వినయ్ కృష్ణారెడ్డిలు తమ పరిధి ప్రాంతాల్లో ప్రతి రోజూ క్షేత్ర స్థాయి పర్యటనలతో అధికారులతో పాటు కింది స్థాయి అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. తెల్లవారు జాము నుండే కమిషనర్లు చిన్న చిన్న గల్లీలు, బస్తీలను సైతం విడిచి పెట్టకుండా ప్రతి విషయాన్ని పరిశీలిస్తూ దిశానిర్దేశం చేస్తుండటంతో పాటు ఎక్కడ ఎలాం టి పొరపాట్లు కనిపించినా బాధ్యులపై చర్యలు తీసుకొంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎప్పుడు ఏ సమయంలో తమ ప్రాంతానికి వస్తా రో, ఎలాంటి ఆగ్రహానికి గురికావల్సి వస్తుందో అన్న భయంతో సర్కిల్ ప్రాంత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. పారిశుద్ధ్య పనులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ ప్రధాన కూడళ్లు, నివాసిత ప్రాంతాల పక్కన చెత్త పేరుకొని పోవటం, రాకపోకలకు అంతరాయం కలిగేలా ఉండే చెట్ల కొమ్మలను తొలగించటం, రోడ్లపై గుంతలు, తాత్కాలిక మరమ్మత్తు పను లు, విద్యుత్, టెలిఫోన్ స్థంభాలపై కేబుల్, ఇంటర్‌నెట్ సంబంధించిన వైర్లు పొదల్లా చుట్టుకొని ఉండటం, పాదచారుల మార్గాల దురాక్రమణలు, కబ్జాలు, అక్రమ కట్టడాలను పరిశీలిస్తూ పర్యటనలో తమ వెంట ఉన్న సంబంధిత అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేస్తున్నారు.

**నాచారం సర్కిల్‌లో...**మంగళవారం నాచారం సర్కిల్ పరిధిలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నపూర్ణ కాలనీ, పాత మీర్‌పేట, నరసింహగర్, ఎర్రకుంట, స్నేహపూరి కాలనీ తదితర ప్రాంతాల్లో సర్కిల్ అధికారులు, సిబ్బందితో కల్సి పర్యటించారు. అన్నపూర్ణ కాలనీలోఅనధికారికంగా పేరుకొని పోయిన నిర్మాణ, కూల్చివేతలకు సంబంధించి వ్యర్థ వస్తువులను చూసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ర్యాంపులు, ప్లాంటర్ బాక్సులను తొలగించి రహదారి మార్జిన్లను సక్రమంగా ఉంచాలని, స్థంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను సంబంధిత విభాగ అధికారులు సమన్వయంతో తీసేయాలని సూచించారు. పాత మీర్‌పేట ప్రాంతంలో ప్రజా స్థలాలను ఆక్రమించి చేసిన నిర్మాణాలను కూల్చివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. ఎర్రకుంటలో జరుగుతున్న యాంటీ లార్వా ఆపరేషన్లు పరిశీలించిన కమిషనర్ దోమల అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను నిరంతరం గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా సర్వేలెన్స్ కొనసాగిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్నేహపురి కాలనీ, హబ్సిగూడ కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్ ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ జంక్షన్ల వద్ద ఎలాంటి అడ్డంకులు లేకుండా చేయటం ద్వారా వాహన రాకపోకల్లో ఆటంకం కలుగకుండా చూడాలన్నారు.

**గాజులరామారం సర్కిల్ పరిధిలో...** గాజుల రామారం సర్కిల్ పరిధిలోని షాపూర్‌లోని కళావతినగర్ ప్రాంతాలను పర్యటించిన సైబరాబాద్ కమిషనర్ సృజన ప్రతిపాదించిన మోడల్ స్మశాన వాటకను పరిశీలించి గ్యాలరీ, టాయిలెట్ కాంప్లెక్స్, పరిపాలనా భవనం, నడక మార్గాలు, అంత్యక్రియల కోసం ఏర్పాటు చేస్తున్న సౌకర్యాల పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయన్న విషయాలను అడిగి తెల్సుకొన్నారు. ప్రణాళిక ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా గడువులోగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గాజుల రామారం సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదన, ప్రణాళికను పరిశీలించిన కమిషనర్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టి వేగవంతం చేయాలన్నారు. గాజుల రామారం స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న సౌకర్యాలను త్వరితగతంగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని, అదనంగా స్విమ్మింగ్, స్కేటింగ్ వంటి సౌకర్యాల ఏర్పాట్లను సైతం చేయాలని సూచించారు.

# పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చెందాలి

చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/కోట్‌పల్లి : వికారాబాద్ జిల్లా, కోటపల్లి మండలాన్ని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, బిజెపి పార్లమెంటరీ పార్టీ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ రోజు కోటపల్లి మండలంలోని లింగంపల్లి, బుగ్గాపురం గ్రామాలతో పాటు కోటపల్లి మండ ల కేంద్రంలో సుమారు రూ.50 లక్షల ఎంపి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా 'అంగన్ మిలాన్' కార్యక్రమంలో కోటపల్లి మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు బొమ్మలు, ఆట వస్తువులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. అదే విధంగా అంగన్వాడీ ఆయాలకు సన్మానం చేశారు.

అనంతరం శివాలయం సమీపంలో గతంలో పార్లమెంట్ సభ్యునిగా ఉన్న సమయంలో సుమారు రూ.21 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన యువజన క్లబ్ భవనాన్ని కోటపల్లి ప్రజల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా యువజన క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. కోటపల్లి మండలం పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చెందేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

2013లో తాను కోటపల్లి ప్రాంతాన్ని సందర్శించినప్పుడు మత్స్యకార కుటుంబాలకు చేపల ద్వారా కేవలం రూ.1,200 మాత్రమే ఆదాయం వచ్చేదని, తాను ఎంపీగా ఎన్నికైన తర్వాత కోటపల్లి చెరువులో చేపల పెంపకం అభివృద్ధికి ప్రాజెక్టు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం ఒక్కో మత్స్యకార కుటుంబానికి సుమారు రూ.18,000 ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. మత్స్యకారుల ఆదాయం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత అనంత రం కొంతమంది నాయకుల స్వార్థపూరితమైన చేష్టల వలన కోటపల్లి మండల అభివృద్ధికి సంబంధించిన కొన్ని ప్రతిపాదనలు, తీర్మానాలు ముందుకు సాగకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.

స్థానిక మత్స్యకారులు ఐకమత్యంతో ఉండాలని, గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ రావుల బస్సమ్మ భర్త సంగమయ్యపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఈ ఘటన అమానవీయమని పేర్కొంటూ, భారతీయ జనతా పార్టీ తరపున బాధిత కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేసారు. కోటపల్లి మండ ల అభివృద్ధిపై తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అవసరమైతే మండల కేంద్రంలో సొంత ఇల్లు నిర్మించుకోవాలని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు సహా ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి, తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పరి రమేష్ కుమార్, వికారాబాద్ జిల్లా అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, శేరి శ్రీధర్ రెడ్డి, నరోత్తమ్ రెడ్డి, పతంగి పాండు, బుగ్గాపురం సర్పంచ్ మహేందర్ దొర, కోటపల్లి సర్పంచ్ రావుల బస్సమ్మ, మండల బిజెపి అధ్యక్షులు శివకుమార్, గ్రామ పెద్దలు, మత్స్యకార కుటుంబాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీరు, ఆలయ నిర్మాణానికి ప్రాధాన్యం



ప్రజాపక్షం/నవాబుపేట్: ఆర్కాతల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పలు చర్యలు చేపట్టారు. గ్రామంలో పనిచేయకుండా ఉన్న చేతిపంపును మరమ్మతు చేసి, అందులో మోటార్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా నీటి సరఫరా సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో టైప్ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. త్రీఫేజ్ విద్యుత్ సమస్య కారణంగా నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా సింగిల్‌ఫేజ్ మోటార్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ గంజాయి రేణు క రాములు తెలిపారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నా రు. అదే విధంగా గ్రామం లోని పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగం గా స్లాబ్ వరకు పనులను పూర్తి చేశారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ తాగునీరు, ఆలయ నిర్మాణం తదితర పనులను చేపడుతున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంజాయి రేణుక రాములు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ వడ్డె రాములు, ఉప సర్పంచ్ శివలీల బాగయ్య, వార్డు సభ్యులు వడ్డె వెంకటయ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతు కిసాన్ మేళా

ప్రజాపక్షం/శామీర్‌పేట : మేడ్చల్ మల్కాజ్‌గిరి వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో నేడు బుధవారం అంతాయిపల్లిలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు రైతులకు కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నామని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే చాల కంపెనీల స్టాల్స్ ఉంటాయని చెప్పారు. శామీర్‌పేట మండలానికి చెందిన రైతులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని కోరా రు.

## హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ దీపక్‌తివారి



ప్రజాపక్షం /పరిగి : పరిగిలో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ హాస్టల్ ను మంగళవారం అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. హాస్టల్లో వంటశాలను,వంట సామాగ్రి విద్యార్థులకు అందిస్తున్న భోజనము ప్రతి రోజు అమలు చేస్తున్నా మెనూ వివరాలు పరిశీలించారు.మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచించారు.విద్యార్థులు క్రమం తప్పకుండా చదువుకునేలా ప్రోత్సహించాలని 10 ఫలితాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం పరిగి మున్సిపల్ లో ఎస్. ఐ.ఆర్. ఓటర్ సవరణ నోటీసులపై పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను పరిశీలించారు.పరిగి లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలు తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆస్పత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి మాధవరెడ్డి, ఆర్డీఓ వాసు చంద్ర, ప్రిన్సిపల్ సౌజన్య, మున్సిపల్ కమిషనర్ మల్లేశం,తాసిల్దార్ వెంకటేశ్వరి, ఆసుపత్రి సూపర్డెంట్ రాజశేఖర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ప్రజాపక్షం/పరిగి : సిఎం రిలీఫ్ ఫండ చెక్కు పేదలకు వరం లాంటిదని పిఎసిఎస్ డైరెక్టర్ ఎం. సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పరిగి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన బొంపల్లి నవీన్ కుమార్ కు 45,000/— సిఎం రిలీఫ్ ఫండ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బి.రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జి.రాములు, వై.జంగయ్య, బి.బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.





## ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్ మనుచౌదరి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవం తం చేయటం ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో లక్ష్యాన్ని 70శాతం దాటేలా చూడాలని క్షేత్రస్థాయి సంబంధిత విభాగాల సిబ్బంది, అధికారులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు సన్నాహాలు, రైతుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా లో ప్రతి మండలానికి ఒక కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని, స్థల సేకరణ, రవాణా ఆలస్యం కాకుండా చూడాలని, జిల్లాలో ప్రత్యామ్నాయ గోదాములు, అదనపు నిలువ చేసేందుకు స్థలాలను గుర్తించాలన్నారు . అన్ని కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్ షీట్లు, మాయిశ్చర్ మీటర్లు, అటోమేటిక్ క్లీనింగ్ యంత్రాలు, ఇతర అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు తగినన్ని వాహనాలను సిద్ధం చేసుకోవాలని రవాణా కంట్రాక్టర్లను ఆదేశించారు. అన్‌లోడింగ్ వద్ద ఎలాంటి జాప్యం లేకుండా చూడటం, కూలీల కొరత లేకుండా చేసుకోవటం అవసరమన్నారు. తహసీల్దార్లతో సమన్వయం చేసుకొని ధాన్యం ఆరబోసుకొనేందుకు అదనపు స్థలంకోసం ప్రభుత్వ లేక ప్రయివేట్ ఖాళీ స్థలాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించేందుకు వాతావరణ ముందస్తు హెచ్చరికలను పరిగణలోకి తీసుకోవాలని రైతులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా సివిల్ సప్లై డిఎం సుగుణబాయి. సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## యువతకు స్పోర్ట్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగం : స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం/వికారాబాద్: యువతలో ప్రతిభను వెలికితీసి కీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు స్పోర్ట్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతయని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా నుండి అన్ని జిల్లాలపై గెలుపొంది ఫుట్‌బాల్ నేషనల్ టీం తో గెలిచేందుకు వికారాబాద్ జిల్లానుండి బెంగుళూరుకి వెళ్తున్న టీం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు29 నేషనల్ స్పోర్ట్స్‌డే జరుపుకుంటున్నారు. ఆమే గోల్డ్ మెడల్ , సిల్వర్ మెడల్ తీసుకువచ్చిందన్నారు. క్రీడకారులు మన ప్రాంతానికి మంచి గుర్తింపుతేవాలి అన్నారు. తల్లిదండ్రులకు మండల స్థాయినుండి రాష్ట స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థులు వాకింగ్, వ్యాయామం చేయాలని, క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధనచేసి రాష్ట, జాతీయస్థాయిలో రాణించాలి అన్నారు. ప్రతి యువకుడు క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యంగా, ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం నుండి తన వంతు సహాయం అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిఇఒ అబ్దుల్ ఘనీ, నర్సింలు, అంజయ్య, సంతోష్, వినయ్‌కుమార్, అర్థ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయి

అలియాబాద్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటి లాల్‌గడిమలక్‌పేటలోని సిఎంఆర్ పాఠశాలలో 70 వ ఎస్‌జిఎఫ్ క్రీడలు నిర్వహించారు. అండర్ 17 బాలుర విభాగంలో శామీర్‌పేట జోన్ ప్రధమ స్థానంలో నిలువగా ఘట్‌కెసర్ జోన్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అండర్ 17 బాలికల విభాగంలో శామీర్‌పేట జోన్ ప్రధమ స్థానాన్ని, కుత్బుల్లాపూర్ జోన్ ద్వితీయ స్థానాన్ని పొందాయి. అదే విదంగా అండర్ 14 బాలుర విభాగంలో శామీర్‌పేట ప్రధమ స్థానం సాధించగా, కుత్బుల్లాపూర్ జోన్ ద్వితీయ స్థానం నిలిచింది. అండర్ 14 బాలికల విభాగంలో కత్బుల్లాపూర్ జోన్ ప్రధమ స్థానాన్ని కైవసం చేసుకోగా శామీర్‌పేట జోన్ ద్వితీయ స్థానం సాదించింది. అనంతరం విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నూతన క్రీడా పాలసీని తీసుకవచ్చి క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట జోనల్ సెక్రటరి గుర్రం సత్తిరెడ్డి, ఎంఇఒ కమలాకర్, సిఎంఆర్ పాఠశాల డైరక్టర్ స్నితిజారెడ్డి, మేడ్చల్ జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరి అరుణజ్యోతి, వివిధ జోన్ల కార్యదర్శులు, పిఇటిలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 85 మంది విద్యార్థులకు పరీక్ష రుసుమును విద్యుత్ సౌధ విశ్రాంత ఉద్యోగి సిరిపురం రంగయ్య కుమారుడు దివంగత హరిప్రసాద్ జ్ఞాపకార్థం అందజేశారు.పాఠశాలలో నిర్వహంచిన కార్యక్రమంలో విద్యార్థుల పదో తరగతి పరీక్ష రుసుమును ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణకు అందించారు.విశ్రాంత ప్రధనానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆంగ్ల భాషపై పట్టు అవసరమని అన్నారు.రంగయ్యకు ప్రధానోపాధ్యాయుడు,విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హస్తం టికెట్ ఎవరికి?





ప్రజాపక్షం/ఖైరతాబాద్: ఊహించినట్లుగానే ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు బైపోల్ తప్పని పరిస్థితి. అయితే హస్తం పార్టీ పరిస్థితి ఏమిటి? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. గ్రాఫ్ పడిపోయిన తాజా మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ రెండు రోజులు సైలెంట్‌గా ఉన్నా.. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల అయిన మరుసటి రోజు బయటకు వచ్చి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నా ఆయనలో జోష్ కనిపించలేదు. ఖాళీ అయిన స్థానాన్ని ఆరు నెలల వ్యవధిలో భర్తీ చేయాల్సి ఉన్నందున వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పలు రాష్ట్రాల ఎన్నికలతో పాటే ఖైరతాబాద్ బైపోల్ తప్పదనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే హస్తం పార్టీ నుంచి టికెట్ ఎవరికి? అనేది సస్పెన్స్‌గా మారింది. తాజామాజీ దానం టికెట్ కోసం పోటీ పడినా.. ఆయనకు టికెట్ దక్కే అవకాశం లేదనే ప్రచారం ఊపందుకున్నది. గెలిచిన ఈ మూడేళ్లలో ఆయన సెగ్మెంట్‌లో చేసింది ఏమీ లేదని విమర్శలు పెరిపోతున్నాయి. పైగా పార్టీ మారిన వ్యవహారం కూడా ప్రజలకు నచ్చడం లేదు. ప్రధానంగా టికెట్ రేసులో ఉన్న గద్వాల విజయలక్ష్మి కి కార్పొరేషన్ పదవి దక్కడంతో ఆమె నుంచి పోటీ లేకుండా పోయింది. ఇక దివగత పిజెఆర్ కూతురు విజయారెడ్డి గట్టి పోటీ ఇస్తున్నారు. గతంలో ఆమె మేయర్ పదవికి పోటీపడినా.. కెకె కారణంగా ఆమెకు పదవి దక్కలేదు. ఈ దఫా టికెట్ దక్కే అవకాశాలు వంద శాతం ఉన్నట్లు సమాచారం. ఇక రోహిన్‌రెడ్డి పోటీపడినా.. ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట్ నుంచి బరిలోకి దిగి ఓటమి పొందిన విషయం విధితమే. సిఎంకు అత్యంత సన్నిహితుడైన రోహిన్‌రెడ్డి ప్రజల్లో అంతగా చొరవ లేని కారణంగా పరిస్థితి ఆశాజనకంగా లేదని సమాచారం. ప్రధానంగా టిఆర్‌ఎస్, బి జెపి నుంచి గట్టి పోటీ ఉంటున్నందున స్థానికత కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే టిడిపి, టిఆర్‌ఎస్, జనసేన ఖైరతాబాద్‌లో పోటీ చేస్తామని ప్రకటించడంతో బహుముఖ పోటీ తప్పదని తేలిపోతున్నది. స్నేహపూర్వకంగా ఎంఐఎం సహకారం అందిస్తే కలిసివచ్చే అవకాశాలున్నాయి. అయితే 'సర్' ప్రక్రియ ప్రారంభానికి ముందు ఖైరతాబాద్ సెగ్మెంట్‌లో 2,93,667 మంది ఓటర్లు ఉండగా.. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలయ్యే సమయానికి ఈ సంఖ్య 1,70,195కి పడిపోయింది. 'సర్'లో భాగంగా ఎన్యూమరేషన్ ఫామ్‌లు సమర్పించినవారిని మాత్రమే డ్రాఫ్ట్ జాబితాలో చేర్చారు. అంటే 1,23,472 మంది పేర్లు సందిగ్ధంలో పడిపోయాయి. బిఎల్‌ఓలు వచ్చిన సమయంలో ఇండ్లలో లేనివారు, ఇళ్లు ఖాళీ చేసిన వారు, చనిపోయిన వారు, డబుల్ ఓటర్లు, తదితరాల కింద తొలగించగా.. 81,404 మంది ఓటర్లు నోటీసులు అందుకోవడం జరిగింది. ఏదేమైనా ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సర్ ప్రక్రియ కీలకభూమిక పోషించనుందని చెప్పవచ్చు.

## పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/సనత్‌నగర్: కెటిఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఎ స్మయిల్ కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థిని ఆఫ్రీన్ పూర్తి విద్యా బాధ్యతలను బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు బొంతల రాజితారావు స్వీకరించారు. ఆఫ్రీన్ చదువుకు అవసరమైన పూర్తి సహాయాన్ని అందిస్తూ, ఆమె పీజీ వరకు చదువుకునేలా విద్యా ఖర్చులను తానే భరిస్తానని రాజితా రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.2.5 లక్షల చెక్కును కేటీఆర్ చేతులమీదుగా వారికి అందజేశారు. అనంతరం రజితారావు మాట్లాడుతూ, విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

## లాడ్జిలో యువతి మృతి

ప్రజాపక్షం/అమీర్‌పేట్: లాడ్జిలో ఓ యువతి మృతిచెందిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్ పరిధిలోని గోకుల్ ప్రైడ్ ఓయో లాడ్జ్ రూమ్ నెం: 103లో సి.గణేష్ అనే వ్యక్తి పేరుతో ఇద్దరు దిగారు. అయితే తెల్లవారేసరికి అతనితో వచ్చిన యువతి ప్రాణాలు కోల్పోయి ఉంది. సమాచారం అందుకున్న ఎస్‌ఆర్ నగర్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వద్ద ఉన్న ఆధార్ కార్డులో పేరు దుర్గ అని ఉండగా, గతంలో భర్త దాడి చేయడంతో చికిత్స పొందిన ఆస్పత్రి రికార్డుల్లో ఆమె పేరు శిరీష అని నమోదైనట్లు పోలీసులు గుర్తించారు.

## బోరింగ్ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/కార్వాన్: ప్రజల సౌకర్యార్థం జియాగూడ డివిజన్ లోని ఇన్నర్ రింగ్ రోడ్ (బై పాస్ రోడ్)లో ఉన్న ఆరెకటిక సంఘం (గ్రేవ్ యార్డ్)లో నూతన బోరింగ్ పనులను ప్రారంభించామని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జియాగూడ మాజీ కార్పొరేటర్ బోయిని దర్శన్ విచ్చేసి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బోయిని దర్శన్ మాట్లాడుతూ.. ఆరెకటిక సంఘం ప్రతినిధుల కోరిక మేరకు గ్రేవ్ యార్డ్‌లో నిర్వహణ, ట్రీ కటింగ్, ప్రహరీ నిర్మాణం, నూతన గేట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేత మద్దిర సత్యనారాయణ, నాయకులు ఎన్.జగదీష్, టిడిపి నాయకులు నర్సింగ్‌రావు,ఆరెకటిక సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్, పూరుషోత్తం గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అవసరాలకు అనుగుణంగా పనులు



ప్రజాపక్షం/బేగంపేట్: ప్రజల అవసరాలను తెలుసుకొని అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన బేగంపేట్ డివిజన్‌లో పర్యటించి రూ.47 లక్షల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బల్దియా ఎఇ మహేష్, వాటర్ వర్క్స్ జిఎం ఆశిష్, టిపిఓ రాజేశ్వరి, బిఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్ గౌడ్, టి.శ్రీహరి, నరేందర్, ఆరీఫ్, అఖిల్, నాగరాజు, అడ్డు, నాని, ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ విలీనం పూర్తిచేయాలి



ప్రజాపక్షం/కంటోన్మెంట్: జీహెచ్‌ఎంసీలో త్వరితగతిన కంటోన్మెంట్‌ను విలీనం చేయాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు ప్రధానమంత్రి మోదీతో పాటు నీతి ఆయోగ్‌ను కోరడం జరిగింది. మంగళవారం సమావేశమైన వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా కంటోన్మెంట్ ప్రాంతాలలో నివసిస్తున్న కుటుంబాలకు, కేవలం పౌర పరిపాలన మాత్రమే సరిపోవడం లేదని.. సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని కోరారు. మిగిలిన రక్షణ ప్రాంతాలు ప్రత్యేక సైనిక స్థావరాలుగా కొనసాగవచ్చని.. తద్వారా పౌర నివాసితుల హక్కులను కాపాడుతూనే జాతీయ భద్రత కూడా పెంపొందించేందుకు వీలుంటుందని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధి శంకి రవీందర్‌బాబు తెలిపారు.

## సిఐ శంకర్‌కు సన్మానం



ప్రజాపక్షం/కార్వాన్: వినాయకచవితి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేసిన కుల్సుంపురా సిఐ శంకర్‌ను జియాగూడ డివిజన్ బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు కెఎన్ వినోద్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆరెకటిక సంఘం ప్రతినిధులు, పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా సిఐ శంకర్‌కు శాలువాకప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. సిఐని కలిసిన వారిలో కెఎన్ మనోజ్ కుమార్ కటిక, కేశవ్, రాహుల్, లక్ష్మణ్, విశ్వదత్త తదితరులు ఉన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: దివ్యాంగులు, వయో వృద్ధులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి ఎ. శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ డాక్టర్ నారాయణ, జిల్లా దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవుళ్లను విభజించి రాజకీయాలా?

ప్రజాపక్షం/బంజారాహిల్స్: స్వార్థ రాజకీయాల కోసం విభజించి పాలించే నీచమైన సంస్కృతి కాంగ్రెస్ పార్టీదని బీజేపీ స్టేట్ ఇసి మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో దేవుళ్ల నుద్దేశించి పేదల దేవుడు శివుడు, సంపన్నుల దేవుడు శ్రీరాముడంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆమె తప్పుబట్టారు. సిఎం మాటలతో అది మరోసారి రుజువైందని ఆమె మండిపడ్డారు.

## సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాపక్షం/దుండిగల్:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, డి.పోచంపల్లి వాస్తవ్యులు కోల యాదయ్య కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్, కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులుగా నియమితులైన సీనియర్ న్యాయవాది ఎం.డి.హుస్సేన్ మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

## మీరాకుమార్‌తో రవిశేఖర్‌రెడ్డి భేటీ



ప్రజాపక్షం/జూబ్లీహిల్స్: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ కుమార్తె, మాజీ లోకసభ స్పీకర్ మీరాకుమార్‌ను ఆమె నివాసంలో మంగళవారం ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.రవిశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ( ఎస్ఐఆర్) అంశంలో కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, ఓటు చోరీ అంశాలు చర్చకు వచ్చాయని రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ తెలంగాణలో బీఆర్‌ఎస్, బీజేపీ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, కాంగ్రెస్ ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ .. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నందుకు రవిశేఖర్‌రెడ్డిని ఈ సందర్భంగా మీరాకుమార్ అభినందించారు.

# టౌన్ ప్లానింగ్‌లోనూ థర్డ్ పార్టీ వెరిఫికేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో సుస్థిర, పారదర్శక అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 'యూనిఫైడ్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ కోడ్ (యుడిబిసి) రూపకల్పనలో మరో కీలక అడుగు పడింది. ఇప్పటివరకు ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, నిర్వహణ పనులకే పరిమితమైన 'థర్డ్ పార్టీ వెరిఫికేషన్' విధానాన్ని ఇకపై టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నూతనంగా రూపొందిస్తున్న బిల్డింగ్ రూల్స్‌లోనే ఈ నిబంధనను పొందుపరచాలని భావిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ విధానాలను (బెస్ట్ ప్రాక్టీసెస్) అధ్యయనం చేసి, ఎర్నస్ట్ అండ్ యంగ్ (ఈవై) సంస్థ సాయంతో హెచ్‌ఎండిఎ సంయుక్తంగా ఈ ముసాయిదా కోడ్ సిద్ధం చేసింది. ఈ నూతన నిబంధనల రూపకల్పనలో జిహెచ్‌ఎంసి, సిడిఎంఎ, జలమండలి, విద్యుత్ శాఖ, మూసీ రివర్‌ఫ్రంట్, హైడ్రా, డిటిసిపి వంటి కీలక ప్రభుత్వ విభాగాలు భాగస్వామ్యం వహించాయి. అలాగే ప్రజానుకూల నియమావళి కోసం క్రెడాయ్, నరెడ్కో, ఐటిపిఐ, సిఐఐ, ఐజిబిసి వంటి పలు పారిశ్రామిక, నిర్మాణ రంగానికి చెందిన ప్రముఖ భాగస్వాములతో 'స్టేక్‌హోల్డర్ కన్సల్టేషన్ వర్క్‌షాప్'లు నిర్వహించి వారి సలహాలు, సూచనలను స్వీకరించారు. ప్రస్తుతం 'బిల్డ్ నౌ' ద్వారా ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్, సెల్ఫ్ సర్టిఫికేషన్ పద్ధతిలో భవన నిర్మాణాలు, లేఅవుట్ అనుమతులు జారీ చేస్తున్నారు. అయితే, భవిష్యత్తులో అనుమతుల అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులతో పనిలేకుండా, స్వతంత్ర థర్డ్ పార్టీ ఏజెన్సీలు లేదా కమిటీల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన, ర్యాండమ్ ఆడిట్లు జరిపించాలని భావిస్తున్నారు. ఆడిట్‌లో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు లేదా తప్పులు తేలితే అనుమతులను తక్షణమే రద్దు చేసేలా కఠిన నిబంధనలు తీసుకోనున్నారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 'ఈఓడిబి'సంస్కరణల్లో భాగంగా ఏపిడిపిఎంఎస్ ద్వారా ఎంపానెల్ అయిన థర్డ్ పార్టీ ఏజెన్సీల సేవలను వాడుతుండగా, లంచాలు, అవినీతి, ప్రక్రియలో జాప్యాన్ని నివారించడంలో ఇది విజయవంతమైంది.

**ఎంపానెల్డ్ థర్డ్ పార్టీలకు అధికారాలు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు:**ఈ విధానానికి మరింత బలం చేకూరుస్తూ, 500 చదరపు మీటర్ల విస్తీర్ణం, 10 మీటర్ల ఎత్తు వరకు ఉండే వ్యక్తిగత నివాస భవనాలు, ఆమోదిత లేఅవుట్ల పోస్ట్‌వెరిఫికేషన్, తనిఖీ నివేదికలను సమర్పించే బాధ్యతను ఎంపానెల్డ్ థర్డ్ పార్టీలకు అప్పగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జి.ఓ ఎంఎస్ నెంబర్ 229 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. తిరస్కరణ నోటీసులను జారీ చేస్తారు. 300 చదరపు మీటర్ల వరకు విస్తీర్ణం కలిగిన స్థలాల్లో భవనాల ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ల కోసం నివేదికలు ఇచ్చే అధికారం కూడా వీరికే వర్తిస్తుంది. అయితే, ఈ థర్డ్ పార్టీ ఏజెన్సీలకు మాస్టర్ ప్లాన్, జోనింగ్ నిబంధనలు లేదా చట్టబద్ధమైన ప్లాన్‌లలో ఎలాంటి సడలింపులు ఇచ్చే అధికారాలు ఉండవు. వీరు సమర్పించే నివేదికలలో ఏవైనా వ్యత్యాసాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు కనిపిస్తే, సదరు థర్డ్ పార్టీలతో పాటు భవన యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

# భవిష్యత్‌కు అనుగుణంగా నెట్‌వర్క్

టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్



ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, రానున్న వేసవికాలంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే అదనపు విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ట్రాన్స్‌కో, డిస్కంలు సమన్వయంతో సమగ్ర నెట్‌వర్క్ ప్రణాళికలు రూపొందించాలని టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కళ్యాణ్‌నగర్‌లోని సెంట్రల్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి నెట్‌వర్క్ ప్లానింగ్ సమ్మర్ యాక్షన్ ప్లాన్ సమీక్ష సమావేశంలో సిఎండి జితేష్ పాటిల్ పాల్గొని భవిష్యత్ విద్యుత్ అవసరాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎం రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు రాష్ట్రంలో వేగంగా జరుగుతున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, డేటా సెంటర్లు, ఐటీ పార్కులు, ఎలక్ట్రిక్ మొబిలిటీ, కొత్త పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధితో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే కేవలం ప్రస్తుత అవసరాలకే కాకుండా రాబోయే ఐదు నుంచి పది సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ నెట్‌వర్క్ విస్తరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వేసవిలో ఎల్‌నినో ప్రభావం కారణంగా విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశమున్నందున, ట్రాన్స్‌కో, డిస్కంలు సమన్వయంతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి, ప్రసార, పంపిణీ వ్యవస్థల్లో బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధిక లోడ్ నమోదవుతున్న సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి సామర్థ్య పెంపు చర్యలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్(కమర్షియల్) చక్రపాణి, డైరెక్టర్ (ఆపరేషన్స్) డా.ఎన్.నరసింహులు, చీఫ్ ఇంజినీర్ (కమర్షియల్) ప్రతిమా షోమ్, చీఫ్ ఇంజినీర్ (ఓ అండ్ ఎం) రవికుమార్ మేకల, మేడ్చల్ చీఫ్ ఇంజినీర్ వెంకట రమేష్ పొత్తూరు, మెట్రో చీఫ్ ఇంజినీర్ కరుణాకర్‌బాబు, రూరల్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి ఉబ్బాని, ఎస్ఇ (స్కాడా) చంద్రశేఖర్, ఎస్ఈ (ఎల్‌ఎంఆర్‌సి) దిలీప్ కుమార్‌తో పాటు వివిధ జోన్లు, సర్కిళ్లకు చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మాదిగలకు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాలి

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్



ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ (ఎంఎఎ) అధ్యక్షులు కొమ్ము ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. 80 ఏళ్లుగా మాదిగలు అధికారానికి దూరంగా, అడుక్కునేందుకు దగ్గరగా ఉన్నారన్నారు. ఇక రాజ్యాధికారమే లక్ష్యంగా మాదిగలు పోరాడుతారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని, ఇక నుంచి ఎన్నికల్లో మాదిగల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. మాదిగల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న సిఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఏం చేశారని ప్రశ్నించారు. ఇకనైనా మాదిగలకు డిప్యూటీ సిఎం పదవి, ఒక ఎంఎల్‌సి, 11 కార్పొరేషన్ చైర్మన్ పదవులివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎఎ నేతలు ప్రజ్యోతి కుమార్, సుమిత్రా దేవి, ఎం.నర్సింహులు, స్టీఫన్, విజయల, ఎంఆర్‌పిఎస్‌నేతలు మాతంగి ఓదెలు, కోట సంజీవ , బాలకృష్ణ పాల్గొన్నారు.

## సవాళ్లు అధిగమించడమే లక్ష్యం

సిఎంఎ చిత్తరంజన్ ఛటోపాధ్యాయ్



ప్రజాపక్షం/గోషామహల్: వాస్తవ వ్యాపార సవాళ్లను అధిగమించేందుకు వృత్తిపరమైన పరిజ్ఞానాన్ని వర్తింపజేస్తూ భవిష్యత్తుకు, పరిశ్రమల అవసరాలకు, సాంకేతికతకు అనుగుణంగా సీఎంఏలను తీర్చిదిద్దడం తమ లక్ష్యమని సిఎంఎ చిత్తరంజన్ ఛటోపాధ్యాయ్ తెలిపారు. కాస్ట్ అకౌంటెంట్స్ యాక్ట్ 1959 కింద ఏర్పాటైన ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అకడమిక్ విద్యకు, వృత్తిపరమైన ఆచరణకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేందుకు లక్డీకాపూల్లోని ఎఫ్టీసీసీఐలో 'అడ్వాన్స్‌డ్ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' నిర్వహించారు.

## 12,044 మెగావాట్ల రికార్డ్

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ డిమాండ్ కొత్త గరిష్ట స్థాయికి చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నం 3:52 గంటలకు 12,044 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదై సంస్థ చరిత్రలోనే సరికొత్త రికార్డు నమోదైంది. ఇంతకుముందు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నమోదైన గరిష్ట విద్యుత్ డిమాండ్ 11,828 మెగావాట్లు, ఇది సెప్టెంబర్ 11, 2026న మధ్యాహ్నం 12:44 గంటలకు నమోదైంది. తాజాగా నమోదైన డిమాండ్‌తో ఆ రికార్డు అధిగమించడం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సెప్టెంబర్ 28న 4,072 మెగావాట్ల గరిష్ట డిమాండ్ సాయంత్రం 6:42 గంటలకు నమోదవగా, 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటివరకు నమోదైన గరిష్ట డిమాండ్ 4,782 మెగావాట్లు, ఇది మే 22, 2026న సాయంత్రం 3:33 గంటలకు నమోదైంది. అదే రోజున 101.07 మిలియన్ యూనిట్ల గరిష్ట విద్యుత్ వినియోగం కూడా నమోదైంది. తెలంగాణ రాష్ట్ర స్థాయిలో కూడా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్ మాట్లాడుతూ, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను ముందస్తు ప్రణాళికలు, నెట్‌వర్క్ బలోపేతం, సమర్థవంతమైన నిర్వహణ ద్వారా విజయవంతంగా తీర్చగలుగుతున్నామని తెలిపారు.

## పింఛన్లపై ఆంక్షలు సరికాదు

ప్రజాపక్షం/ఖైరతాబాద్: దివ్యాంగుల పింఛన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఇప్పటికే పెన్షన్లు పొందుతున్న దివ్యాంగులకు కొత్త నిబంధనలు, ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగులకు అనేక షరతులు విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ఇతర వర్గాలకు వివిధ రకాల సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందుతున్నప్పటికీ దివ్యాంగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## వరల్డ్ హార్ట్ డే వేడుకలు



ప్రజాపక్షం/సికింద్రాబాద్: ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) సందర్భంగా ప్రజల్లో గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు సికింద్రాబాద్‌లోని మెడికవర్ హాస్పిటల్స్‌లో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా రక్తపోటు (బీపీ), ఈసీజీ పరీక్షలను నిర్వహించి, అనంతరం కార్డియాలజీ నిపుణులు తగిన వైద్య సలహాలను అందించారు. కార్యక్రమానికి మోండా మార్కెట్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

## పట్టణాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు

- స్పెషల్ డ్రైవ్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

ప్రజాపక్షం/తాండూరు:తాండూరు పట్టణాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేంకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పురపాలక సంఘం ఆద్వర్యాన 1వ వార్డు నుండి 6వవార్డు వరకు నిర్వహించిన స్వచ్ఛ తాండూరు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గోన్న ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్షత్ర స్థాయి పరిశీలనలో బాగంగా మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మీకంగా తనిఖీ చేసిన ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి విద్యార్థులకు అందజేస్తున్న అల్పహారాన్ని పరిశీలించడంత పాటు వారితో కలిసి అక్కడే అల్పాహారం చేశారు. పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వసతులు విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణ తదితర అంశాలపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు**

పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మెరుగైన పారిశుద్ధ్య పనులను చేపట్టాని అధికారులను ఎంఎల్ఎ సూచించారు. వార్డులలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను, మురుగు కాలువల పరిశుభ్రత, చెత్త సేకరణ అంశాలను దగ్గరుండి పరిశీలించడంతో పాటు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జరిగిందని, నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరాజ బాల్‌రెడ్డి, కమీషనర్ రాకేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, వార్డు కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఓటర్ల సవరణ జాబితాను పూర్తిగా బహిర్గతం చేయాలి

సిడబ్ల్యుసి సమావేశంలో మల్లికార్జున ఖర్గే డిమాండ్




**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో అవకవతకలు జరిగినట్లు ఆరోపణలు రావడంపై తక్షణమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రధాన ఎన్నికల అధికారిపై ఒత్తిడి తెచ్చినందుకు గానూ నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని కూడా ఆయన కోరారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. ఐదు డిమాండ్లను పార్టీ ముందు ఉంచారు. వీటిలో ఓటర్ల జాబితాలో చేసిన ప్రతి ప్రధాన మార్పుకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయడం, అలాగే రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా, సంబంధిత సమాచారాన్ని సరళమైన రూపంలో, సకాలంలో అందించడం వంటివి ఉన్నాయి. తీవ్రమైన అక్రమాలు లేదా వ్యత్యాసాలకు సంబంధించిన ఆధారాలు బయటపడిన చోటల్లా స్వతంత్ర, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన విచారణ జరగాలని కూడా ఖర్గే డిమాండ్ చేశారు. పేర్లు తొలగించబడిన ఓటర్లకు ఆ విషయాన్ని పూర్తిగా తెలియజేయాలని, వారికి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన అన్నారు. అలాగే, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక సమాచారం, నిర్ణయాలలో పూర్తి పారదర్శకత ఉండాలని, తద్వారా సమాచారాన్ని దాచిపెడుతున్నారని ఏ పార్టీ కూడా ఆరోపించే అవకాశం ఉండకూడదని కాంగ్రెస్ అధినేత పేర్కొన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, తమ ఓటు సురక్షితంగా ఉందనే నమ్మకం భారతీయ ఓటర్లకు ఉండాలని ఖర్గే అన్నారు. 'మేము ఈ సమస్యను కేవలం ఎన్నికల్లో గెలుపోటముల పోరాటంగా చూడటం లేదు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి, ప్రభుత్వాలు మారుతుంటాయి; కానీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం శాశ్వతమైనవి. ఇదే భారతీయ ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతుడు సామాన్య ఓటరే తప్ప, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా అధికారంలో ఉన్న నాయకుడు కాదని ప్రతి పౌరుడికి మనం తెలియజేయాలి' అని ఆయన అన్నారు. ఓటర్ల జాబితాలు పారదర్శకంగా ఉండాలని, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాలని, సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు సురక్షితంగా ఉండాలని ఖర్గే అన్నారు. 'ఇదే రాజ్యాంగ స్ఫూర్తి; ఇదే ప్రజాస్వామ్య ఆత్మ. ఈ ప్రజాస్వామ్య బాధ్యత నుండి కాంగ్రెస్ ఎప్పుడూ వెనకడుగు వేయదు. దీనిని సాకారం చేయడానికి వీధుల నుండి పార్లమెంటు వరకు అవసరమైన ఏ పోరాటానికైనా మేము సిద్ధం' అని ఆయన అన్నారు. 'పదేళ్ల క్రితం, ఇదే ప్రధాన మంత్రి 'నోట్ల రద్దు' (డీమానిటైజేషన్) నిర్ణయంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశారని చరిత్ర సాక్ష్యమిస్తోంది. ఇప్పుడు, పదేళ్ల తర్వాత, 'ఓట్ల రద్దు' (ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేయడం) అనే కుట్ర ద్వారా ఆయన మన బలమైన ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు' అని కాంగ్రెస్ అధినేత పేర్కొన్నారు. ప్రధాన మంత్రి తీసుకున్న అన్ని లోపభూయిష్ట విధానాల వల్ల పేదలే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఖర్గే అన్నారు. పేదలు, దళితులు, అణగారిన వర్గాలు, సమాజంలో దోపిడీకి గురవుతున్న వర్గాలకు ఓటు అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధమని ఆయన పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఏ ఒక్క ఓటరు కూడా తమ హక్కులకు దూరం కాకుండా చూసుకోవడం చాలా కీలకమని కాంగ్రెస్ అధినేత అన్నారు. 'ఓట్ల చోరీ'కి సంబంధించిన అంశాలను లేవనెత్తిన రాహుల్ గాంధీని ఖర్గే ప్రశంసించారు. ఆ ఆరోపణలన్నీ ఇప్పుడు వాస్తవమని రుజువయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సిడబ్ల్యుసి సమావేశానికి పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేష్, కెసి వేణుగోపాల్, సచిన్ పైలట్, ముకుల్ వాస్నిక్, అలాగే సీనియర్ నాయకులు పి. చిదంబరం తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు డికె శివకుమార్ (కర్ణాటక), విడి సతీశన్ (కేరళ), ఎ. రేవంత్ రెడ్డి (తెలంగాణ), సుఖ్విందర్ సింగ్ సుఖు (హిమాచల్ ప్రదేశ్) కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కేరళంలో యుడిఎఫ్‌కు ఎదురుదెబ్బ

- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ మెరుగైన ప్రదర్శన
- యుడిఎఫ్ నుంచి ఏడు స్థానాలు కైవసం
- బిజెపికి సున్నా



**తిరువనంతపురం:** యుడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ గణనీయమైన పురోగతిని సాధించింది. ఎన్నికలు జరిగిన వివిధ స్థానిక సంస్థల పరిధిలోని 38 వార్డులలో ఎల్‌డిఎఫ్ 18 స్థానాలను గెలుచుకోగా, యుడిఎఫ్ 19 స్థానాలను, 'ట్వంటీ20'(స్థానిక పార్టీ) ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ఇద్దరు సిట్టింగ్ యుడిఎఫ్ ఎమ్మెల్యేలు ఖాళీ చేసిన స్థానాలతో సహా మొత్తం ఏడు స్థానాలను ఎల్‌డిఎఫ్ కైవసం చేసుకుంది. గతంలో ఈ స్థానాల్లో 22 చోట్ల గెలిచిన యుడిఎఫ్, ఈసారి 19 స్థానాలకే పరిమితమైంది. బిజెపి ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయింది.

తిరువనంతపురంలో పోటీ జరిగిన ఐదు స్థానాల్లో ఎల్‌డిఎఫ్ మూడు స్థానాలను గెలుచుకుని యుడిఎఫ్‌కు గట్టి దెబ్బ తీసింది. గతంలో ఈ జిల్లాలో యుడిఎఫ్ నాలుగు స్థానాలను గెలుచుకుంది. మూడు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగిన కొట్టాయంలో ఎల్‌డిఎఫ్ రెండు స్థానాలను గెలుచుకుంది. అందులో గతంలో యుడిఎఫ్ ఆధీనంలో ఉన్న స్థానాలు కూడా ఉన్నాయి. పాలక్కాడ్‌లో సైతం ఎల్‌డిఎఫ్ తన పట్టును పెంచుకుంటూ, పోటీ జరిగిన ఏడు స్థానాల్లో ఐదింటిని గెలుచుకుంది. కన్నూర్‌లో ఎన్నికలు జరిగిన రెండు స్థానాలను ఎల్‌డిఎఫ్ గెలుచుకుంది. ఒకదానిని ప్రతిపక్షం నుండి కైవసం చేసుకుంది. కాసరగోడ్‌లోని ఒక స్థానాన్ని, మలప్పురంలోని రెండు స్థానాలను ఎల్‌డిఎఫ్ నిలబెట్టుకుంది. అదనంగా, కొట్టాయం జిల్లా పంచాయతీ పరిధిలోని త్రికోడితనం డివిజన్‌ను యుడిఎఫ్ నుంచి ఎల్‌డిఎఫ్ చేజిక్కించుకుంది. ఇది యుడిఎఫ్ ఎమ్మెల్యే వినుజాబ్ ప్రాతినిధ్యం వహించిన వార్డు. చిత్తూరు యుడిఎఫ్ ఎమ్మెల్యే సుమేష్ అచ్యుతన్ గతంలో ప్రాతినిధ్యం వహించిన స్థానాన్ని ఎల్‌డిఎఫ్ అభ్యర్థి వి. తులసీధరన్ గెలుచుకున్నారు.

**కేరళంలో ఉప ఎన్నికలు**

| | ముందు | తర్వాత (వార్డులు) |
|---|---|---|
| యుడిఎఫ్ | 22 | 19 |
| ఎల్ డి ఎఫ్ | 15 | 18 |
| ఇతరులు | 1 | 1 |

## ఫలితాలు ప్రజల మనోభావాలకు ప్రతిబింబం : బినోయ్ విశ్వం

స్థానిక సంస్థల ఉప ఎన్నికల ఫలితాలు ప్రజల మనోభావాలను, రాజకీయ నాడిని ప్రతిబింబిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం వ్యాఖ్యానించారు. 'కేరళ రాజకీయ ముఖచిత్రంలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ప్రజలు యుడిఎఫ్‌ను తిరస్కరించారు, వారి వాదనలన్నింటినీ పూర్తిగా తోసిపుచ్చారు. ఈ రాజకీయ మార్పు ప్రభావం కేరళ అంతటా కనిపిస్తోంది. వామపక్ష రాజకీయాల విలువలు, ఆదర్శాలకు కట్టుబడి ఉండే ఎల్‌డిఎఫ్ విధానాలనే ప్రజలు కోరుకుంటున్నారని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. ఈ ప్రజా తీర్పు ఎల్‌డిఎఫ్, కమ్యూనిస్ట్ పార్టీలపై మరింత బాధ్యతను ఉంచుతోంది. ప్రజల తీర్పు అత్యున్నతమైనది' బినోయ్ విశ్వం అన్నారు. అలాగే, ఎల్‌డిఎఫ్‌కు మద్దతు తెలిపిన ఓటర్లందరికీ కమ్యూనిస్ట్ పార్టీ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# జెన్‌జీ గళం విప్పాలి

- మహిళల భద్రతపై నిరసన తెలుపుతున్న విద్యార్థులకు రాహుల్‌గాంధీ మద్దతు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో మహిళల భద్రతను కోరుతూ విద్యార్థులు చేస్తున్న నిరసనలకు కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. యువతులు, ముఖ్యంగా జెన్‌జీకి చెందినవారు ఈ నిరసనల్లో భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలపై జరిగిన నేరాల కారణంగా వారిపైనే ఆంక్షలు విధించకూడదని పేర్కొన్నారు. సురక్షితమైన బహిరంగ ప్రదేశాలు ఉండాలని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలను ఇంట్లోనే బంధించడం ఈ నేరాలకు పరిష్కారం కాదన్నారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బాధితురాలిని నిందించి, నేరస్థుడిని కాపాడే వ్యవస్థను సమూలంగా మార్చాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని ఆయన యువతను కోరారు. ఎందుకంటే ప్రభుత్వం కేవలం ఒత్తిడి ఉన్నప్పుడే స్పందిస్తుందని పేర్కొన్నారు. శాంతియుత నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు అని, ఆ నిరసనలకు తాను సంపూర్ణ మద్దతు ఇస్తానని ప్రకటించారు. ఎల్ఎస్ఆర్ (లేడీ శ్రీరామ్) కాలేజీ దగ్గర్లోని పార్కుకు వాకింగ్ కోసం కోసం వెళ్లిన ఒక యువతి అత్యాచారానికి గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వార్తాపత్రికలు, సోషల్ మీడియా చూస్తే బిహార్‌లో ఒక బాలికపై, యూపీలో మరొకరిపై, పంజాబ్‌లో ఇంకొకరిపై అత్యాచారం జరిగిందన్న వార్తలు కనిపిస్తున్నాయని అన్నారు. 'మహిళలపై జరిగిన నేరాలకు వారిని శిక్షించడం ఆపండి. దేశవ్యాప్తంగా మహిళలు వీధుల్లో నడవడానికి భయపడుతున్నారు. వేధింపులు, అత్యాచారానికి గురవుతామని భయపడుతున్నారు. దీనికి ప్రభుత్వ సమాధానం ఇంట్లోనే ఉండండి. ఇది పురుషాధిక్య ధోరణ తీరు: బాధితురాలిని నిందించి, నేరస్థుడిని కాపాడే వ్యవస్థ. దీనిని బద్దలు కొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. మహిళలపై నేరాలకు ప్రతిస్పందనగా బహిరంగ ప్రదేశాలను సురక్షితంగా మార్చాలి. నేరాలకు పాల్పడిన వారిపై త్వరితగతిన చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టాలి. మహిళలపై నేరాలను అరికట్టేందుకు వారిని ఇళ్లలోనే బంధించడం పరిష్కారం కాదు. దేశంలోని వీధులను సురక్షితంగా మార్చాలి. మహిళలను వేధించే పురుషుల మనస్తత్వాన్ని మార్చాలి. మహిళలపై దాడి చేసే వారిని త్వరితగతిన, ఎటువంటి మినహాయింపు లేకుండా శిక్షించడమే పరిష్కారం' అని రాహుల్ అన్నారు. ఈ నెల ప్రారంభంలో దక్షిణ ఢిల్లీలోని ఆస్థా కుంజ్ పార్కులో 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగిన నేపథ్యంలో మహిళల భద్రత కోసం ఢిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిరసనలకు దిగారు. మొదటి నిరసన ప్రదర్శన సెప్టెంబర్ 23న జరిగింది. ఆ రోజు ఢిల్లీ విశ్వవిద్యాలయం, దాని అనుబంధ సంస్థలైన లేడీ శ్రీరామ్ కాలేజ్ ఫర్ ఉమెన్, మిరాండా హౌస్, గార్గీ కాలేజ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. క్యాంపస్‌ల పరిసరాల్లో వేధింపులు, నిఘా లేమి, పోలీసు పహారా, ఇంకా విద్యాసంస్థలకు రాకపోకలు సాగించే మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసనలకు రాహుల్ మద్దతు ప్రకటించారు.

# చెన్నైలో మత్స్యకారుల నిరసనలు



**చెన్నై :** తమిళనాడులో సి జోసెఫ్ విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మత్స్యకారుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. చెన్నై నగరంలోని పట్టినాపాక్కంలో రూ.1200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సచివాలయం – అసెంబ్లీ కాంప్లెక్స్ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ ఎన్నూర్ నుంచి కోవలం వరకు ఉండే చెన్నై తీరప్రాంతంలోని మత్స్యకారులు మంగళవారం ఇక్కడ నిరసన చేపట్టారు. విస్తృతమైన స్థాన భ్రంశం, తమ సాంప్రదాయ మత్స్య జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందనే భయాందోళను వ్యక్తం చేశారు. 24ఎకరాలకు పైగా భూమిలో ఇంత పెద్ద భారీ నిర్మాణం తమ సాంప్రదాయ చేపలవేట ప్రదేశాన్ని, అలాగే సముద్రానికి ప్రజల ప్రవేశాన్ని నాశనం చేస్తుందని మత్స్యకారులు ప్రభుత్వంపై మండిపడ్డారు. పట్టినాపాక్కం ( ఫోర్‌షోర్ ఎస్టేట్)లోని శ్రీనివాసపురం బీచ్ వద్ద మహిళలతో సహా వందలాది మంది సంఘ సభ్యులు నిరసన చేపట్టారు. కాగా, మరో వర్గం తమ దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు నల్ల జెండాల ఊరేగింపును నిర్వహించింది. ఈ ఘటనల్లో పోలీసుల పహారా, బారికేడ్లతో కూడిన ప్రాంతాలు, ట్రాఫిక్ దారి మళ్లింపులు అధికంగా కంటపడ్డాయి. ముఖ్యమంత్రి సి జోసెఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికార కేంద్రాన్ని చారిత్రక ఫోర్ట్ సెయింట్ జార్జ్ నుంచి సముద్రతీరంలోని పట్టినాపాక్కం ప్రాంతానికి తరలించే ప్రణాళికను ప్రకటించి, ఆ తర్వాత ఫోర్ షోర్ ఎస్టేట్‌లో కొత్త సచివాలయం–అసెంబ్లీ కాంప్లెక్స్ నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేందుకు సూత్రప్రాయ ఆమోదం తెలుపుతూ 2026 సెప్టెంబరు 8న ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీచేసింది. మత్స్యకారుల సంఘం, రాజకీయ పార్టీల నుంచి నిరసనలు తీవ్రతరమైన నేపథ్యంలో,కేవలం వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డిపిఆర్) ప్రక్రియ మాత్రమే కొనసాగుతోందని, ఇది ప్రాథమిక దశలో మాత్రమే ఉందని ప్రభుత్వం స్పష్టంచేసింది. అయితే, తమ సాంప్రదాయక జీవనోపాధులకు, తీరప్రాంత పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన జీవోను ప్రభుత్వం అధికారికంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మత్స్యకారులు మంగళవారం నిరసన ప్రారంభించారు. ప్రతిపాదిత కాంప్లెక్స్ 25.55 ఎకరాల భూమిలో ఏర్పాటు కావచ్చని అంచనా వేస్తుండగా, ప్రాథమిక డిజైన్, ప్రారంభ డిపార్ట్‌మెంట్ బదిలీల ప్రకారం ప్లాట్ పరిమాణం 25.16ఎకరాలుగా ఉంటుందని అంచనా. జీవో పట్టినాపాక్కంలో మొత్తం 25.55 ఎకరాల భూమిని అధికారికంగా ఖరారు చేసింది.

# నందిగ్రామ్ కాంగ్రెస్ అభ్యర్థికి బెయిల్



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట లభించింది. జైలులో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి మిలాన్ ప్రధాన్‌కు కోల్‌కతా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో మిలాన్ తన తరపున ఎన్నికల్లో ప్రచారం చేసుకునే అవకాశం లభించనుంది. జస్టిస్ తీర్థాంకర్ ఘోష్ ఆధ్వర్యంలోని బెంచ్ ఆయనకు రూ.20,000 పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. 2007లో నందిగ్రామ్‌లో జరిగిన అల్లర్ల ఘటనపై మిలాన్ ప్రధాన్‌పై కేసు నమోదైంది. చాలా కాలంగా ఈ కేసు విచారణ కొనసాగుతోంది. తాజాగా నందిగ్రామ్ ఉప ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చే అక్టోబర్ 6న పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నిక కోసం కాంగ్రెస్ పార్టీ తరపున మిలాన్ ప్రధాన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే, నామినేషన్ దాఖలు చేసిన రోజే ప్రధాన్‌ను 2007 నాటి నందిగ్రామ్ అల్లర్ల కేసులో అరెస్టు చేశారు. దీంతో ఆయన ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడానికి వీలు లేకుండా ఉంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రధాన్ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. విచారణ జరిపిన కోర్టు కీలక అంశాల్ని ప్రస్తావించింది. ఈ కేసు నామినేషన్ వేసిన సమయంలో దాఖలు కాలేదని కోర్టు గుర్తించింది. నామినేషన్‌ను దాఖలు చేసిన తర్వాత పాత కేసును మళ్లీ తిరిగి ఓపెన్ చేసి, ఆయనను అరెస్టు చేశారని కోర్టు అభిప్రాయపడింది. చాలా కాలం నాటి కేసు కాబట్టి, ఈ ఎన్నికల్లో అతడు ప్రచారం చేయకుండా అడ్డుకోవడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ప్రధాన్‌కు కోల్‌కతా హైకోర్టు అక్టోబర్ 21 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. నిజానికి అతడికి అక్టోబర్ 7 వరకు గతంలో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అయితే, ఇప్పుడు బెయిల్ రావడంతో అతడు ఇకపై ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకోవచ్చు. అక్టోబర్ 4 వరకు ప్రచారం చేసేందుకు అవకాశం ఉంది.

# ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లుపై జెపిసికి...

- హోం, న్యాయ మంత్రిత్వ శాఖల సంక్షిప్త నివేదిక

**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష పార్టీలు, క్రైస్తవ సమూహాల నుంచి వివాదాస్పద నిబంధనలపై విమర్శలు ఎదుర్కొంటున్న విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026ను పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి హోం వ్యవహారాల, న్యాయ, న్యాయ మంత్రిత్వ శాఖలు మంగళవారం క్లాజుల వారీగా వివరణ ఇచ్చాయి. నివేదికను వెలువరించడానికి ముందు, చట్టంలోని నిబంధనలను వివరంగా పరిశీలించేందుకు బిజెపి ఎంపి సంజయ్ జైస్వాల్ నేతృత్వంలో 31మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. 2010 చట్టానికి సవరణలు తీసుకురావడానికి గల కారణాలను, భవిష్యత్ చర్యలను వివరిస్తూ, రెండు మంత్రిత్వ శాఖల అధికారులు సవివరంగా ప్రజెంటేషన్లు ఇచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. విదేశీ నిధులు పొందే అన్ని సంస్థలు, ఎన్జీవోలు, విదేశీ విరాళాల (నియంత్రణ)చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. వాటి కార్యకలాపాలను నోడల్ అధికారిగా వ్యవహరించే హోం మంత్రిత్వ శాఖ నిశితంగా పర్యవేక్షిస్తుంది. మధ్యాహ్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వంటి రంగ నిపుణులు, ఉన్నత న్యాయాధికారులు, సీనియర్ న్యాయాధికారులు, జెపిసికి తమ అభిప్రాయాలను తెలియజేస్తారని భావిస్తున్నట్లు వర్గాలు తెలియజేశాయి. ఈ చట్టంలోని కొన్ని నిబంధనలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఆరోపించిన ప్రతిపక్ష పార్టీల నిరంతర డిమాండ్ల మేరకు, ఈ ఏడాది మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టబడిన ఈ బిల్లును ఆగస్టు 12న జెపిసికి పంపారు. ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన ప్రతిపక్షపార్టీలు ఈ బిల్లు మైనారిటీలను లక్ష్యంగా చేసుకుందని, ఎందుకంటే కొన్ని నిబంధనలు క్రైస్తవ స్వచ్ఛంద సంస్థలకు, మైనారిటీలు నడుపుతున్న సామాజిక, సంక్షేమ విద్యాసంస్థలకు అందే చట్టబద్ధమైన నిధులను అడ్డుకుంటాయని ఆరోపించాయి. ప్రభుత్వం ఆ ఆరోపణలను తిరస్కరించి, మైనారిటీలకు వ్యతిరేకంగా వివక్ష చూపే ఒక్క నిబంధననైనా గుర్తించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరింది. ప్రతిపాదిత చట్టం మతానికి ప్రత్యేకమైనది కాదని, విదేశీయులను నియంత్రించడమే దీని లక్ష్యమని కూడా ప్రభుత్వం స్పష్టంచేసింది. లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెడుతూ, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద్‌రాయ్, ఈ చట్టం పారదర్శకతను పెంచడం , విదేశాల నుంచి వచ్చిన నిధుల సరైన వినియోగాన్ని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలియజేశారు. ఈ బిల్లు 'ప్రమాదకరం' అంటున్న ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ, విదేశీ విరాళాలను ఉపయోగించి, బలవంతపు మతమార్పిడికి పాల్పడే వారికి, అలాగే వ్యక్తిగత లాభం కోసం 'విదేశీ నిధులను దుర్వినియోగం చేసేవారికి' ఇది నిజంగానే 'ప్రమాదకరం' అని నిత్యానంద్ రాయ్ నొక్కిచెప్పారు. ఈ బిల్లు, మైనారిటీలను, ఎన్జీవోలను లక్ష్యంగా చేసుకుందని కాంగ్రెస్ నాయకుడు కెసి.వేణుగోపాల్ ఆరోపించారు. మిజోరం ముఖ్యమంత్రి లాల్దూహోమా క్రైస్తవ సంస్థల ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తూ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి తమ అభ్యంతరాలను వ్యక్తంచేశారు. నాగాలాండ్ ముఖ్యమంత్రి నైఫియూరియో, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె.సంగ్మా కూడా ఈ చట్టం నిబంధనలపై ఆందోళన వ్యక్తంచేశారు. సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ డిఎంకె ఎంపి పి.విల్సన్ చర్చినాయకుల బృందానికి నాయకత్వం వహించి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిశారు.ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును ఉపసంహరించుకోవాలని డిఎంకె చీఫ్ ఎంకె.స్టాలిన్ కూడా కేంద్రాన్ని కోరారు. విదేశీనిధులను ఎల్లప్పుడు అనుమానంతో చూడలేమని చెబుతూ ఎన్‌సిపి(ఎస్‌పి)వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును దాని ప్రస్తుత రూపంలో వ్యతిరేకించారు. సెప్టెంబరు 18న జరిగిన జెపిసి మొదటి సమావేశంలో కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలోని హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం, విదేశాల నుంచి అందుకుంటున్న నిధులు పెరిగినప్పటికీ గత దశాబ్దంలో ఎఫ్‌సిఆర్‌ఎ కింద నమోదైన క్రియాశీల ఎన్జీవోలు సగానికి తగ్గాయని తెలియజేసింది. 15 రాష్ట్రాలలో 14, 466 ఎఫ్‌సిఆర్‌ఎ నమోదిత క్రియాశీల ఎన్జీవోలు ఉన్నాయని, వీటిలో తమిళనాడు 2,102 సంఘాలతోఓ అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాలలో మహారాష్ట్ర (1,578), కర్ణాటక (1,355), ఢిల్లీ ( 1,218), ఆంధ్రప్రదేశ్ (1,022), కేరళ (1,013) ఉన్నాయని వారు తెలిపారు.

# కొత్త మైనింగ్ చట్టం, ఇతర సమస్యలపై...
# అక్టోబరు 8న 'ఒడిశా బంద్'

- ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు పిలుపు



**భువనేశ్వర్ :** ఒడిశా రాష్ట్రంలో కొత్త మైనింగ్ చట్టం రద్దు సహా మరో రెండు సమస్యలపై ఇండియా కూటమి సమరశంఖం పూరిస్తూ, అక్టోబరు 8న ఒడిశా బంద్‌కు పిలుపునిచ్చింది. ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు ఇక్కడ ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నివాసం సమీపంలో ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్, ఫార్వర్డ్ బ్లాక్, ఎన్‌సిపి, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) వంటి కూటమి భాగస్వాములకు చెందిన వందలాది కార్యకర్తలు,నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అంతకుముందు నిరసనకారులు అసెంబ్లీని ముట్టడించాలని ప్రణాళిక వేసుకున్నారు. కానీ, ఒక రోజు ముందుగానే వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడటంతోవారు తమ దృష్టిని ముఖ్యమంత్రి నివాసం వైపునకు మళ్లించారు. 'ఎంఎండిఆర్ బిల్లు, ఓటు చోరీ, సిఇసి జ్ఞానేష్ కుమార్ అంశాలపై మా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, బిజెపి ప్రభుత్వం అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేసింది. కానీ, ప్రజల ప్రశ్నలను వారు నిరవధికంగా వాయిదా వేయలేరు'అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ భక్తచరణ్ దాస్ చెప్పారు.ముఖ్యమ ంత్రి నివాసం వైపునకు కవాతుచేయకుండా నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో వారు భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. కొందరు మద్దుతదారులు బారికేడ్లను ఛేదించుకుని అరెస్ట్‌కు లొంగిపోగా, చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోణలతో మరికొందరిని అదుపులోకి తీసుకున్నట్లు ఒక సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు.గుమిగూడిన వారిని ఉద్దేశించి భక్తచరణ్ దాస్ మాట్లాడుతూ అక్టోబరు 8న ఒడిశా రాష్ట్ర వ్యాప్త బంద్‌ను ప్రకటించారు. బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ చట్టం–2026ను రద్దు చేయడం, పాఠ్యపుస్తకాలలో ఆరోపించబడిన తప్పులపై , ఒడిశా పాఠశాల, సామూహిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ రాజీనామా చేయాలని, ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో ఆరోపించబడిన అవకతవకలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయడం, అరెస్ట్ చేయడం వంటి వి ఈ డిమాండ్లలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బంద్ శాంతియుతంగా జరిగేలా కాంగ్రెస్, దాని ఇండియా కూటమి భాగస్వాములు హామీ ఇస్తారని దాస్ హామీ ఇచ్చారు. ఖనిజ సంపద అధికంగా ఉన్న కియోంఝర్ జిల్లాలో కొత్త మైనింగ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబరు 7న ఇండియా కూటమి ఒక ప్రదర్శన నిర్వహిస్తుందని ప్రకటించింది. కొత్త మైనింగ్ చట్టం అమలు తర్వాత ఒడిశా ఏటా దాదాపు రూ.ఒక లక్ష కోట్ల నుంచి రూ,12,000కోట్ల వరకు నష్టపోతున్నదని ఇండియా కూటమి ఆరోపించింది. ఖనిజాల వెలికితీత, రవాణాను నిలిపివేయడానికి అక్టోబరు 8న కీలక మైనింగ్ ప్రాంతాలలో ర్యాలీలు, ఆర్థిక దిగ్బంధనాలు నిర్వహిస్తామని అది తెలిపింది. ఎంఎండిఆర్ సవరణ చట్టం–2026 ఖనిజ సంపద అధికంగా ఉన్న రాష్ట్రమైన ఒడిశా హక్కులు, ఆర్థిక ప్రయోజనాలను ప్రభావితం చేస్తున్నదని కూటమి ఆరోపించింది.

# బెంగళూరులో భారీగా డ్రగ్స్ పట్టివేత



**బెంగళూరు:** బెంగళూరులో డ్రగ్స్ విక్రయిస్తున్న ఒక విదేశీయుడు సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5.48 కోట్ల విలువైన 5.48 కిలోల ఎండిఎంఎ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ మార్కెట్‌లో రూ.10.96 కోట్లుగా ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. నిందితులు ప్రజలు, విద్యార్థులకు ఆ డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గిరినగర్, హెబ్బాల్, విద్యారణ్యపురా ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందని, ఆ సమాచారం ఆధారంగానే తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు. తమ విచారణలో నిందితులు విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు తెచ్చి అధిక ధరకు విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తేలిందని అన్నారు. నిందితులకు డ్రగ్స్ విక్రయించిన వ్యక్తుల కోసం గాలిస్తున్నామని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని, అరెస్టు చేసిన వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని తెలిపారు. బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ సింగ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ..గత కొద్ది నెలలుగా హెబ్బాల్, గిరినగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిపిన సోదాల్లో రూ.161 కోట్ల విలువైన 79.5 కేజీల ఎండిఎంఎ డ్రగ్స్, వెయ్యి ఎక్స్‌టసీ మాత్రలు స్వాధీనం చేసుకున్నామని, తనిఖీల్లో 36 పోలీస్ బృందాలు పాల్గొన్నాయని, అలాగే రూ.18.06 కోట్ల నగదు, 43 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, రెండు బైక్‌లు సీజ్ చేశామని తెలిపారు. బెంగళూరును డ్రగ్స్ రహిత నగరంగా ఉంచేందుకు మేము ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

**CHANGE OF NAME**

I, **SENCHATY ANJANEYULU SAGAR, S/o. SENCHATY KURMAIAH,** (old Name), H.No. 2-1-185/105, Kompally, Uma Maheshwar Colony, Quthubullapur Mandal, Medchal- Malkajgiri District, Telangana - 500014, has changed as **SUGURU ANJANEEYULU, S/o. S. KURUMAIAH** (New Name) for all purposes.

**పాస్‌బుక్ పోయినది**

హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన **గురిజాల బుచ్చిబాబు తండ్రి గురిజాల విశ్వనాదంకు** సంబదించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ ఖాతా నెంబర్ : **60617**, పట్టా పాసు బుక్ నెం.**T21100031886** గల పట్టాదారు పాస్ బుక్కు మే నెలలో గురిజాల బుచ్చిబాబు పీచర గ్రామం నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా పోయినది, ఇట్టి పట్టాదారు పాసు బుక్కు దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**గురిజాల బుచ్చిబాబు**
**తండ్రి విశ్వనాదం,**
గ్రామం : పీచర, ఇంటి నెం. 7-19,
మండలం : వేలేరు
జిల్లా : హనుమకొండ,
పిన్ నెం : 506151,
ఫోన్ నెంబర్ : 6281555803

# అమెరికా ప్రజలూ.. వాస్తవాలు తెలుసుకోండి

- ప్రత్యక్ష బహిరంగలేఖలో ఐఆర్‌జిసి పిలుపు • మేం ఉగ్రవాదులమా?బలం లేకపోయినా ఎలా గెలిచాం?
- ఇజ్రాయెల్ ఆక్రమణ చర్యలకు దూరంగా ఉండండి • అమెరికా దాష్టీకాలపై సుదీర్ఘ వివరణ



**టెహ్రాన్:**పాలస్తినాపై ఆధిపత్యం చెలాయిస్తున్న ఇజ్రాయెల్ దురాక్రమణదారుల నుండి దూరంగా ఉండాలని ఐఆర్‌జిసి(ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్ కార్ప్స్) అమెరికా ప్రజలకు మంగళవారం ఒక బహిరంగ లేఖ రాసింది.అమెరికా సాగించే అంతు లేని యుద్ధాలలో ఎల్లప్పుడూ సత్యమే బలైపోతోందని ఆవేదన వ్యక్తం చేసింది.అమెరికా చేస్తున్న యుద్ధాల ఖర్చు ప్రజలే భరించాలని,పన్ను చెల్లింపుదారులపైనే ఈ భారాలు పడతాయని,అందువల్ల అమెరికా ప్రజలు ఈ అన్యాయపూరితమైన యుద్ధాలకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకోవాలని కోరింది.అమెరికా సైన్యాలు ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న నేరాలు మీకు (అమెరికా ప్రజలకు) తెలియడంలేదని, తెలుసుకోవాలని కోరింది. ఇరాన్ కంటే అమెరికా సైనిక బడ్జెట్ వందరెట్లు ఎక్కువగా ఉన్నాగానీ ఇరాన్ ఎందుకు పైచేయి సాధించిందని ప్రశ్నించింది.ఈ విషయం క్షుణ్ణంగా అమెరికా ప్రజలు తెలుసుకోవాలని కోరింది. ఐఆర్‌జిసి ఉగ్రవాద సంస్థ అని అమెరికా ఎందుకు నినదిస్తోంది?ఇరానీయులు ఉగ్రవాదులా?అమెరికా నాశనం కావాలని ఇరానీయులు ఎందుకు నినదిస్తున్నారు? ఇరాన్ ప్రజలపై ఆధిపత్యం పునరుద్ధరించడానికి 50 సంవత్సరాలుగా అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఎందుకు విఫలమవుతున్నాయి?ప్రస్తుత యుద్ధం ఎలా సాగుతోంది?ఇదెలా ముగుస్తుంది?అమెరికా ప్రజలు తమను తాము ఎలా రక్షించుకోగలరు?రాబోయే పతనం నుండి ఎలా బయటపడగలరు?హోర్ముజ్ జలసంధికి వెళ్ళి మీరు వాస్తవాలు తెలుసుకోండి,ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంకోసమే ఈ లేఖ మేం మీకు రాశాం అని ఐఆర్‌జిసి పేర్కొంది. వేల కూడిన పదాలతో సుదీర్ఘమైన లేఖను ఐఆర్‌జిసి విడుదల చేసింది.ఇరాన్ నాగరికతను ధ్వంసం చేస్తామన్నారు,ఖర్గ్‌ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు,హోర్ముజ్ నుండి సుంకాలు వసూలు చేసుకుంటామన్నారు,మాపై దిగ్బంధనం విధించారు,మమ్మల్ని రాతియుగంలోకి నెడతామన్నారు,ఇవన్నీ ఎందుకు? వాస్తవాలు తెలుసుకోండి అని ఆ లేఖలో ఐఆర్‌జిసి అమెరికా ప్రజలను కోరింది.హుస్సేన్ మొహెబ్బీ ఈ లేఖ విడుదల చేశారు.పాలస్తినాను ఆక్రమించాలనుకునేవారికి దూరంగా ఉండాలని,శాంతియుత సహజీవనం సాధ్యమేనని ఆ లేఖలో ఐఆర్‌జిసి పేర్కొంది.ఆక్రమణదారులు ఎప్పటికైనా తిరిగి తమ దేశానికి వెళ్ళిపోవాల్సిందేనని,ఈ రెండు దేశాలమధ్యా కూడా శాంతియుత సహజీవనం సాధ్యమేనని నొక్కి చెప్పింది.''అత్యంత దయామయుడు,కరుణామయుడైన దేవుని పేరుతో,అమెరికా సంయుక్త రాష్ట్రాల గౌరవనీయులైన ప్రజలు,విద్యాంసులు,విద్యార్థులకు బహిరంగ లేఖ'' అని ఐఆర్‌జిసి లేఖ ప్రారంభ వాక్యాల్లో రాసింది.గడచిన ఎనిమిది నెలలుగా ఇరాన్‌లో అమెరికా చేసిన దాష్టీకాలను ఆ లేఖలో ఐఆర్‌జిసి వివరించింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించిందని,మినాబ్ పాఠశాలపై దాడచేసి 168 మంది బాలలు,ఉపాధ్యాయులను పొట్టనపెట్టుకుందని తెలిపారు.ఇరాన్ సర్వోన్నత నాయకుడు ఖమేనీ కార్యాలయంపై దాడిచేసి14నెలల వయసుగల ఆయన మనవరాలుతో సహా అనేకమంది బంధువులు,ప్రముఖులను అమెరికా విమానదాడుల్లో హత్యచేసిందని లేఖలో తెలియజేశారు.నేటివరకూ జరిగిన యుద్ధంలో 3,600 మంది ఇరానీయులు మరణించారని,ఎనిమిది విశ్వవిద్యాలయాలు,ఎనిమిది పాఠశాలలు,మూడు ఆసుపత్రులను ధ్వంసం చేశారని,ఇరాన్ ప్రజలు అపూర్వమైన క్రూరత్వాన్ని చవిచూసినప్పటికీ యుద్ధంలో అమెరికా–ఇజ్రాయెల్ ఘోరంగా ఓడిపోయాయని,ఇస్లామిక్ రిపబ్లిక్ నిర్ణయాత్మకమైన విజయం సాధించిందనిపేర్కొంది.

# లాహోర్ హైకోర్టులో ఘనంగా భగత్‌సింగ్ జయంతి

### భారత్– పాక్ అత్యున్నత పురస్కారాలకు డిమాండ్






**లాహోర్:**విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుక పాకిస్థాన్ నగరం లాహోర్‌లో సెప్టెంబరు 28న ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ మెమోరియల్ ఫౌండేషన్ పాకిస్థాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.భారత్–పాకిస్థాన్ రెండు దేశాల ప్రభుత్వాలు ఆయనకు వారి వారి అత్యున్నత పురస్కారాలు ప్రకటించి గౌరవించాలని కోరుతూ ఫౌండేషన్ ఈ సందర్భంగా ఒక తీర్మానం చేసింది. భారత్‌లో అత్యున్నతమైన 'భారత రత్న',పాకిస్థాన్‌లో అత్యున్నతమైన పురస్కారం ''నిషాన్–ఏ–పాకిస్థాన్'లను భగత్‌సింగ్‌కు ప్రకటించాలని తీర్మానం కోరింది. భగత్‌సింగ్ పోరాటం ఉమ్మడి వారసత్వానికి ప్రతీకగా అక్కడి నాయకులు అభివర్ణించారు.అవిభక్త పంజాబ్ రాష్ట్రం లైల్‌పూర్‌జిల్లా(ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది)బంగా గ్రామంలో భగత్‌సింగ్ 1907 సెప్టెంబరు 28వ తేదీన జన్మించారు.ఆయన జ్ఞాపకార్థం ప్రతిసంవత్సరం ఈ వేడుకలు నిర్వహిస్తారు.లాహోర్ హైకోర్టు ప్రాంగణంలోన లాహోర్ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు,మేధావులు,సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.భగత్‌సింగ్ కేవలం ఒక దేశానికో,ఒక ప్రాంతానికో పరిమితం కాలేదని, భారత ఉపఖండంలో జరిగిన స్వాతంత్ర్యపోరాట చరిత్రలో ఆయన ఒక ముఖ్య అధ్యాయంగా ఉన్నారని ఫౌండేషన్ ఛైర్మన్ ఇమ్తియాజ్ రషీద్ ఖురేషీ కొనియాడారు.భగత్‌సింగ్ జీవితకాలంలో లాహోర్‌కు ఒక ప్రత్యేకస్థానం ఉందని ఖురేషీ చెప్పారు. రాజకీయ ఖైదీలు,నిరాహార దీక్ష చేస్తున్న ఖైదీలకు సంబంధించిన అంశాలపై 1929లో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో మహ్మద్ అలీజిల్లా చేసిన ప్రస్తావనలను,చారిత్రక రికార్డులను ఆయన గుర్తుచేశారు.అదేవిధంగా భగత్‌సింగ్ జయంతి పురస్కరించుకుని ఆయన జన్మస్థలమైన ఫైసలాబాద్ (పూర్వపు ల్యాల్‌పూర్)జిల్లా యంత్రాంగం భగత్ సింగ్‌కు ఒక ప్రత్యేక స్మారకచిహ్నం నిర్మించేందుకు ఏర్పాట్లు చేసింది.భగత్‌సింగ్ రాసిన లేఖలు,చారిత్రక పత్రాలను భద్రపరచి,భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య శాంతి,అవగాహన పెంపొందించేవిధంగా యువతరానికి ఆయన ఆశయాలను చేరవేయాలని ఈ వేడుకల్లో పాల్గొన్న వక్తలు పిలుపు ఇచ్చారు.

## కెసిఆర్ కుమారుడిగా పుట్టడమే కెటిఆర్ అర్హత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెటిఆర్‌కు నాయకత్వ లక్షణాలు లేకపోయినా కెసిఆర్ కుమారుడిగా పుట్టడమే రాజకీయ అర్హతగా మారిందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. కెసిఆర్ కుమారుడు కాకపోతే కెటిఆర్‌కు రాజకీయ భవిష్యత్తే ఉండేది కాదన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలకే నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించడం తప్పంటూ కెటిఆర్ నియంతృత్వ ధోరణిలో మాట్లాడుతున్నారని విమర్శించారు.బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేలకు అడ్డగోలుగా సంపాదించుకునే స్వేచ్ఛ ఇచ్చారని ఆరోపించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారితో కలిసి కెసిఆర్ ఫామ్‌హౌస్‌లు, వ్యాపారాలు నిర్వహించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులను అరెస్టు చేసి జైళ్లకు పంపి, ఉద్యమంతో సంబంధం లేని వారికి కోట్ల రూపాయలు కట్టబెట్టారని దుయ్యబట్టారు. కోదండరాం, మందకృష్ణ మాదిగ వంటి తెలంగాణ ఉద్యమకారులను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో కెటిఆర్, హరీశ్‌రావు ఉన్నారని, ముందుగా ఆ ప్రశ్నలకు వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# మధ్యవర్తుల ద్వారా అమెరికా–ఇరాన్ చర్చలు

- వాళ్ళకు ఎలాంటి హామీలూ ఇవ్వలేదు: ట్రంప్ • అమెరికా ప్రజలకు నిజం చెప్పాలని ఐఆర్‌జిసి డిమాండ్
- మాకు భద్రతలేకపోతే సర్వత్రా దాడులు: ఘాలిబాఫ్

**న్యూయార్క్:**అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు సుముఖంగా లేమని ఇరాన్ స్పష్టం చేసినప్పటికీ మధ్యవర్తి దేశాలు ఖతార్–పాకిస్థాన్ ప్రతినిధుల సహాయంతో అమెరికా–ఇరాక్ మధ్య పరోక్ష చర్చలు సానుకూలంగా జరిగాయి.ఇరాన్‌కు ట్రంప్ కొన్ని హామీలు ఇచ్చారని,ఆంక్షల సడలింపు సహా స్తంభింపజేసిన ఆస్తుల విడుదలకు ఆయన ఒక ప్రతిపాదన ముందుకు తెచ్చారని తొలుత ఆక్సియోస్ వార్తాసంస్థ ప్రకటించింది. కానీ డోనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ ఈ వార్తలను ఖండించారు.''ఆక్సియోస్ కథనం అవాస్తవం, వాళ్ళకు (ఇరాన్) నేను ఎలాంటి హామీలూ ఇవ్వలేదు,ప్రతిపాదనలు చేయలేదు'' అని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా చెప్పారు. ఇరాన్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని అమెరికా అధికారులు మరోవైపు చెప్పారు. అంతకుముందు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ మాట్లాడుతూ మధ్యవర్తుల ద్వారా మేం వాళ్ళకు చెప్పాల్సింది చెప్పాం, హోర్ముజ్ జలసంధిని తెరిచే విషయంలో మంగళవారం వారి నిర్ణయం వెలువడుతుందని ఎదురుచూస్తున్నాం'' అని చెప్పడంతో ఉత్కంఠ,ఉద్రిక్త వాతావరణం నెలకుంది. హోర్ముజ్ జలసంధిని తెరిపించే విషయంపై అబ్బాస్ అరాఘ్చీ న్యూయార్క్‌లో ఖతార్ మధ్యవర్తులతో సమావేశమయ్యారు.''ఖతార్ మధ్యవర్తులు కొన్ని ఆలోచనలను ప్రతిపాదించారు,మేం వాటిపై చర్చించాం,వారు ఈ విషయాలను మరోసారి అమెరికాపక్షంతో చర్చించనున్నారు, ఆ తర్వాత అమెరికా నుండి తుది విడత స్పందన వస్తుంది, దానికోసం వేచి ఉన్నాం'' అని అబ్బాస్ అరాఘ్చీ సోమవారం రాత్రి చెప్పారు.ఇరాన్ పెట్టిన షరతులు నెరవేర్చడానికి పరిష్కార మార్గాలను అన్వేషించడంతోపాటు వాటి అమలుపై కూడా తాము చర్చించామని చెప్పారు. ఇదిలా ఉండగా, భద్రతకు నష్టం వాటిల్లినా, ఇరాన్ భద్రతకు హామీ ఇవ్వకపోయినాగానీ పశ్చిమాసియాలో ప్రాంతీయంగా ఉన్న వివిధ దేశాలలోని మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని ఇరాన్ ప్రధాన అనుసంధానకర్త, ఆ దేశ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు.మేం అన్ని దేశాలకూ చమురు విక్రయిస్తాం,మేం చమురు విక్రయించలేని దేశాలలో ఇతరులు కూడా చమురు విక్రయించలేరు, ఇరాన్ భద్రతకు హామీ ఇవ్వకపోతే, పశ్చిమాసియాలో ఏ మౌలిక సదుపాయాలకు రక్షణ ఉండదు, అవి సురక్షితంగా ఉండవు అని ఆయన హెచ్చరించారు.కాగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతినిధి హుస్సేన్ మొహెబ్బీ మంగళవారం మాట్లాడుతూ,పశ్చిమాసియా యుద్ధంలో అమెరిత్తు్గా ఓడిపోయిందని, ఇరాన్‌పై అమెరికా సైనికచర్య విఫలమైందని, డోనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజలకు నిజం చెప్పి ఈ ప్రాంతం నుండి వైదొలగిపోవాలని అన్నారు. అణ్వాయుధాలు, ఇతర అంశాలపై ట్రంప్ చేసిన ప్రకటనను తప్పుపట్టారు. డోనాల్డ్ ట్రంప్ పెద్ద అబద్ధాలకోరు అని తీవ్రంగా విమర్శించారు.కాగా మీడియా కథనాల ప్రకారం, ట్రంప్ ఒక ప్రముఖ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, త్వరలోనే ఇరాన్‌పై పూర్తిస్థాయి విజయం సాధిస్తామని అన్నారు. అమెరికాలో ద్వైవార్షిక మధ్యంతర ఎన్నికలకు ముందే ఇరాన్‌పై మరో విడత దాడులు చేసే అవకాశం ఉందని కూడా ఆయన చెప్పారు. నవంబరుకు ముందే దాడులకు అవకాశం ఉందా? అని పాత్రికేయుడు ప్రశ్నించగా,''దాడులు చేస్తామని చెప్పదలచుకోలేదు, కానీ అది సాధ్యమే'' అన్నారు.

# కాంగోలో ఆగని ఎబోలా

### ఐదు నెలల్లో 4 వేలమంది మృతి
### 8000 నిర్ధారిత కేసులు

**బునియా:**డి.ఆర్.కాంగోలో బుండిబుగ్యో ప్రమాదకర వైరస్ వ్యాప్తి విస్తరణ ప్రమాదకరస్థాయిలో విస్తరిస్తోంది. మే 15వ తేదీన కాంగోలో సరికొత్త ప్రమాదకరమైన బుండిబుగ్యో వైరస్ ఉనికి కనుగొన్నారు. అప్పటినుండీ కాంగోలో సెప్టెంబరు 26వ తేదీ నాంటికి 26 రాష్ట్రాలలో 3,900 మంది పైగా మరణించారు. మరో 8000 మంది బుండిబుగ్యో వ్యాధిన పడ్డారని 63 ఆరోగ్య మండలాల్లో అధికారులు పరీక్షల ద్వారా నిర్ధారించారు.వ్యాధి విస్తరణను అరికట్టేందుకు,పరిశుభ్రతా చర్యలు నిరంతరం కొనసాగించేందుకు అవసరమైన ఆరోగ్య కార్యకర్తలు, కార్మికుల తీవ్ర కొరత ఏర్పడింది. ప్రజలు ప్రభుత్వం,ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిన సూచనలను పాటించడంలో విఫలమవుతున్నారు. అభద్రత, అపనమ్మకం,హెచ్చరికలను పట్టించుకోకపోవడం, ప్రజలు ఉన్నచోట ఉండి చికిత్స పొందకుండా ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిపోవడం, ఆరోగ్య కార్యకర్తల సమ్మె,ప్రజలు లాక్‌డౌన్ తరహాలో క్రమశిక్షణ పాటించకుండా ఇష్టానుసారంగా సంచరించడం వంటి అనేక పరిణామాలు కూడా ఎబోలా తీవ్రస్థాయిలో వ్యాప్తి చెందడానికి కారణంగా మారిందని అధికారులు చెబుతున్నారు. కాంగోలో ఎబోలా విస్తరించడం ఇప్పటికి 17వ సారి. ప్రభుత్వంపై విశాసం కోల్పోయిన ప్రజల్లో కొందరు అధికార యుడిపిఎస్‌కు చెందిన అధికార మేరీ సెలెస్టిన్ కరోండ్వాపై దాడి చేశారు.

# జర్నలిస్టు వృత్తి కత్తిమీద సాము

- బాన్సువాడలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు ప్రారంభంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి
- బాన్సువాడలో జరిగిన అభివృద్ధి ఎక్కడా జరగలేదు: మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి






**కామారెడ్డి :** జర్నలిస్టుగా పనిచేయడం కత్తి మీద సాము లాంటిదని, ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను నిర్వహిస్తుంటే, జర్నలిస్టులు ప్రజాప్రతినిధుల పనితీరును ప్రజల ముందుకు తీసుకెళ్లే కీలక పాత్ర పోషిస్తారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి మాట్లాడే అంశాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రజాప్రతినిధులు తప్పు చేసినప్పుడు వాటిని ఎత్తిచూపే బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కె డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. పత్రికల ద్వారా ప్రజలకు అనేక విషయాలు తెలుస్తాయని, జర్నలిజం పవిత్రమైన వృత్తి అని అన్నారు. జర్నలిస్టులు తన బిడ్డలతో సమానమని పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఎల్ నినో ప్రభావంపై జర్నలిస్టులు రాసిన వార్తలను తాను చదివానని, జర్నలిస్టులు వార్తలు రాయడం తమ బాధ్యత కాగా, వాటిని చదివి తెలుసుకోవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బాన్సువాడలో జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో మరెక్కడా జరగలేదని పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దులకు సమీపంలో ఉన్న బాన్సువాడలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించడం ఎంతో ప్రయోజనకరమన్నారు. సీనియర్ జర్నలిస్టుల అనుభవాలను పంచుకోవడం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా, మంగళవారం ఉదయం సమాచార హక్కు చట్టంపై దిలీప్ రెడ్డి జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. అనంతరం నేర వార్తలకు సంబంధించిన అంశాలపై గోవింద్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్నం సెషన్‌లో వార్తా కథనాలు, ప్రత్యేక కథనాల రచనపై దిశ ఎడిటర్ మార్కండేయ శిక్షణ అందించారు. అనంతరం ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, ఏ1, సోషల్ మీడియా అంశాలపై ముద్దం నరసింహ స్వామి జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, టీజీ ఆగ్రో మాజీ చైర్మన్ కాసుల బాలరాజు, కామారెడ్డి టియుడబ్ల్యుజె అధ్యక్షులు వీర మాచినేని రజనీ కాంత్, ఐజెయు కౌన్సిల్ సభ్యులు సేపూరి వేణుగోపాల్ చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఏ. లతీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి బైరి సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

**జర్నలిస్ట్ కాలనీలో పర్యటన**

శిక్షణ తరగతులకు ముందు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి బాన్సు వాడలోని జర్నలిస్ట్ కాలనీలో పర్యటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం, కాలనీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల మీడియా అకాడమీ చైర్మన్ పోచారం శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు.

## 'సుప్రీం' ఓకె

(మూడవ పేజీ తరువాయి)

సభ్యుల ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా, లేదా మెజారిటీతో ఉండాలని ధర్మాసనానికి తెలిపారు. ఎన్నికల సంఘం పనిచేస్తున్న తీరు చూస్తుంటే, నిర్ణయాలు ఏకగ్రీవంగా ఉన్నాయా ? అనే దానిపై తీవ్ర సందేహం కలుగుతోంది అని ఆయన సమర్పించారు. 'దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) వచ్చే వారం దీనిని జాబితాలో చేర్చుతాం' అని చెప్పారు. పాట్నా నివాసి రాకేష్ కుమార్ సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనా వ్యాజ్యం (పిల్), మొత్తం ఎన్నికల సంఘానికి చట్టబద్ధంగా చెందిన అధికారాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారా ? లేదా? అని నిర్ధారించాలని, ఒకవేళ అలా అయితే, ఆ చర్యలను అనధికారికమైనవిగా ప్రకటించి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరింది. 'ప్రతివాది నెం.3 (సిఇసి) చీఫ్ విధులను నిర్వర్తించరాదని ఆదేశించాలని కోరారు. ప్రస్తుత పిటిషన్‌పై తుది విచారణ పెండింగ్‌లో ఉన్నందున భారత ఎన్నికల కమిషనర్‌ను ఆదేశించాలి. ఆ కాలంలో కమిషన్ కార్యకలాపాలు ప్రతివాది 4(సుఖ్ బీర్ సింగ్ సంధూ), ప్రతివాది 5 (వివేక్ జోషి)ల ఏకగ్రీవ నిర్ణయం ద్వారా నిర్వహించాలని, తత్ఫలితంగా ఏర్పడే ఖాళీకి ఏదైనా నిమామకం, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ సిఫారసు మేరకు జరగాలని ఆదేశించాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ, ఎన్నికల సంఘం, సిఇసి జ్ఞానేష్ కుమార్, సంధూ, జోషి, ఎన్నికల సంఘం సీనియర్ అధికారి మనీష్ గార్గ్‌లను పార్టీలుగా చేర్చారు. 'ఈ పిటిషన్ ఏ ఒక్క రాజ్యాంగ అధికారి పదవికి సంబంధించినది కాదు. కానీ, భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ గుర్తింపునకు సంబంధించినది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 (1), ఎన్నికల పర్యవేక్షణ, నిర్దేశం, నియంత్రణ అధికారాలను ఒక ప్రత్యేక ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు అప్పగించదు. అది ఆ అధికారాలను ఒక కమిషన్‌కు అప్పగిస్తుంది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## సిపిఐ అభ్యర్థిపై దాడి

(మూడవ పేజీ తరువాయి)

సమక్షంలోనే ఈ దాడి జరిగినట్లు సిపిఐ కార్యకర్తలు తెలిపారు. అనంతరం శాంతిగిరి మాట్లాడు తూ ఎలాంటి దాడి కూడా తమను, తమ పార్టీని పోరాటం నుంచి, వామపక్షాల నుంచి దూరం చేయలేదని అన్నారు. ఆ ప్రాంతంలోని సామాన్య ప్రజలెవరూ బిజెపి కార్యకర్తల రెచ్చగొట్టే మాటలకు లొంగలేదు. దానికి విరుద్ధంగా, వారు వామపక్ష కార్యకర్తలకు తమ మద్దతు, సానుభూతిని స్పష్టంగా తెలియజేశారు. మిడ్నాపూర్ ఘటనను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి స్వపన్ బెనర్జీ ఖండించారు. జిల్లా కార్యదర్శి గౌతమ్ రాయ్ మాట్లాడుతూ, ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. తూర్పు మిడ్నాపూర్ జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్కు కూడా ఫిర్యాదు చేశామని, అభ్యర్థికి భద్రత కల్పించాలని కోరామని తెలిపారు.

## మోదీ రాజీనామా చేయాలి

(మూడవ పేజీ తరువాయి)

కష్టపడి సాధించుకున్న ప్రజాస్వామ్యానికి భద్రతను కల్పించదు' అని ఆ తీర్మానం పేర్కొంది. ప్రజల ఓటు హక్కును ఈ 'బరితెగించిన దొంగతనానికి' జవాబు చెప్పకుండా వదిలిపెట్టబోమని బిజెపి, దానిచేత ఎంపిక చేయబడిన అధికారులు అర్థం చేసుకోవాలని అది తెలిపింది. దోషులకు శిక్ష పడే వరకు, ప్రతి పౌరుడి ఓటుకు భద్రత చేకూరే వరకు, ఇసిఐని ఒక స్వతంత్ర రాజ్యాంగ సంస్థగా పునరుద్ధరించే వరకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో, కోర్టులలో, వీధులలో దీనిని ప్రతిఘటిస్తుందని ఆ తీర్మానం పేర్కొంది. భారత జాతీయ కాంగ్రెస్‌కు, భారతదేశంలో సార్వత్రిక వయోజన ఓటు హక్కును పునరుద్ధరించే పోరాటం స్వాతంత్ర్య పోరాటానికి ఏమాత్రం తక్కువ కాదని అది తెలిపింది. ఈ పోరాటం దాని సరైన ముగింపుకు చేరుకునేలా చూస్తామని స్పష్టం చేసింది. మీడియా సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ఒక్క రోజు కూడా సిఇసిగా కొనసాగడానికి కుమార్‌కు నైతిక హక్కు లేదనేదే తమ ప్రధాన డిమాండ్ అని అన్నారు. 'ఆయన (సిఇసి) రాజీనామా కోసం మేము ఎంత స్థాయిలో ప్రతిఘటనను ఎదుర్కొంటామో రాబోయే రోజుల్లో ఆయనకు అర్థమవుతుంది' అని ఆయన అన్నారు. 'జ్ఞానేష్ కుమార్ కేవలం ఒక సాధనం మాత్రమే. నియంతలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినప్పుడు, అధికారంలో కొనసాగడానికి అసాధారణమైన సాధనాలను ఆశ్రయిస్తారు. ఎస్ఐఆర్ (సర్) పై ఆయన తీసుకునే చర్యలు, ఆయన యజమానులైన ప్రధాని, హోం మంత్రి అంగీకారం లేకుండా ఉండవు' అని వేణుగోపాల్ అన్నారు. ఈ విషయంలో ప్రధానికి నైతిక బాధ్యత ఉందని, తాము నైతిక కారణాల దృష్ట్యా ప్రధాని రాజీనామాను డిమాండ్ చేస్తున్నామన్నారు.

## నిరసన ప్రదర్శన

(మూడవ పేజీ తరువాయి)

పోలిసులు వ్యవహరించిన తీరు చూస్తే జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటంకోసం పౌరులను అణచివేస్తున్నారని అర్థమవుతోందని విమర్శించారు.నిరసన ప్రదర్శకులపై పోలీసులు హింసాత్మక అణచివేత చర్యలకు పాల్పడ్డారని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఒక ప్రకటనలో విమర్శించింది. ''మమ్మల్ని బలవంతంగా నిర్బంధించారు,మేం ఎక్కడ ఉన్నామో కూడా మాకు తెలియదు, మమ్మల్ని ఎక్కడకు తీసుకువెళ్ళారో తెలియదు, నిరసన ప్రదర్శకులలో సిపిఐ–ఎంఎల్ నాయుడు కామ్రేడ్ సురేతా దే,శ్వేతా జార్,ఎఐసిసిటియు,ఎఐఎల్ఎజె కార్యకర్తలతోపాటు ఇతర సీనియర్ నాయకులు కూడా ఉన్నారు,కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు,మమ్మల్ని ఎక్కడకు తీసుకువెళ్ళారో మాకు తెలియదు'' అని ప్రకటన పేర్కొంది. ''జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే, ఎట్టి పరిస్థితుల్లో ఆయన ఆ పదవిలో కొనసాగడాన్ని అనుమతించబోం'' అని ఎం.ఎ.బేబీ అన్నారు.ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని,ఓటర్ల జాబితాల నుండి తొలగించిన ఓటర్ల హక్కులను పునరుద్ధరించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ,ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా సెప్టెంబరు 26 అక్టోబరు 2 వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలకు వామపక్షాలు పిలుపు ఇచ్చాయి. అందులో భాగంగా ఇసి కేంద్ర కార్యాలయంవద్ద ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఓటర్ల నమోదు,ఓటర్ల తొలగింపు,పేర్ల పునరుద్ధరణ,ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలపై గడచిన 10 నెలల కాలంలో తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల సంఘంలో ఉన్న ఇద్దరు కమీషనర్లు ఎస్.ఎస్.సంధు,వివేక్ జోషి దాదాపు 14 సార్లు తీవ్ర అసంతృప్తి,వ్యతిరేకత వ్యక్తం చేశారంటూ ''ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆంగ్ల పత్రిక ఒక ప్రత్యేక పరిశోధనా వ్యాసం ప్రచురించడంతో దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన,సిఇసి తొలగింపు కోరుతూ పోరాటానికి దిగాయి. వామపక్షాలకు ముందే కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది.ఐతే తర్వాత ఎన్నికల సంఘం తన చర్యలను సమర్థించుకుంది. సర్ ప్రక్రియకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా చేసినవేనని ప్రకటించింది.ఓటర్ల జాబితాల నుండి పేర్లను కోల్పోయే దశలో ఉన్న ఓటర్లకు సహాయపడే కొన్ని కంటి తుడుపు చర్యలను కూడా ఎన్నికల సంఘం ప్రకటించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ప్రజలను తప్పుతోవ పట్టించే చర్యలకు దిగారని, వీటిని సహించబోమని, ఆయన రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి.ఈ సమస్యపై సమష్టి కార్యాచరణ చేపట్టేందుకు సిపిఐ(ఎం)నాయకుడు ఎం.ఎ.బేబీ బిజెపి,ఎన్‌డిఎ యేతర ప్రతిపక్షాలను సంప్రదించారు. విస్తారమైన ప్రజాస్పందన కోరుతూ వామపక్షాలు తమ సొంత కార్యక్రమాలను కొనసాగిస్తాయని ఆయన ప్రకటించారు.

## అనుమతులు ఇప్పించండి

(మూడవ పేజీ తరువాయి)

వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పిఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డిఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపి), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో వివిధ ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సిఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సిఎం తెలిపారు.

**సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు అనుమతులివ్వండి**

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు డిపిఆర్‌ను సిడబ్ల్యూసికి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సిఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సిఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



**కెఆర్ఎంబి సమావేశాన్ని వాయిదా వేయండి**

అక్టోబర్ 1వ తేదీన జరగాల్సి ఉన్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) సమావేశాన్ని వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అదే రోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉన్నందున, కెఆర్ఎంబి భేటీకి హాజరుకాలేని పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సి) రమేష్ బాబు కెఆర్ఎంబి చైర్మన్‌కు అధికారికంగా లేఖ రాశారు. అక్టోబర్ 1న సిఎం అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ భేటీ జరగనుండటంతో, పలు కీలక పాలనాపరమైన అంశాలపై చర్చించాల్సి ఉందని ఆ లేఖలో పేర్కొన్నారు. మంత్రివర్గ సమావేశం కారణంగా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఆ భేటీలో బిజీగా ఉంటారని, కాబట్టి కెఆర్ఎంబి సమావేశాన్ని వేరొక తేదీకి వాయిదా వేయాలని కోరారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సమావేశానికి తగిన వేరే తేదీని ఖరారు చేయాలని ఈఎన్‌సి తన లేఖలో కెఆర్ఎంబిని కోరారు.

# అథ్లెటిక్స్‌లో ఫస్ట్ గోల్డ్

## గుల్వీర్ హాట్రిక్ రికార్డు ..టాప్ 10లోకి భారత్







జపాన్‌లోని నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్నారు. మంగళవారం నాటి పోటీల్లో భారత్ పలు చరిత్రాత్మక విజయా లు నమోదు చేసింది. మహిళల 4X400 మీటర్ల రిలేలో స్వర్ణం సాధించడంతో పాటు, ట్రాప్ షూటింగ్‌లో నీరూ దండా రికార్డు స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. అదే సమయంలో సుదీర్ఘ రేసర్ గుల్వీర్ సింగ్ హ్యాట్రిక్ పతకాలతో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు.

### స్వర్ణ పతకాలు :

**మహిళల 4X400 మీటర్ల రిలేలో స్వర్ణం:** ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్కు ట్రాక్ అండ్ ఫీల్ విభాగంలో తొలి స్వర్ణ పతకం లభించింది. మహిళల 4X400 మీటర్ల రిలే ఫైనల్లో కిరణ్ పహాల్, పూవమ్మ మచేత్తిర, ప్రాచి, విద్య రామ్రాజ్లతో కూడిన భారత బృందం 3:29.69 నిమిషాల్లో రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచి పసిడిని గెలుచుకుంది. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్యం సాధించాయి.

**షూటింగ్‌లో నీరూ దండా చరిత్రాత్మక స్వర్ణం**
మహిళల ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో హరియాణాకు చెందిన 26 ఏళ్ల నీరూ దండా తుది పోరులో 28 పాయింట్లు సాధించి సరికొత్త రికార్డుతో స్వర్ణ పతకాన్ని సాధించింది. ఆసియాడ్ చరిత్రలోనే మహిళల వ్యక్తిగత ట్రాప్ షూటింగ్లో భారత్కు ఇది తొలి పసిడి పతకం కావడం విశేషం. వానలో, ప్రతికూల వాతావరణంలో అద్భుత ప్రదర్శన చేసిన నీరూ భారత్కు ఈ చారిత్రాత్మక విజయాన్ని అందించింది.

### రజత.. కాంస్య పతకాలు

**షూటింగ్ టీమ్ ఈవెంట్లో రజతం :** వ్యక్తిగత పసిడి కంటే ముందు, నీరూ దండా టీమ్ ఈవెంట్లో ఆషిమా అహ్లావత్, మనీషా కీర్లతో కలిసి 328 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. (346 పాయింట్లతో చైనా స్వర్ణం గెలుచుకుంది).

**గుల్వీర్ సింగ్ హాట్రిక్ కాంస్యం :** పురుషుల 5000 మీటర్ల రేసును గుల్వీర్ సింగ్ 13:32.75 సెకన్లలో పూర్తి చేసి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటికే 1500, 10వేల మీటర్ల పరుగులో రజతాలు సాధించిన గుల్వీర్, ఒకే ఆసియా క్రీడల ట్రాక్ అండ్ ఫీల్ ఈవెంట్లలో మూడు పతకాలు సాధించిన నాలుగో భారత అథ్లెట్గా (లావీ పింటో, పీటీ ఉష, కేఎం బీనమోల్ తర్వాత) అరుదైన రికార్డు సృష్టించాడు.

4X100 మీటర్ల మిక్స్డ్ రిలేలో కాంస్యం: గురిందర్ వీర్ సింగ్, అనిమేష్ కుజూర్, స్నేహ సత్యానారాయణ, హరిత భద్రలతో కూడిన భారత బృందం 41.06 సెకన్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యాన్ని గెలుచుకుంది.

**మహిళల హైజంప్‌లో కాంస్యం:** భారత అథ్లెట్ పూజా సింగ్ 1.84 మీటర్ల ఎత్తుకు ఎగిరి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

### ఇతర క్రీడల్లో భారత ప్రదర్శన:

**బాక్సింగ్:** పర్వీన్ హుడా (65 కేజీలు), అంకుష్ పంగాల్ (80 కేజీలు) సెమీఫైనల్స్‌లో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు (పతకాలు ఖాయమయ్యాయి). నరేందర్ బెర్వాల్ (+90 కేజీలు) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.

**పురుషుల వాలీబాల్ :** ఖత్వా 32 తేడాతో థ్రిల్లింగ్ విజయం సాధించిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్స్కు చేరింది.

**టెన్నిస్:** దక్షిణేశ్వర్ సురేష్, సుమిత్ నాగల్ సింగిల్స్‌లో విజయాలతో ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

**ఆర్చరీ (విలువిద్య):** ధీరజ్ బొమ్మదేవర, నీరాజ్ చౌహాన్, కుమ్కుమ్ మోహోద్ అనిల్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు.

**స్క్వాష్:** భారత మహిళల జట్టు ఇరాన్ను 30తో ఓడించి క్వార్టర్స్కు చేరింది.

**క్రికెట్ :** వర్షం కారణంగా మ్యాచ్ రద్దవ్వడంతో శ్రీలంక సెమీస్ చేరింది. గురువారం సెమీఫైనల్లో భారత్, శ్రీలంకలు తలపడనున్నాయి. ఇప్పటి వరకు భారత్ మొత్తం పతకాల సంఖ్య 52కి చేరింది. ఇందులో 6 స్వర్ణాలు, 21 రజతాలు, 25 కాంస్య పతకాలు ఉన్నాయి. ప్రస్తుతం భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో కొనసాగుతోంది.






## మహిళ

# 'సాధారణం' అనే కారణం న్యాయానికి ప్రమాదకరమా?

ఒక మహిళ, ఆమె కుమార్తె సంవత్సరాల తరబడి డబ్బు, పూర్వీకుల ఆస్తిలో వాటా కోసం జరిగిన వేధింపుల అనంతరం ఆత్మహత్య చేసుకున్న కేసును ఊహించండి. ఇలాంటి ఘటనలు సమాజంలో తరచుగా జరుగుతున్నాయని చెప్పి నిందితుడిపై శిక్షను తగ్గిస్తే, బాధిత కుటుంబానికి న్యాయం అనే భావన ఎలా మిగులుతుంది? నేరం తరచుగా జరుగుతుందనే వాస్తవం దాని నైతిక తీవ్రతను తగ్గించదు. దీనికి విరుద్ధంగా, ఒక నేరం విస్తృతంగా కొనసాగితే న్యాయవ్యవస్థ దాని నిర్మూలనకు మరింత స్పష్టమైన ప్రమాణాలను ఏర్పాటు చేయాలి. నేరం సాధారణమైందని చెప్పి శిక్షను సడలిస్తే, చట్టం సమాజాన్ని మార్చే సాధనంగా కాకుండా సమాజంలోని చెడు అలవాట్లకు అనుగుణంగా మారే వ్యవస్థగా కనిపిస్తుంది. లైంగిక హింసకు సంబంధించిన కొన్ని ఇటీవలి తీర్పులు కూడా ఇదే ఆందోళనను రేకెత్తించాయి. పాట్నా హైకోర్టు ఒక కేసులో మహిళ ఛాతీని బలవంతంగా నొక్కడం, ఆమె దుస్తులు తొలగించేందుకు ప్రయత్నించడం వంటి చర్యలను అత్యాచారయత్నంగా కాకుండా మహిళ మర్యాదను భంగపరిచే నేరంగా పరిగణించింది. ఇలాంటి వ్యాఖ్యానాలు బాధితురాలు ఎదుర్కొన్న భయం, శారీరక ఉల్లంఘన, మానసిక ప్రభావాన్ని న్యాయపరమైన విశ్లేషణలో ఎంతవరకు పరిగణిస్తున్నామనే ప్రశ్నను ముందుకు తెస్తాయి. 2025 మార్చిలో అలహాబాద్ హైకోర్టు ఒక బాలిక పైజామా నాడాను లాగడం, ఆమె ఛాతీని పట్టుకోవడం వంటి చర్యలు అత్యాచారయత్నం కాదని, పోక్సో చట్టం కింద మరింత తక్కువ శిక్షకు దారితీసే నేరంగా పరిగణించవచ్చని తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు ఈ తీర్పును స్వయంచాలకంగా పరిగణనలోకి తీసుకుని తరువాత దాన్ని రద్దు చేసింది. పాట్నా కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కూడా ఇలాంటి తీర్పులు వెలువరించే ముందు న్యాయమూర్తులు మరింత పరిశోధన చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా న్యాయస్థానాలు, పోలీసులకు లైంగిక నేరాల విషయంలో సున్నితత్వాన్ని పెంచే మార్గదర్శకాలు అవసరమని సుప్రీంకోర్టు చర్యలు చూపించాయి. ఈ పరిణామాలు ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. అత్యాచారం లేదా అత్యాచారయత్నం వంటి నేరాలను కొన్ని నిర్దిష్ట శారీరక చర్యల జాబితాకు పరిమితం చేసే వ్యాఖ్యానాలు అప్పుడప్పుడు మాత్రమే కనిపించే సమస్యగా కనిపించడం లేదు. అదే సమయంలో, ఇలాంటి వ్యాఖ్యానాలు ఉన్నత న్యాయస్థానాల స్థాయికి చేరిన ప్రతిసారీ సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోందనే ప్రశ్న కూడా మిగులుతోంది. న్యాయవ్యవస్థ సమాజంలోని దురాచారాలను ప్రతిబింబించేందుకు మాత్రమే పనిచేయదు. చట్టం సమాజం అనుసరించాల్సిన ప్రమాణాలను కూడా నిర్దేశిస్తుంది.



అదే తర్కాన్ని ఇతర సామాజిక దురాచారాలకు వర్తింపజేస్తే సమస్య మరింత స్పష్టమవుతుంది. మంత్రగత్తె పేరుతో మహిళలపై దాడులు, ఒంటరి మహిళల భూముల ఆక్రమణ, మూఢనమ్మకాల ఆధారంగా జరిగే హింస తరచుగా జరుగుతున్నాయని చెప్పి వాటిపైనా శిక్షను తగ్గించాలా? నేరం విస్తృతంగా ఉందనే కారణం దాని మీద సమాజం చూపాల్సిన అసహనాన్ని తగ్గించకూడదు. న్యాయం అనేది విషాదం ఎంతతరచుగా జరుగుతుందో ప్రతిబింబించే అద్దం కాదు. సమాజం ఎలా ఉండాలనే లక్ష్యానికి అది ఒక ప్రమాణం. మహిళలపై హింస, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు సాధారణమైపోయాయనే వాస్తవాన్ని శిక్షా ప్రమాణాలు అంగీకరించకూడదు. చట్టం నేరం విస్తృతిని చూసి వెనక్కి తగ్గితే, బాధితుల రక్షణలో దానిపాత్ర బలహీనపడుతుంది. ఏదిఏమైనా, సమాజంలో హింస ఎంత విస్తరించిందో చూసి శిక్షను సడలించాలా, లేక జరిగిన నష్టాన్ని, నేరం యొక్క స్వభావాన్ని, బాధితుడిపై దాని ప్రభావాన్ని ఆధారంగా చేసుకుని శిక్షను నిర్ణయించాలా? అనేది న్యాయవ్యవస్థ ముందున్న ప్రశ్న. ఒక్కటే నేరం పదేపదే జరుగుతున్నదనే కారణంతో దాని తీవ్రతను నిర్ణయించకూడదు. ఒక మహిళ ప్రాణం కోల్పోయిన ప్రతిసారీ అది ఒక ప్రత్యేక మానవ విషాదమే. న్యాయవ్యవస్థ ఆ విషాదాన్ని గణాంకంగా కాకుండా, న్యాయం కోరుతున్న ఒక మానవ జీవితంగా చూడాల్సి ఉంటుంది. ('న్యూస్‌క్లిక్'లో శ్రియాంక సాహూ వ్యాసం ఆధారంగా)

భారత న్యాయవ్యవస్థలో ఒక ఆందోళనకరమైన ధోరణి కనిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో ఒక నేరం సమాజంలో తరచుగా

### నేరం తరచుగా జరుగుతోందని శిక్ష తగ్గించవచ్చా?

జరుగుతోందనే కారణంతో, దానికి విధించే శిక్ష తీవ్రతను న్యాయస్థానాలు తగ్గిస్తున్నాయి. ముఖ్యంగా వరకట్న మరణాల కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్షను పదేళ్లు లేదా అంతకంటే తక్కువ కాలానికి తగ్గించిన సందర్భాలు ఈ చర్చకు కారణమయ్యాయి. ఇలాంటి తీర్పుల్లో కొన్ని న్యాయస్థానాలు వరకట్న మరణాలు అసాధారణమైనవి లేదా అరుదైనవి కావు అనే అంశాన్ని శిక్షను నిర్ణయించే సమయంలో పరిగణనలోకి తీసుకున్నాయి. ఇక్కడ సమస్య కేవలం ఒక శిక్షా కాలాన్ని తగ్గించడంలో లేదు. నేరం ఎంత తరచుగా జరుగుతుందనే అంశాన్ని దాని తీవ్రతను అంచనా వేసే ప్రమాణంగా ఉపయోగిస్తే, న్యాయ సూత్రానికే విరుద్ధమైన పరిణామం ఏర్పడుతుంది.ఒక ఘోరమైన నేరం సమాజంలో ఎక్కువగా జరుగుతోందంటే, దానిని అరికట్టేందుకు మరింత కఠినమైన సామాజిక, న్యాయపరమైన చర్యలు అవసరం కావాలి. కానీ అదే నేరం సాధారణమైపోయింది అనే కారణంతో శిక్షను తగ్గిస్తే, న్యాయవ్యవస్థ సమాజంలోని దుష్ప్రవర్తనకు అనుగుణంగా తన ప్రమాణాలను దిగజార్చినట్టవుతుంది.

**చట్టం మారింది, సమస్య మాత్రం కొనసాగు-తోంది...**భారతీయ శిక్షాస్మృతి స్థానంలో 2023లో భారతీయ న్యాయ సంహిత అమల్లోకి వచ్చింది. వరకట్న మరణానికి సంబంధించిన నిబంధన ఇప్పుడు బీఎన్ఎస్‌లోని సెక్షన్ 80లో ఉంది. ఇది పాత ఐపిసి 'సెక్షన్ 304 బి'కి సమానమైన నిబంధనను కొనసాగిస్తోంది. వివాహమైన ఏడేళ్లలోపు ఒక మహిళ అసహజ పరిస్థితుల్లో మరణించినప్పుడు, ఆమె మరణానికి ముందు వరకట్నం కోసం భర్త లేదా అతని బంధువులు క్రూరత్వానికి లేదా వేధింపులకు గురిచేసినట్టు ఆధారాలు ఉంటే ఈ నిబంధన వర్తిస్తుంది. అదే విధంగా భర్త లేదా అతని బంధువులు భార్యపై క్రూరత్వానికి పాల్పడటాన్ని బిఎన్ఎస్ సెక్షన్ 85 పరిష్కరిస్తుంది. ఇది గతంలో ఐపిసి 'సెక్షన్ 498 ఎ' పరిధిలో ఉన్న న్యాయరక్షణను కొనసాగిస్తుంది. అందువల్ల శిక్షను నిర్ణయించే విషయంలో న్యాయస్థానాలకు కొంత విచక్షణ ఉంటుంది. అయితే ఆ విచక్షణను ఉపయోగించేటప్పుడు నేరం యొక్క సామాజిక ప్రాబల్యాన్ని శిక్ష తగ్గించడానికి కారణంగా చూడటం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది.

# పెంచిన హమాలీ కూలీ రేట్ల జీఓ విడుదల చేయకుంటే సమ్మె తప్పదు

### ఎఐటియుసి యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్




**ప్రజాపక్షం/భువనగిరి :** సివిల్ సప్లై హమాలీలకు ప్రస్తుతం ఉన్న కూలీ రేట్లను రూ.33కు పెంచుతూ కమిషనర్ సమీక్షంలో జరిగిన చర్చల ఒప్పందాన్ని వెంటనే అమలు చేసి జీఓను విడుదల చేయాలని, లేకుంటే సమ్మె తప్పదని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం భువనగిరి పట్టణంలో జరిగిన సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమావేశానికి ఇమ్రాన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సివిల్ సప్లై గోదాముల్లో పనిచేస్తున్న హమాలీలు అనేక సంవత్సరాలుగా పనిచేస్తూ ప్రభుత్వ రేషన్ వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు కీలకంగా పనిచేస్తున్నప్పటికీ, వారి సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. హమాలీ రేట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు కాకుండా ప్రతి నెలా 1న ఒకేసారి బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, హమాలీలకు ఇఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్ అయినా హమాలీలకు పిఎఫ్, పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని, సొంత గోదాముల వద్ద మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుతం ఉన్న కూలీ రేట్ల జీఓను 33 రూపాయలకు పెంచుతూ కమిషనర్‌తో జరిగిన చర్చల ఒప్పందం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎఐటియుసి జిల్లా కోశాధికారి సామల శోభన్‌బాబు, నాయకులు గొరిగే శంకరయ్య, పిన్నం జగన్, పురుగుల రవి, బోదుల యాదయ్య, ముదిగొండ బసవయ్య, శ్రీనివాస్, గణేష్, జహంగీర్, స్వామి, మైసయ్య, జీడయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రహీంఖాన్‌పేట స్టేజీ వద్ద బస్సులు ఆపాలని సిపిఐ వినతి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం):** రహీంఖాన్ పేట స్టేజీ వద్ద, బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్ వద్ద బస్సులు ఆపాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. మంగళవారం సిపిఐ ఆత్మకూర్ మండల సమితి ఆధ్వర్యంలో తొర్రూర్ డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ స్పందించి రహీంఖాన్ పేట స్టేజీని ఎస్ఆర్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపి, ఇక నుంచి మా డిపోకు చెందిన బస్సులు రహీంఖాన్ పేట స్టేజి వద్ద ఆపుతామని, అదే విధంగా బీబీనగర్ ఎయిమ్స్ వద్ద ఆపుతారని హామీ ఇచ్చారు. డిపో మేనేజర్‌కి సిపిఐ నాయకులు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాషికంటి లక్ష్మీ నరసయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, ఎండి నయీమ్, యాస బుచ్చిరెడ్డి, మారుపాక అంజయ్య, ఆత్మకూరు పట్టణ కార్యదర్శి మజ్జిగ నరసయ్య, ఇంజమూరి గణేష్ పాల్గొన్నారు.



# ఓటర్లను అయోమయానికి గురిచేస్తున్న 'సర్'

### ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ రాజీనామా చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** సర్ ప్రక్రియ పేరుతో ఓటర్లను అయోమయానికి గురిచేస్తున్న జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ తక్షణమే రాజీనామా చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం చాడ వెంకట్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యాలయంలో వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటినుంచి మోదీ తన12 ఏళ్ల పాలనలో అన్ని వ్యవస్థలను సర్వ నాశనం చేశారని ఆరోపించారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి మూల స్తంభం అయిన ఎన్నికల కమిషన్‌ను తన పావులుగా వాడుకుంటుందన్నారు. ఎన్నికల కమిషన్ అనేది భారత పౌరులందరికీ పారదర్శకంగా, స్వతంత్రంగా వ్యవహరించాలే తప్పా వ్యక్తి అడుగు జాడల్లో నడవ కూడదన్నారు. దేశ ప్రధాని మోదీ అడుగు జాడల్లో జాతీయ ఎన్నికల కమిషన్ పనిచేయడం సిగ్గుచేటన్నారు. పశ్చిమ బెంగాల్లో సర్ పేరుతో 70 నుంచి 80 లక్షల ఓట్లను తొలగించడంతోనే అక్కడి ప్రభుత్వం మారి బిజెపి అధికారంలోకి వచ్చిందని, ఈ సమస్య చాలా రాష్ట్రాల్లో రాబోయే రోజుల్లో ఉండబోతోందని ఆరోపించారు. భారత రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ ఎన్నికల కమిషన్‌ను తమకు అనుగుణంగా వాడుకుంటున్నారన్నారు. నమూనా బ్యాలెట్ పద్ధతికి స్వస్తి చెప్పి ఇవిఎం వ్యవస్థను చలామణిలోకి తీసుకవచ్చిన నాటినుంచే ఎన్నికల ప్రక్రియలో అనేక తప్పిదాలు జరుగుతున్నాయన్నారు. సర్ ప్రక్రియ పేరుతో కొత్త పేర్లు నమోదు చేయడం పక్కనబెట్టి ఉన్న ఓట్లను, ప్రతిపక్షాల ఓట్లను తొలగించడమే బిజెపి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. సర్ ప్రక్రియలో జరుగుతున్న ఆక్రమాలను తక్షణమే ప్రధాని మోదీ గుర్తించి, బాధ్యత వహించి జాతీయ ఎన్నికల కమిషనర్‌ను తొలగించని పక్షంలో దేశవ్యాప్తంగా అక్టోబరు 2న ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలు తిరుగుబాటు చేయకముందే మోదీ ప్రభుత్వం కళ్ళు తెరిచి సర్ ప్రక్రియను సరి చేయాలన్నారు. మరోవైపు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డివిరుస్తూ కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందన్నారు. కూడు, గూడు, గుడ్డ అనే ముఖ్యమైన వాటిని కూడా నిరుపేదలకు అందించడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఉపాధి పథకాన్ని పూర్తిగా కేంద్రం నిర్వీర్యం చేస్తున్నదని అసెంబ్లీలో మంత్రి సీతక్క సమస్యను లెవనేతినప్పటికి ఇప్పటికి 90 శాతం ఉపాధి నిధులు కేంద్రం విడుదల చేయక పోవడంతో అటు కార్మికులు ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనకు గురవుతుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నాయకులకు చాడ వెంకట్‌రెడ్డి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. పార్టీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం,ఎఐటియుసి బీడీ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెన్న మహేష్, నాయకులు నామని లక్ష్మి, ఉస్మాన్, కిరణ్, శ్రీనివాస్, శంకరయ్య, వెన్న సురేష్, ముక్రం, రాము, ఆంజనేయులు, శాంత, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇఎస్ఐ ఆసుపత్రిలో 8 నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయం




### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ

**ప్రజాపక్షం/వరంగల్ :** వరంగల్ ఇఎస్ఐలో పనిచేస్తున్న దాదాపు 55 మంది ఆక్టివిటీ శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు ఫిబ్రవరి నుంచి ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా విమర్శించారు. మంగళవారం ఇఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులతో ధర్నా నిర్వహించి అనంతరం అధికారులను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ పది నెలలుగా పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకపోవడం దీనిపైన తగు చర్యలు తీసుకోకపోవడం ఆసుపత్రి యాజమాన్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. గత ఎనిమిది నెలలుగా కార్మికులతో విధులు నిర్వహించుకుంటూ కాంట్రాక్టర్‌ను అప్రమత్తం చేయకపోవడం, పాత కాంట్రాక్ట్ ద్వారా రావలసిన పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోకపోవడం, ఇఎస్ఐ అధికారుల నిర్లక్ష్యానికి కార్మికులు బలి అవుతున్నారని విమర్శించారు. తక్షణమే ఇఎస్ఐ ఆసుపత్రిలో పనిచేయుచున్న కాంట్రాక్టు కార్మికుల జీతాలు చెల్లించని యెడల ఇఎస్ఐ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్మికులకు పది నెలలుగా పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకపోవడంతో వారు ఎస్పై ఎలిజిబిలిటి కోల్పోవడం జరిగిందన్నారు. జీతం లేకపోవడం ఒకవైపు ఇన్సూరెన్స్ సౌకర్యమైన ఇఎస్ఐ సౌకర్యం లేకపోవడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఎఐటియుసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తడిగెల సంధ్యారాణి, ఇఎస్ఐ ఆస్పత్రి కార్మికులు కార్యదర్శి భాస్కర్ల, సతీష్, మనిప్రసాద్, రజిత, విజయ, రేణుక, హారతి, మధుసూదనాచారి, రాజు, హారతి, మంజుల తదితరులు పాల్గొన్నారు

# ఆర్‌టిసి విలీనం ఎంప్లాయీస్ యూనియన్‌తోనే సాధ్యం

### ఎఐటియుసి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ఆర్‌టిసి విలీనం ఎంప్లాయీస్ యూనియన్‌తోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఆర్‌టిసి ఉద్యోగులు బస్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్రం పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల డిపోలలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆర్‌టసి గుర్తింపు ఎన్నికలలో ఇయు. టిఎంయు, ఎన్ఎంయు బలపరిచిన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదుల వెంకన్న జగిత్యాల పర్యటనను విజయవంతం చేయాలని ఆర్‌టిసి కార్మికులను కోరారు. ఈ సందర్భంగా ముక్రం మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో ఆర్‌టిసి నష్టాల్లోకి వెళ్లిందన్నారు. ఎన్నికల్లో ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించి, విలీనం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల్లో కార్మికులను మోసం చేసిందని మండిపడ్డారు. ఆర్‌టిసి కార్మిక హక్కులు ఇయునే సాధ్యమని వివరించారు. ఎన్నికల్లో గెలిపిస్తే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, అధికారుల వేధింపులు తగ్గిస్తామని, పిఆర్‌సి డబ్బులు పెండింగ్‌లో ఉన్న సిసిఎస్ డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గణేష్, నాయకులు రాములు, విశ్వనాథం, మహేష్, కిరణ్, రజాక్, కుమార్, రమేష్ గౌడ్, అశోక్, వెంకట్ రాజు, సాయి ఈశ్వరి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.






## ఆర్‌టిసి కార్మికుల హక్కుల సాధనలో జెఏసి పోరాటాలే కీలకం

గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇయు, టిఎంయు, ఎన్ఎంయు కూటమిని గెలిపించాలి: ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జెఏసి ఆధ్వర్యంలో సాగించిన పోరాటాల ఫలితంగానే ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం, 11 శాతం వేతన సవరణ, ఖాళీల భర్తీ, ప్రమోషన్లకు సంబంధించిన కీలక నిర్ణయాలు సాధించామని ఆర్‌టిసి జెఏసి చైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇయు, టిఎంయు, ఎన్ఎంయు నాయకులు పాల్గొని కూటమికి సంబంధించిన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. కూటమికి రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు తెలుపుతున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా ఈదురు వెంకన్న మాట్లాడుతూ జెఏసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె అనంతరం ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో కార్మికుల 32 డిమాండ్లపై అంగీకారాలు సాధించామని పేర్కొన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయడం జెఏసి పోరాట ఫలితమేనన్నారు. యూనియన్ ఎన్నికలు రద్దైన నేపథ్యంలో తిరిగి ఎన్నికలు నిర్వహించుకునే అవకాశం కల్పించడంలోనూ జెఏసి కృషి చేసిందన్నారు. ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గుర్తింపు సంఘంగా(క్లాజ్3)తో పాటు హైదరాబాద్ జోన్, కరీంనగర్ జోన్‌లలో నాన్ ఆపరేషనల్‌లో స్థానిక గుర్తింపు(క్లాజ్6) కోసం పోటీ చేస్తుందని తెలిపారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరు బస్సు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మిగతా స్థానాల్లో టిఎంయు, ఎన్ఎంయు పోటీలో ఉంటుందని స్పష్టం చేశారు.

**కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం..** కొన్ని సంఘాలు భారీగా డబ్బు ఖర్చు చేస్తూ, ఆర్భాటంగా ప్రచారం నిర్వహిస్తూ కార్మికులను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నాయని వెంకన్న ఆరోపించారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జెఏసి కూటమికి ఎన్నికల్లో భారీ మెజారిటీతో మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఇయు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబుతో పాటు పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

# అంబానీ సంస్థల్లోకి మాజీ ప్రభుత్వ చీఫ్‌లు

సెబీ చీఫ్, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్, ఎస్‌బిఐ, ఐఒసి చైర్మన్లు

తాజాగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణ మురారి నియామకం

మళ్లీ తెరపైకి 'రిటైర్‌మెంట్ తర్వాత ఉద్యోగాల' వివాదం

(బిరుదరాజు వాసుదేవరాజు)



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలలో కీలక పదవుల్లో ఉన్నప్పుడు కీలక నిర్ణయాలు తీసుకున్న ఉన్నతాధికారులు పదవీ విరమణ అనంతరం ఆ నిర్ణయాలకు సంబంధించిన కార్పొరేట్ సంస్థల్లో కీలక పదవులు చేపడితే దానిని ఎలా చూడాలి? ఇది చట్టపరమైన అంశమా? లేక నైతిక విలువలకు సంబంధించిన అంశమా? లేక ప్రయోజనాల సంఘర్షణకు దారితీసే పరిస్థితా?. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న ప్రశ్న ఇదే. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమురారి వారం రోజుల కింద వంతారా స్వతంత్ర గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా నియమితులు కావడంతో ఈ చర్చ మరోసారి ముందుకు వచ్చింది. వంతారా అనేది రిలయన్స్ ఇండస్ట్రీస్, రిలయన్స్ ఫౌండేషన్‌కు అనుబంధంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో నిర్వహిస్తున్న వన్యప్రాణి రక్షణ, పునరావాస కేంద్రం. కొత్తగా ఏర్పాటైన గవర్నింగ్ కౌన్సిల్‌కు సంరక్షణ, జంతువుల రక్షణ, చట్టపరమైన అనుసరణ, భవిష్యత్ విధానాల పర్యవేక్షణ వంటి బాధ్యతలు అప్పగించారు. భవిష్యత్తులో వన్యప్రాణుల దిగుమతులకు సంబంధించిన దరఖాస్తులపై కూడా ఈ కౌన్సిల్‌కు కీలక పాత్ర ఉండనుంది. ఇక్కడే జస్టిస్ కృష్ణమురారి గతంలో విచారించిన కొన్ని కేసులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వంతారాతో అనుబంధంగా ఉన్న గ్రీన్స్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌కు జంతువుల సేకరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను 2022లో జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ కృష్ణ మురారి ధర్మాసనం విచారించింది. ఆ కేంద్రానికి సెంట్రల్ జూ అథారిటీ గుర్తింపు విషయంలో చట్టపరమైన లోపం లేదని, దాని కార్యకలాపాలను చట్టవిరుద్ధమైనవిగా పేర్కొనే ఆధారాలు లేవని ధర్మాసనం పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఏనుగుల బదిలీకి సంబంధించిన మరో కేసులోనూ జస్టిస్ కృష్ణమురారి పాత్ర ఉంది. రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు సంబంధించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో, అనంతరం 2023లో జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా ధర్మాసనం ఈ వ్యవహారంపై తీర్పు ఇచ్చింది. ఆ తీర్పులో ఏనుగుల బదిలీలను పర్యవేక్షించే వ్యవస్థకు దేశవ్యాప్త పరిధి కల్పించినట్లు న్యాయపరమైన విశ్లేషణలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో వంతారా వ్యవహారంపై వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను 2025లో కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అందులో పరిశీలించిన అంశాల్లో వర్తించే వన్యప్రాణి, కస్టమ్స్, విదేశీ వాణిజ్య, ఆర్థిక తదితర చట్టాల ఉల్లంఘన గుర్తించలేదని దర్యాప్తు బృందం పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ అంశాన్ని కూడా ప్రస్తుత చర్చలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇక జస్టిస్ కృష్ణమురారి వంతారా గవర్నింగ్ కౌన్సిల్‌లో చేరిన నేపథ్యంలో మరో కీలక అంశం కూడా తెరపైకి వచ్చింది. 2023లో ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబానికి జెడ్ ప్లస్ భద్రతను దేశ వ్యాప్తంగా, విదేశీ పర్యటనల సమయంలోనూ కొనసాగించవచ్చని జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ భద్రతా వ్యయాన్ని అంబానీ కుటుంబమే భరించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది.

రిలయన్స్‌కు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాల్లోనూ జస్టిస్ కృష్ణమురారి ఉన్న ధర్మాసనాలు ఉన్నాయి. 2022లో రిలయన్స్ ఇండస్ట్రీస్ వర్సెస్ సెబీ కేసులో ఆయన, అప్పటి ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, జస్టిస్ హిమా కోహ్లీతో కూడిన ధర్మాసనంలో ఉన్నారు. సుప్రీంకోర్టు రికార్డుల్లో ఈ కేసు వివరాలు నమోదయ్యాయి. 2022లో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు సంబంధించిన ఆదాయపు పన్ను వివాదంలోనూ జస్టిస్ కృష్ణమురారి ఉన్న ధర్మాసనం అప్పీల్‌ను తిరస్కరించింది. ఇలాంటి నేపథ్యాన్నే ప్రస్తావిస్తూ ఓ సీనియర్ న్యాయవాది ప్రశాంత్‌భూషన్ తన సామాజిక మాధ్యమంలో ఒక జాబితాను విడుదల చేశారు. మాజీ బ్యాంకు చైర్మన్లు, నియంత్రణ సంస్థల మాజీ అధిపతులు, ప్రభుత్వరంగ సంస్థల మాజీ ఉన్నతాధికారులు, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం రిలయన్స్ గ్రూప్‌లో వివిధ బాధ్యతలు చేపట్టడంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ఆ జాబితాలో మాజీ ఎస్‌బిఐ చైర్‌పర్సన్ అరుంధతి భట్టాచార్య, మాజీ సివిసి కెవి చౌదరి, మాజీ ఐఒసి చైర్మన్ సంజీవ్ సింగ్, మాజీ బిపిసిఎల్ చైర్మన్ సార్థక్ బెహూరియా, మాజీ గెయిల్ అధికారి ప్రభాత్ సింగ్, మాజీ సిజిఐ, కాగ్ రాజీవ్ మహర్షి, మాజీ ఆర్థిక కార్యదర్శి ఆర్ఎస్ గుజరాల్, మాజీ ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ ఎం.కె.జైన్, మాజీ ఐసిఐసిఐ అధిపతి కె.వి. కామత్, ఎ.కె.పూర్వార్, డి.సేన్‌గుప్తా తదితరులతో పాటు జస్టిస్ కృష్ణమురారి పేరు కూడా ఉంది. అయితే, ఈ జాబితాలోని వ్యక్తులు తమ అధికార పదవుల్లో ఉండగా రిలయన్స్‌కు ఉద్దేశపూర్వకంగా లేదా అక్రమంగా ప్రయోజనం కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి.

అదే సమయంలో, ఒకే కార్పొరేట్ సమూహంలోకి పెద్ద సంఖ్యలో మాజీ నియంత్రణాధికారులు, ప్రభుత్వరంగ సంస్థల మాజీ అధిపతులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తులు వెళ్లడం వల్ల 'కూలింగ్ ఆఫ్' వ్యవస్థ, పారదర్శకత, రిక్యూజల్ నిబంధనలు వంటి అంశాలపై చర్చ జరగడం సహజమే. జస్టిస్ కృష్ణ మురారి నియామకం ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది.

ఎందుకంటే ఆయన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో వంతారా పరిధిలోకి వచ్చిన సంస్థలకు సంబంధించిన కేసులను విచారించిన ధర్మాసనాల్లో సభ్యుడిగా ఉన్నారు. ఇప్పుడు అదే సంస్థకు సంబంధించిన అత్యున్నత పాలనామండలిలో ఓటింగ్ సభ్యుడిగా ఉన్నారు. ఇది ఒక్క జస్టిస్ కృష్ణమురారి లేదా ఒక్క వంతారా వ్యవహారానికి మాత్రమే పరిమితమైన ప్రశ్న కాదు. ప్రభుత్వ పదవుల్లో ఉన్న వ్యక్తులు పదవీ విరమణ తర్వాత అదే రంగంలోని ప్రైవేట్ సంస్థల్లో కీలక బాధ్యతలు చేపట్టే విధానంపై దేశంలో ఎలాంటి నిబంధనలు ఉండాలి? ఎంతకాలం 'కూలింగ్ ఆఫ్' ఉండాలి? గతంలో తమ ముందుకు వచ్చిన అంశాలకు సంబంధించి కొత్త సంస్థలో వారు నిర్ణయాలు తీసుకోవాలా? తీసుకోకూడదా? ఇలాంటి ప్రశ్నలపై స్పష్టమైన వ్యవస్థ అవసరమా? అన్నది ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## ప్రభుత్వ విద్యాపరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ పోరాడాలి

కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి

ఘనంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రతినిధుల సభ ప్రారంభం




**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు అవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహించాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి విద్యార్థులను కోరారు. మంగళవారం హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలవికాసలో రెండవ రోజు ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాల ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి విద్యార్థి ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశలో తాను ఎఐఎస్ఎఫ్‌తో ప్రయాణించానని, ఎఐఎస్ఎఫ్ నాయకుల ప్రభావం తనపై ఎంతో వుందని, విద్యార్థిగా తనకు మధురమైన జ్ఞాపకాలున్నాయని అన్నారు. సమాజం పూర్తిగా మారుతోందని, తదనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని, పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ విద్యార్థులు కృషి చేయాలని కోరారు. విద్యా సంస్థలలో గంజాయి, మత్తు పానీయాల్లాంటి వ్యసనాలకు బానిసలవ్వకుండా విద్యార్థులను చైతన్య పరచాల్సిన బాధ్యత ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులపై వుందన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థ, విద్య పూర్తి నిర్వచనాన్ని ఇవ్వలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజాన్ని చదవాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాలను వమ్ము చేయకుండా, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించాలన్నారు. ఎఐఎస్ఎఫ్ విద్యార్థులు సమాజ మార్పులో కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. తొలుత ఎఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగాన్ని రక్షించుకోవడానికి, విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని, రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమవుతున్నారని, ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే, విద్యార్థి లోకాన్ని ఏకం చేసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్ మాట్లాడుతూ దేశంలో నూతన విద్యా పాలసీ పేరుతో పేద దళిత, గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కశిరెడ్డి మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం, ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్ గ్యార, క్రాంతి కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారధి, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభివృద్ధి పనులను అడ్డుకోవడమే కెటిఆర్ లక్ష్యం

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్‌కు ఐదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన కెటిఆర్ ఎప్పటికీ మర్చిపోని తేదీగా మిగిలిపోతుందని, సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ ప్రభుత్వం సమరశంఖం పూరించబోతోందని, కెటిఆర్ చేసిన తప్పులను అక్కడి ప్రజలకు ఆధారాలతో వివరించనున్నామన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కోనరావుపేట మోడల్ స్కూల్, నేతన్న బజార్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, వేములవాడలో రూ.90కోట్ల అభివృద్ధి పనులు మొత్తం రూ.375 కోట్ల అభివృద్ధి పనులకు సిఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. కెటిఆర్ 2009 నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యేగా కొనసాగుతున్నా నియోజకవర్గంలో నేత కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నేత కార్మికులకు రూ.300 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని ఆరోపించారు. బతుకమ్మ చీరల తయారీని సూరత్ కంపెనీలకు అప్పగించారని అన్నారు. సిరిసిల్లలోని జెఎన్‌టియులో సరైన సౌకర్యాలు లేవని, చెరువులోనే కలెక్టరేట్ నిర్మించడంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని చామల విమర్శించారు. తంగళ్లపల్లి మండలంలో ఐదు ఎకరాల భూమిని ఆక్రమించగా కలెక్టర్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కావాలని కెటిఆర్ పగటి కలలు కంటున్నారని, ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యే మాత్రమేనని, రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎక్కడికైనా వెళ్లే అధికారం ఉందని పేర్కొన్నారు. కొంగరకలాన్ వక్ఫ్ భూముల వ్యవహారంలో కెటిఆర్ ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. అక్కడ ఉన్నవారు రైతులు కాదా అని నిలదీశారు. బహదూర్‌గూడ రైతులను పక్కన పెట్టుకుని కెటిఆర్ నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు.

## వేగవంతంగా ఓటర్ల డేటా పరిశీలన

సిఇఒ సి.సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న లాజికల్ లోపాలు (ల్యాప్స్), సరైన మ్యాపింగ్ లేని అంశాలపై నమోదుదారులకు నోటీసులు జారీ చేసి, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా మంగళవారం నాటికి సేకరించిన నివేదికల ఆధారంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 92,88,181 మంది ఓటర్లకు సంబంధించి నోటీసులు జారీ చేయాల్సి ఉండగా, అధికారుల పరిశీలన అనంతరం ఇప్పటివరకు 92,88,180 నోటీసులను విజయవంతంగా జనరేట్ చేశారు. సాంకేతిక లోపాలు, ఇతర చిరునామా సమస్యలు ఉన్న ఓటర్లకు సంబంధించి ఇప్పటివరకు 88,52,173 నోటీసులను క్షేత్రస్థాయి బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఒ) క్లెయిమ్‌దారులకు నేరుగా అందజేశారు. మిగిలిన 4,36,007 నోటీసులను సంబంధిత వ్యక్తులకు త్వరితగతిన అందజేసేలా చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులు, అభ్యంతరాల ఆధారంగా జిల్లా అధికారులు 61,87,444 విచారణలను పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో మరో 12,99,368 దరఖాస్తులు ప్రస్తుతం ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు (డిఇఒ) సమగ్ర పరిశీలన, ధృవీకరణ ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు చేపట్టిన సమగ్ర విచారణ, పరిశీలన ప్రక్రియ ద్వారా మొత్తం 48,88,076 మంది ఓటర్లు తుది ఓటర్ల జాబితా ప్రచురణకు అర్హులుగా గుర్తించబడ్డారని ప్రధాన ఎన్నికల అధికారి వెల్లడించారు.

**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, TGMSIDC డివిజన్, వరంగల్.**

ఇ.నెం. 2-11-324/1, ప్రభుత్వ సిడి & టిబి హాస్పిటల్ ప్రక్కన, హనుమకొండ - 506 009
ఫోన్ నెం. 0870-2455769, ఇమెయిల్ ఐడి: eetsmsidcwgl@gmail.com

టెండర్ నోటీస్ నెం. 7/EE/TGMSIDC/WGL/2026-27/, తేది: 28.09.2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఈ క్రింది పనుల కోసం టెండర్లు ఆహ్వానించడమైనది. 1) వరంగల్ జిల్లాలోని URSUలోని CKM హాస్పిటల్‌లో పనిచేస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్ (CMS) వరంగల్‌కు విద్యుత్ మరమ్మతులు మరియు పునరుద్ధరణ పనులు చేయడం. 2) వరంగల్ జిల్లాలోని టిజి వరంగల్ వద్ద KNRUHS లో ఉన్న 500 KVA ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు, రీప్లేస్‌మెంట్లు, రీవైండింగ్ మొదలైన పనులు చేయడం. 3) T.G. వరంగల్ జిల్లాలోని KNRUHS లో ఉన్న వాష్ రూములకు మరమ్మతులు చేయడం. ఇతర వివరాలను https://etender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TGMSIDC డివిజన్, వరంగల్.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.

షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-24/CMC/PTC-C-46/2026-27, తేది: 28.09.2026

NIT No. షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-24/CMC/PTC-C-46/2026-27, తేది: 28.09.2026, పని పేరు: ఎలివేటర్స్ (లిఫ్ట్స్) వార్షిక నిర్వహణ - 2 నెం.లు, అంచనా విలువ / ఇసివి: రూ.1.90లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 29.09.2026 మ.2.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 03.10.2026 మ.12.30గం.ల వరకు, ఇ.ఇ. పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్ చెరు సర్కిల్-46, ఫోన్ నెం. 7331189492. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 10830-PP/CL/ADVT/2026-27, Date: 29-09-2026

**సదాశివపేట మున్సిపాలిటీ కార్యాలయం**

సంగారెడ్డి జిల్లా, టి.ఎస్.

"ఇ" ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

టెండర్ నోటీసు నెం. E1/1389/SSPT/e-proc/2026-27, తేది: 28.09.2026

సదాశివపేట మున్సిపాలిటీలో వివిధ గ్రాంట్లు / పథకాల కింద అభివృద్ధి మరియు నిర్వహణ పనుల కోసం టెండర్లు పిలవబడ్డాయి; వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

ఆన్‌లైన్ బిడ్ల సమర్పణకు ఆఖరి తేది & సమయం: 07.10.2026 ఉ.10.30గం.ల వరకు,
బిడ్ల ప్రారంభం: 07.10.2026 ఉ.11.00గం.లకు,

సంప్రదించవలసిన వివరాలు: మున్సిపల్ కమిషనర్, సదాశివపేట మున్సిపాలిటీ. సెల్ నెం. 9849905918, 7331123024, ఇ-మెయిల్: mc_sadasivpet@yahoo.com
మరిన్ని వివరాలకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- కమిషనర్, సదాశివపేట మున్సిపాలిటీ

DIPR R.O. No. : 10822-PP/CL/ADVT/2026-27, Date: 29-09-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా.**

టెండర్ నోటీసు సంఖ్య: E1/KLKY/TENDER NOTICE-11/2026-27. తేదీ: 29.09.2026

కల్వకుర్తి మున్సిపాలిటీ కమిషనర్ ఆదేశాల మేరకు, సాధారణ నిధుల కింద చేపట్టే వివిధ పనుల కోసం 'ఇ-ప్రొక్యూర్‌మెంట్' వేదిక ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి.

'ఇ-ప్రొక్యూర్‌మెంట్' నోటీసు

| క్ర.నెం. | పని పేరు | | అంచనా వ్యయం (లక్షలలో) |
|---|---|---|---|
| 1 | కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్యమైన మరియు భద్రతాపరంగా సున్నితమైన ప్రాంతాలలో, 2026-27 సాధారణ నిధుల కింద CCTV కెమెరాల సరఫరా, డెలివరీ మరియు అమరిక కోసం కొటేషన్లు ఆహ్వానించడమైనది. అవసరమైన సామగ్రి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. | | రూ. 15.00 లక్షలు |
| | 1. LBE 5 AC Zen 2 (8 నెం.లు) | 2. లైట్ బీమ్ రిఫ్లెక్టర్ (1 నెం.) | |
| | 3. 64 CH NVR CP (1 నెం.) | 4. 8 TB HDD SV (4 నెం.లు) | |
| | 5. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ 4F (1000 మీ.) | 6. పోల్ బాక్సులు (12 నెం.లు) | |
| | 7. 305 M CAT అవుట్‌డోర్ కేబుల్ (18 మీ.) | 8. పోల్ రింగులు (70 నెం.లు) | |
| | 9. పోల్ స్టాండ్లు (33 నెం.లు) | 10. 5/5 PV బాక్స్ (30 నెం.లు) | |
| | 11. మీడియా కన్వర్టర్ జత (4 నెం.లు) | 12. T బాక్స్ (4 నెం.లు) | |
| | 13. ప్యాచ్ కార్డ్ (8 నెం.లు) | 14. Dlink జాక్ బాక్స్ RJ 45 (2 నెం.లు) | |
| | 15. CP UNC TA41L6C DQ (18 నెం.లు) | 16. 4 పోర్ట్ PoE ఫుల్ గిగా (12 నెం.లు) | |
| | 17. LG TV 50 అంగుళాలు (1 నెం.) | 18. 8 MP మోటరైజ్డ్ CP (19 నెం.లు) | |
| | 19. ఇతర అవసరమైన సామగ్రి | | |

| | | |
|---|---|---|
| 1 | మొత్తం పనులు | 1 నెం. |
| 2 | అంచనా విలువ | రూ. 15.00 లక్షలు |
| 3 | బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం | 30.09.2026 ఉదయం 11:30 గంటలకు |
| 4 | బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం | 03.10.2026 మధ్యాహ్నం 01:30 గంటలకు |

మరిన్ని వివరాలను "www.eprocurement.gov.in" అనే ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానిస్తున్న అధికారి: కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం; సెల్ నం. 9110540243, 7330690590.

సం/- కమిషనర్ కల్వకుర్తి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 10852-PP/CL/ADVT/2026-27, Date: 29-09-2026

## సిరిసిల్లలో ముఖ్యమంత్రి సభ ప్రజా పాలనకు, అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలకు వేదిక కావాలి

బహిరంగసభకు భారీగా తరలిరండి

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం జరగనున్న కాంగ్రెస్ బహిరంగ సభ ప్రజాపాలనకు, అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలకు వేదిక కావాలని, కాంగ్రెస్ కుటుంబం మొత్తం ఐక్యంగా కదిలి సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. సిరిసిల్ల పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో ఈ భారీ బహిరంగసభకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని ఆయన పేర్కొన్నారు. బహిరంగ సభను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, రైతు రుణమాఫీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, సామాజిక భద్రత తదితర కార్యక్రమాలతో ప్రజా ప్రభుత్వం ముందుకు కొనసాగుతోందన్నారు. సిరిసిల్లతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, నేతన్నలు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేసి సభకు ప్రజలను తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

## 'రిమ్స్' అగ్నిప్రమాదంపై ఎన్‌సిపిసిఆర్

తెలంగాణ బాలల హక్కుల కమిషన్ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో నవజాత శిశువుల అగ్నిప్రమాద ఘటనపై జాతీయ, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లు దృష్టి సారించాయి. రాష్ట్రీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (టిజిఎస్‌సిపిసిఆర్) చైర్‌పర్సన్ కోతకోట సీతా దయాకర్‌రెడ్డి, సభ్యులతో సమావేశమై ఘటనకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా సెప్టెంబర్ 24న టిజిఎస్‌సిపిసిఆర్ బృందం రిమ్స్ అదిలాబాద్‌ను సందర్శించిన సందర్భంగా చేపట్టిన పరిశీలనలు, బాధిత కుటుంబాలతో జరిపిన సంభాషణలు, ఆసుపత్రి అధికారులతో నిర్వహించిన సమావేశం, చికిత్స పొందుతున్న చిన్నారుల పరిస్థితి తదితర వివరాలను ఎన్‌సిపిసిఆర్ ప్రతినిధులకు వివరించారు.

## హార్డ్‌వేర్ పార్క్ నోటిఫికేషన్ రద్దుచేయాలి

23ఏళ్ల భూసమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

అఖిలపక్ష సదస్సులో పలువురు వక్తల డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లాలోని నాదర్‌గుల్, ఆదిభట్ల, ఎం.ఎం.కుంట ప్రాంతాల్లో హార్డ్‌వేర్ పార్క్, వర్క్ సెంటర్ పేరిట గత 23 ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు రైతు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. సుమారు 3వేల ఎకరాల భూములు, 20వేల నివాస ప్లాట్లకు సంబంధించి టిజిఐఐసి భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ (జెఏసి), తెలంగాణ జన సమితి (టిజెఎస్) సంయుక్త ఆధ్వర్యంలో అఖిలపక్ష సదస్సు జరిగింది. సమావేశానికి టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఇ.టి.నరసింహాతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ 2004లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైనా ఇప్పటివరకు హార్డ్‌వేర్ పార్క్‌కోసం సేకరించిన భూమి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదన్నారు. మరోవైపు వేలాది ప్లాట్ల యజమానులు తమ భూములను వినియోగించుకోలేకపోతున్నారన్నారు. భూసేకరణ ప్రక్రియ సక్రమంగా జరగలేదని, ఆ ప్రక్రియను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించిందని గుర్తు చేశారు. ఈ సమస్యపై వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డితో చర్చించడంతోపాటు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి కూడా తీసుకెళ్లామని, ఫలితంగా సంబంధిత అధికారులను సమగ్ర వివరాలు, సర్వే నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం సమస్య ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకునే కీలక దశకు చేరుకుందని పేర్కొన్నారు. ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, భూదాన్, దేవాదాయ తదితర భూముల అక్రమ విక్రయాలు, రిజిస్ట్రేషన్లను నిరోధించేందుకు 22ఎ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, వాటిని అమలు చేసే క్రమంలో జరిగిన తప్పిదాల వల్ల నిజమైన భూయజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. 22ఎ జాబితాలో ఉన్న భూముల వాస్తవ పరిస్థితిని పరిశీలించి, అర్హులైన భూయజమానులకు న్యాయం చేయాలన్నారు. భూములు కొనుగోలు చేసిన బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందనే నమ్మకం ఉన్నదన్నారు.

చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ హార్డ్‌వేర్ పార్క్ నోటిఫికేషన్ గురించి తక్షణమే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హార్డ్‌వేర్ పార్క్ పరిధిలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారు, భవిష్యత్తు అవసరాల కోసం ప్లాట్లు కొనుగోలు చేసిన కుటుంబాలు కూడా ఉన్నాయని, వారి పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించాల్సి ఉన్నదన్నారు. వ్యవసాయ భూములు, ఇప్పటికే కంపెనీలకు కేటాయించిన భూములను విడివిడిగా గుర్తించి, వాస్తవ పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ఇ.టి.నరసింహ మాట్లాడుతూ నాదర్‌గుల్, ఆదిభట్ల, ఎంఎం కుంట ప్రాంతాల్లో భూ సమస్య దశాబ్దాలుగా కొనసాగుతుందన్నారు. భూదాన్ భూములకు సంబంధించి గతంలో అధికారులే పట్టాలు మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుత వాటిలోని భూములు కూడా నిషేధిత జాబితాలో ఉండటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ఆదిభట్లలో భూదాన్ భూముల్లో సుమారు వెయ్యి ప్లాట్లను నిరుపేదలకు కేటాయించినప్పటికీ వాటి వినియోగానికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. భూ బాధితులు, రైతులు, ప్లాట్ల యజమానులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు జెఏసిగా ఏర్పడి, సమస్య పరిష్కారానికి ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. భూ బాధితులకు న్యాయం కోసం చేపట్టే ఉద్యమానికి సిపిఐ పూర్తి మద్దతు ఇస్తుందని ఇ.టి.నరసింహ స్పష్టం చేశారు. సదస్సులో హార్డ్‌వేర్ పార్క్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయవాది మాధవరం రామేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా టిజెఎస్ అధ్యక్షులు దార సత్యం, జెఏసి కన్వీనర్ ముద్దం వెంకట్ రెడ్డి, కోకన్వీనర్లు ఎం.వినయ్ రెడ్డి, కళ్లెం చంద్రారెడ్డి, శ్రీరాం రెడ్డి, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆచార్య వినోబా నగర్ కన్వీనర్ డాక్టర్ రాజశేఖర్, టిజెఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బైరి రమేశ్ తదితర నేతలు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై నమ్మకం లేకే దళితులపై వివక్ష

## ఆత్మగౌరవం కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలి: డిప్యూటీ సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపిల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశానికి సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, అస్పృశ్యత నిర్మూలన వంటి విలువలను అందించిన రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అస్పృశ్యతకు వ్యతిరేకంగా తొలి తీర్మానం ఆమోదించబడిందని, అనంతరం రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్న బిజెపికి భారత రాజ్యాంగంపై నమ్మకం లేదని ఆయన విమర్శించారు. రాజ్యాంగానికి బదులుగా మనుస్మృతి, మనుధర్మశాస్త్ర భావజాలాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతో బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. 'దేశంలోని ప్రతి పౌరుడినీ ఒక్కటిగా నిలబెట్టేది భారత రాజ్యాంగమేనని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమంటే దేశ పునాదులనే దెబ్బతీయడమని ఆయన వ్యాఖ్యానించారు. దళితులు, ఆదివాసీలపై వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే పలు



చట్టాలు తీసుకువచ్చామని, అయినప్పటికీ నేటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు.

**ఖర్గేకు జరిగిన ఘటనపై ఆగ్రహం :** మల్లికార్జున ఖర్గే కేవలం దళిత నాయకుడు మాత్రమే కాదని, సుదీర్ఘ రాజకీయ పోరాటంతో దేశంలో అత్యున్నత పదవులను అధిరోహించిన నాయకుడని భట్టి విక్రమార్క అన్నారు. కర్ణాటకలో మంత్రిగా, సీఎల్పీ నేతగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసిన ఖర్గే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి నాయకుడి సభ అనంతరం హల్ద్వానీలో 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడం దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన తీవ్రమైన అంశమని ఆయన పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీపై కేసు ఎందుకు?: భట్టి**

ఖర్గేకు జరిగిన ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ నిరసన చేపడితే, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఆయనపైనే కేసు పెట్టారని భట్టి విక్రమార్క విమర్శించారు. అవమానానికి గురైన వ్యక్తికి న్యాయం చేయాలని ప్రశ్నిస్తే ప్రశ్నించిన వారిపైనే కేసులు పెడుతున్నారు. ఇది దళితులు, ఆదివాసీల పట్ల వ్యవస్థలో ఉన్న వివక్షను బయటపెడుతోంది అని ఆయన అన్నారు.

**20 కోట్ల మంది ఎస్సీలను పట్టించుకోరా?**

దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన కోట్లాది మంది ప్రజలు ఉన్నారని, వారందరూ సమాన హక్కులు, గౌరవంతో జీవించేలా రాజ్యాంగం కల్పించిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని భట్టివిక్రమార్క అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, మైనారిటీలు సహా కోట్లాది మందిని రెండో తరగతి పౌరులుగా చూసే పరిస్థితిని మనం అంగీకరించకూడదన్నారు. దళిత, ఆదివాసీ వర్గాలపై జరిగే వివక్ష, అవమానాలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని భట్టి అన్నారు.

**ప్రతి రాష్ట్రానికి వెళ్దాం :** 'ప్రజలను చైతన్యపరుద్దాం. మన ఆత్మగౌరవం కోసం పోరాడుదాం. ఎలాంటి అవమానాన్ని సహించబోమ్' అని భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తీసుకొచ్చిన సామాజిక న్యాయ చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దళిత, ఆదివాసీ, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ జెండా కింద ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

# ఏడాదిలోపే ఇందిరమ్మ ఇళ్ల తాళాలు అందిస్తాం

## రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి కష్టం తెలిసిన ఇందిరమ్మ ప్రభుత్వమని, పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. పేదవాడు తన జీవితకాలంలో ఒక్కసారైనా సొంత ఇంటిని చూసుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నాంపల్లి శాసనసభ నియోజకవర్గంలోని రెడ్ హిల్స్ ప్రాంతంలో మంగళవారం రూ.43.20 కోట్ల వ్యయంతో 480 ఫ్లాట్లతో చేపడుతున్న 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్' నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో సహచర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ఎంపి ఎం. అనిల్ కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ మాజిద్ హుస్సేన్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మహానగరంలో ఒక్కో ఎకరం భూమి విలువ రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్లు ఉన్నప్పటికీ, దాని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేద కుటుంబానికి సొంత ఇల్లు ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. క్యూఆర్,




కోర్ ప్రాంతంలో ప్రభుత్వ శాఖల భూములను గుర్తించి, వాటిని హౌసింగ్ శాఖకు బదలాయించి పేదల కోసం జి+10 (గ్రౌండ్ ప్లస్ టెన్) అంతస్తుల అపార్ట్‌మెంట్‌లు నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. పారదర్శకంగా నిర్వహించిన డ్రాలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, మిగిలిన వారికి తదుపరి విడతల్లో ఇళ్లు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గాల పరిధిలో సుమారు 16,7 ప్రాంతాల్లో టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే అక్కడ కూడా నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్కో అపార్ట్‌మెంట్ విలువ రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని, రెండు మూడేళ్ల సమయం తీసుకోకుండా కేవలం ఒక ఏడాదిలోనే నిర్మాణాలు పూర్తి చేసి ఇక్కడి నుంచే లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు అవసరమైతే పిల్లల చదువులు, వివాహాల కోసం రుణం పొందే అవకాశం ఉండేలా ఎలాంటి కమిషన్లు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా నేరుగా వారి పేర్లపైనే రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకుంటామన్నారు. టవర్స్‌లో నివసించే కుటుంబాలకు డ్రైనేజీ సమస్య తలెత్తకుండా మెయిన్ ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేసే బాధ్యతను హౌసింగ్ శాఖ తీసుకుంటుందని హామీనిచ్చారు. అలాగే నిర్మాణంలో నాణ్యతను పరిశీలించేందుకు వారానికి ఒక రోజు లబ్ధిదారులకు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాల్లా నగరానికి 3040 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు కట్టి పేదలను ఇబ్బంది పెట్టకుండా, వారి జీవనోపాధికి అనుకూలమైన ప్రాంతాల్లోనే ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు.

## అక్టోబర్ 1న తెలంగాణ కేబినెట్ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అక్టోబర్ 1వ తేదీన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ భేటీలో ఉద్యోగులకు రెండు డిఎలు, పిఆర్‌సి, ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలు, పెండింగ్‌లో ఉన్న, కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల పనులు, హైదరాబాద్ మెట్రో ఫేజ్1 టేజ్1, బతుకమ్మ పండుగకు ఇందిరమ్మ చీరల పంపిణీ తదితర అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డిఎలలో రెండు విడతలను దసరా సందర్భంగా విడుదల చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. మరో డిఎను సంక్రాంతి సందర్భంగా ఇచ్చే విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ఉద్యోగ సంఘాలకు తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బకాయిలను 2027 మార్చి నాటికి విడతలవారీగా చెల్లించే అంశం కూడా కేబినెట్‌లో చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం నిధుల సమీకరణలో జాప్యం నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్1 టేజ్1 గడువును మరింత పొడిగించే అంశం కేబినెట్‌లో చర్చించనున్నట్లు తెలిసింది. సెప్టెంబర్ 30తో ఉన్న గడువును మరో మూడు నెలలు పొడిగించాలని ఎల్అండ్‌టిని కోరే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వివిధ శాఖలకు సంబంధించిన కొత్త పోస్టుల మంజూరు, ఖాళీల భర్తీ, కొత్త ప్రాజెక్టులు, పరిశ్రమలకు భూముల కేటాయింపు తదితర ప్రతిపాదనలు కూడా కేబినెట్ ముందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# తెలంగాణలో విస్తృత పెట్టుబడి అవకాశాలు

## సద్వినియోగం చేసుకోవాలని ప్రవాస భారతీయులకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. జర్మనీలో పర్యటిస్తున్న తెలంగాణ శాసనసభ ప్రతినిధి బృందం ఫ్రాంక్‌ఫర్ట్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో పెట్టుబడుల అవకాశాలు, ప్రవాస తెలుగువారితో అనుసంధానంపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలోని పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఇన్నోవేషన్, టెక్నాలజీ రంగాల్లో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా వారు ప్రవాస భారతీయులకు వివరించారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. విదేశాల్లో స్థిరపడిన



తెలుగు ప్రజలు తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను రాష్ట్రానికి తీసుకురావడంలో వారధిగా నిలవాలని కోరారు. జర్మనీతో పాటు యూరప్‌లోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని కోరారు.

ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వాళ్లు తమ ప్రతిభతో ఉన్నత స్థానాలకు చేరుకోవడం చాలా గర్వకారణమని, వారు జన్మభూమి అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి సెక్రెటరీ డా నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రెటరీ ఆర్ తిరుపతి, లేజిస్లేచర్ ప్రతినిధి బృందం సభ్యులు, భారత కాన్సులేట్ అధికారులు, తెలుగు ప్రవాసులు తదితరులు పాల్గొన్నారు.

**అక్టోబర్ 9న హైదరాబాద్ రాక :** జర్మనీభారత పార్లమెంటరీ మైత్రి కార్యక్రమంలో భాగంగా 2024లో జర్మనీలోని రైన్‌ల్యాండ రాష్ట్ర స్పీకర్ హెండ్రిక్ హెరింగ్ బృందం హైదరాబాద్‌లోని అసెంబ్లీని సందర్శించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగారిటర్న్ విజిట్‌గా తెలంగాణ స్పీకర్ బృందం జర్మనీలో పర్యటిస్తోంది. యూరప్‌లోని జర్మనీ తర్వాత ఆస్ట్రియా, స్విట్జర్లాండలో ఈ బృందం పర్యటించనుంది. ఈనెల13 నుంచి 18వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ ఈ బృందం బయలుదేరి వెళ్లింది.. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ కు కొనసాగింపుగా విదేశీ పర్యటనకు ఈ బృందం వెళ్లింది. విదేశీ పర్యటనలో భాగంగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధి బృందం ఆయా దేశాల పార్లమెంట్లను సందర్శించి, అక్కడి పార్లమెంటరీ విధానాలను పరిశీలించనుంది . అక్టోబర్ నెల 9వ తేదీన శాసన మండలి చైర్మన్ , శాసన సభ స్పీకర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తిరిగి హైదరాబాద్ కు చేరుకోనుంది.

## పట్టుభద్రుల ఎమ్మెల్యే స్థానాలకు కాంగ్రెస అభ్యర్థులు ఖరారు





**హైదరాబాద్:** పట్టభద్రుల నియోజక వర్గాలకు జరిగే ఎన్నికల కోసం రెండు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి రెండు స్థానాలను కేటాయించింది. హైదరాబాద్ – మహబూబ్‌నగర్ – రంగారెడ్డి జిల్లాల గ్రాడ్యుయేట్ స్థానం అభ్యర్థిగా సామ రామ్మోహన్‌రెడ్డి.. నల్లగొండ–వరంగల్–ఖమ్మం జిల్లాలకు సంబంధించిన గ్రాడ్యుయేట్ స్థానానికి సర్వోత్తమ్‌రెడ్డిని అభ్యర్థులుగా ఎంపిక చేసింది. వీరి అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారని పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

## పేదల ఇళ్లపైకి బుల్డోజర్లను నడిపించే హక్కు ఎవరిచ్చారు? : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మద్దూరులో రాత్రికి రాత్రే పేదల ఇళ్లపైకి బుల్డోజర్లను నడిపించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరిచ్చారని, కొడంగల్ బిడ్డను అని చెప్పుకుంటున్న సిఎం కొడంగల్ ప్రజల ఇళ్లనే కూల్చేస్తారా? అని బిఆర్‌ఎస్‌ఎల్పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా ఇంత కర్కశంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను కూడా గౌరవించరా?, ఒక్కసారిగా ఇండ్లు కూల్చితే, ఏండ్ల నుండి నివాసం ఉన్నవారు ఎక్కడికి వెళ్తారని అన్నారు.

## తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు జాతీయ అవార్డు

### పోలీస్ నియామకాల్లో ఫేస్ ఆథెంటికేషన్ అమలుకు గుర్తింపు

### 4.23 లక్షల మంది అభ్యర్థుల ఆధార్ ధృవీకరణ పూర్తి

**ప్రజాపక్ష/హైదరాబాద్ :** పోలీస్ నియామక ప్రక్రియలో ఆధార్ ఆధారిత ఫేస్ ఆథెంటికేషన్‌ను వినియోగించి మోసపూరిత అభ్యర్థిత్వాన్ని అడ్డుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టిఎస్ఎల్‌పిఆర్‌బి)కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆధార్ ఆఫ్‌లైన్ వెరిఫికేషన్‌లో అత్యధిక సంఖ్యలో ధృవీకరణలు పూర్తి చేసినందుకు టిఎస్ఎల్‌పిఆర్‌బికు 'ఆధార్ సంవాద్–2026' జాతీయ అవార్డు లభించింది. కోల్‌కతాలో జరిగిన 5వ జాతీయ ఆధార్ సంవాద్ సదస్సులో బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఈ అవార్డును అందుకున్నారు. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29న కోల్‌కతాలోని జెడబ్ల్యూ మారియట్ హోటల్‌లో జరిగిన 5వ నేషనల్ స్టేక్‌హోల్డర్ కాన్ఫరెన్స్‌లో టిఎస్ఎల్‌పిఆర్‌బికు ఈ పురస్కారం అందించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కామర్స్ అండ్ ఇండస్ట్రీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమక్షంలో అవార్డు ప్రదానం జరిగింది. పోలీస్ రిక్రూట్‌మెంట్–2026లో తొలిసారిగా యుఐడిఎఐ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ సహకారంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆధార్ ఫేస్ ఆథెంటికేషన్ విధానాన్ని టిఎస్ఎల్‌పిఆర్‌బి అమలు చేసింది. యుఐడిఎఐ అందుబాటులోకి తెచ్చిన ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ విధానాన్ని అమలు చేసిన తొలి ప్రభుత్వ నియామక సంస్థగా టిఎస్ఎల్‌పిఆర్‌బి నిలిచిందని బోర్డు తెలిపింది.

## సింగరేణి కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల వాటాను చెల్లించాలి

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థ వాస్తవ లాభాల ఆధారంగానే సింగరేణి కార్మికులకు 36 శాతానికి పైగా లాభాల వాటాను చెల్లించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు కోసం వేచిచూస్తున్న 2500ల పైచిలుకు కార్మికులకు 3 నెలల మెడికల్ బోర్డుల చొప్పున పెట్టి అన్‌ఫిట్ చేసి వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, ఎన్నికల హామీల మేరకు పెరక్స్‌పై ఆదాయ పన్నును కార్మికులకు తిరిగి చెల్లించాలని, సొంతింటి పథకం అమలు చేస్తూ కార్మికులకు 250 గజాల స్థలాన్ని, రూ.20లక్షల రుపాయల వడ్డీ లేని ఋణాన్ని ఇవ్వాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కెటిఆర్ మంగళవారం లేఖ రాశారు. సింగరేణిలో మారు పేర్ల సమస్యను పరిష్కరించి,డిస్మిస్ కార్మికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన రూ.60వేల కోట్లను వెంటనే చెల్లించాలని, సింగరేణి సంస్థలో వాటాల ఉపసంహరణ, ప్రైవేటీకరణ ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు.కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## న్యాయవాదుల వృత్తి రక్షణకు ఐఎఎల్ ఉక్కు కవచం

### ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవిఎల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా న్యాయవాదుల వృత్తి రక్షణ, సంక్షేమం కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ఉక్కు కవచంలా పనిచేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది కెవిఎల్ అన్నారు. హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఐఎఎల్ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిఎల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికవాదం, న్యాయవ్యవస్థ పరిరక్షణకు ప్రగతిశీల భావాలు కలిగిన న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. న్యాయవాదుల రక్షణ, సంక్షేమంపై దేశవ్యాప్తంగా ఐఎఎల్ ఆధ్వర్యంలో సెమినార్లు, సదస్సులు, చర్చలు, పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జూనియర్ న్యాయవాదులు, ముఖ్యంగా మహిళా న్యాయవాదులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, మౌలిక సదుపా



యాలు, స్టైఫండ్లు, లైబ్రరీలు, కంప్యూటర్లు, బ్యాంకు రుణాలు, ఇంటి స్థలాలు వంటి అంశాల్లో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. న్యాయవాదుల భద్రతకు సంబంధించిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ సమన్వయంతో రాజ్యాంగ విలువలు, సమన్యాయాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.న్యాయవాదుల వృత్తిలో నిజాయితీ, విలువలు, సమర్థత, విశ్వసనీయత పెంపొందించేందుకు ఐఎఎల్ కృషి చేస్తోందని తెలిపారు. వ్యక్తి బలం కంటే సంఘటిత శక్తి గొప్పదని, మరింత మంది న్యాయవాదులు ఐఎఎల్‌లో సభ్యులుగా చేరి వృత్తి రక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐఎఎల్ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. జయ శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదులంతా ఐక్యంగా పోరాడితే అనేక సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జి. నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆకుల వెంకటరామ్, రోహిత్, జానీ పాషా, సందీప్, మహేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పప్పుధాన్యాల సాగులో ఈ ఏడాది దేశంలో తెలంగాణది రెండో స్థానం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంటల వైవిధ్యీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో ఈ ఖరీఫ్‌లో పప్పుధాన్యాల సాగు గత ఏడాదితో పోలిస్తే 36 శాతం పెరిగి దేశంలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన జాతీయ రబీ సదస్సులో మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తెలంగాణ వ్యవసాయ రంగ ప్రగతితో పాటు రాష్ట్ర అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న, జొన్నను ధరల మద్దతు పథకం (పిఎస్ఎస్) పరిధిలోకి తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. లోటు, తీవ్ర లోటు వర్షపాత మండలాలకు ప్రత్యేక కేంద్ర సాయం అందించాలని, సూక్ష్మ సాగునీరు, నీటి సంరక్షణ నిర్మాణాలకు అదనపు సహకారం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఆయిల్‌పామ్ సాగు అదనంగా 1.10 లక్షల హెక్టార్లకు విస్తరించగా, 72 వేల మంది కొత్త రైతులు సాగులోకి వచ్చారని మంత్రి తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆయిల్‌పామ్ ధరలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారని తుమ్మల వెల్లడించారు.

# పోలీసులను గుర్తించాలి

## మహిళా ఎమ్మెల్యేలపై దురుసు కేసులో హైకోర్టు ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ ప్రాంగణంలో సభా నియమాల ఉల్లంఘనకు సంబంధించి చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. అసెంబ్లీ ఆవరణలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసు ప్రవర్తన వ్యవహారంపై స్పీకర్‌కు రిపోర్టు ఇవ్వాలంది. ఒకవేళ అసెంబ్లీ గేటు బయట అంటే శాసనసభ వెలుపల ఎమ్మెల్యేల పట్ల పోలీసుల చర్యలు ఉన్నట్లు తేలితే రిపోర్టుకు తమకు ఇవ్వాలంది. ఈ మేరకు డిజిపికి హైకోర్టు మంగళవారం ఆదేశించింది. అదే సమయంలో సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో బిఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించిన, చేయి చేసుకున్న పోలీసు సిబ్బందిని గుర్తించి విచారణ జరపాలని డిజిపిని ఆదేశించింది. గుర్తించిన పోలీసుల వివరాలను స్పీకర్‌కు నివేదించాలని పేర్కొంది. అయితే ఘటన అసెంబ్లీ ప్రాంగణంలో కాకుండా ప్రవేశ ద్వారం వెలుపల జరిగిందని విచారణలో తేలితే, ఆ వివరాలను హైకోర్టుకు నివేదించాలని స్పష్టం చేసింది. న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి మంగళవారం ఈ మేరకు సెప్టెంబర్ 7న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించారు. బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దాఖలు చేసిన పిటిషన్ పై ఈ విచారణ జరిగింది. అసెంబ్లీ ఎనిమిదో సెషన్ ప్రారంభమైన సెప్టెంబర్ 7న నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలతో దురుసుగా ప్రవర్తించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా మహిళా ఎమ్మెల్యేను పోలీసులు పట్టుకున్న తీరుపై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పోలీసులు వేసిన అనుబంధ పిటిషన్ తరపున అడ్వొకేట్ జనరల్ వాదించారు.అసెంబ్లీ ప్రాంగణంలో నిరసనలు, నినాదాలు, కరపత్రాల పంపిణీ, ప్రదర్శనలు, పికెటింగ్, ధర్నాలను నిషేధిస్తూ స్పీకర్ ఇచ్చిన ఆదేశాల మేరకే పోలీసులు వ్యవహరించారని తెలిపారు. నల్ల టీషర్టులపై రాజకీయ నినాదాలతో ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారని, వారిని అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగిందని, కొందరు మహిళా పోలీసులకు కూడా గాయాలయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేలను అక్రమంగా నిర్బంధించలేదని, బిఆర్‌ఎస్ భవన్‌కు తరలించామని తెలిపారు. నినాదాలున్న టీషర్టులు ధరించిన ఎమ్మెల్యేలను అడ్డుకోవాలని చీఫ్ మార్షల్‌కు స్పీకర్ ఆదేశించారని, ఆ క్రమంలోనే పోలీసులు జోక్యం చేసుకున్నారని వాదించారు. దీనికి పిటిషనర్ తరపు న్యాయవాది స్పందిస్తూ నినాదాలు లేని దుస్తులు ధరించిన ఎమ్మెల్యేలు, మహిళా ఎమ్మెల్యేలను కూడా పోలీసులు అడ్డుకున్నారని, ఇద్దరు మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా వ్యవహరించారని తెలిపారు. ఈ వాదనల నేపథ్యంలో హైకోర్టు.. అసెంబ్లీ చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, గుమిగూడడాన్ని నిషేధిస్తూ సెప్టెంబర్ 5న పోలీస్ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు ఎమ్మెల్యేలు సభకు వెళ్లడాన్ని నిషేధించేవి కావని పేర్కొంది. ఆ నిషేధాజ్ఞలను ఎమ్మెల్యేలు ఉల్లంఘించినట్లు ఎఫ్ఐఆర్‌లో లేదంది. అసెంబ్లీ వ్యవహారాల్లో సభా నియమాల ఉల్లంఘన జరిగితే నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని, ఎమ్మెల్యేలతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించడానికి అది కారణం కాదని స్పష్టం చేసింది. ఘటన అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిందా, గేటు వెలుపల జరిగిందా అన్న అంశాన్ని డిజిపి విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## 100 రోజుల్లో 60వేల మంది విద్యార్థులకు పోషకాహారం

### సూర్యాపేటలో రూ.9.6కోట్లతో మెగా కిచెన్..

### సింగరేణి ఆర్థిక సహాయం-హరేకృష్ణ ఫౌండేషన్ సాంకేతిక సహకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులకు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం అందించడమే లక్ష్యంగా భారీ కేంద్రీకృత కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం సయ్యద్‌ముజావర్‌పేటలో రోజువారిగా దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అహారం అందించనునున్నారు. ఇందుకు సంబంధించి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన సిఎస్ఆర్ నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు రూ.9.6 కోట్లు అందించగా, 100 రోజుల్లో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఆధునిక ప్రమాణాలతో ఈ కిచెన్‌ను ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలతో కూడిన సమతుల్య ఆహారంతో పాటు మిల్లెట్ ఆధారిత వంటకాలను మెనూలో చేర్చనున్నారు. ఇందుకు ఐసీఏఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ సాంకేతిక సహకారం అందించనుంది. సూర్యాపేటతో పాటు మొత్తం 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు ఇక్కడి నుంచి ఆహారం సరఫరా చేయనున్నారు. అంతేకాకుండా ఈ కిచెన్ ద్వారా నల్గొండ జిల్లాలోని నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, వేములపల్లి మండలాల్లోని 131 ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న 7,972 మంది విద్యార్థులకు కూడా ఆహారం అందించనున్నారు. ఈ ప్రాజెక్టును నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక వసతులు, వంట, ప్యాకింగ్, రవాణా వ్యవస్థలను సమాంతరంగా సిద్ధం చేస్తున్నట్లు సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, నల్గొండ కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
30-09-2026
www.prajapaksham.in

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

రీల్

## సందడి చేస్తున్న 'ఏమో ఏమో ఇది' సాంగ్



యువ కథానాయకుడు రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఏమో ఏమో ఇది'. డా. శైలేష్ కొలను రచన, దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా 'ఏమో ఏమో ఇది' టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. సున్నితమైన మెలోడీ, హృదయాన్ని హత్తుకునే సాహిత్యంతో రూపొందిన ఈ పాట ఆద్యంతం ఆహ్లాదకరమైన ప్రేమానుభూతిని పంచుతుంది. రోషన్ మేకా, ప్రీతి ముకుందన్ మధ్య కనిపించే అందమైన కెమిస్ట్రీ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంచుతో కప్పబడిన పర్వతాలు, అద్భుతమైన ప్రకృతి దృశ్యాల నేపథ్యంలో తెరకెక్కించిన విజువల్స్ పాటకు ప్రేమ్ రొమాంటిక్ ఫీల్‌ను అందిస్తున్నాయి.ఈ పాటకు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా, కార్తీక్, రమ్య బెహరా తమ మధురమైన గాత్రాలతో ఆలపించారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. అద్భుతమైన మెలోడీ, హృదయాన్ని హత్తుకునే గానం, కనువిందు చేసే విజువల్స్ కలగలిసి 'ఏమో ఏమో ఇది' టైటిల్ సాంగ్‌ను ఈ సీజన్‌లోని సరికొత్త లవ్ ఆంథమ్‌గా నిలిపాయి. ఈ చిత్రానికి డా. శైలేష్ కొలను రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ ఎస్, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'మయూఖ' ట్రైలర్ లాంచ్



పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'మయూఖ'. ఈ చిత్రాన్ని ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై శశిధర్ నల్ల నిర్మిస్తున్నారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'మయూఖ' సినిమా అక్టోబర్ 9న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ శశిధర్ నల్ల మాట్లాడుతూ 'మయూఖ' సినిమా అద్భుతంగా వచ్చింది. ట్రైలర్ లాగే సినిమా కూడా మీ అందరినీ ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. ఈ సినిమా తర్వాత మా హీరోయిన్ పాయల్ ను అందరూ మయూఖ అని పిలుస్తారు. అంత బాగా పర్ ఫార్మ్ చేసింది. ఈ సినిమా కోసం పాయల్ చాలా హార్డ్ వర్క్ చేసింది. మా సినిమాకు ఎ టు జెడ్ అన్నీ తానై చూసుకున్నాడు మా డైరెక్టర్ శ్రీ తేజ్. కంటెంట్ బాగుంటే మన తెలుగు ఆడియెన్స్ తప్పకుండా ఆదరిస్తారు. అలాంటి కంటెంట్ మా సినిమాలో ఉంది. అదే నమ్మకంతో మా చిత్రాన్ని అక్టోబర్ 9న దసరా సెలవుల్లో వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నాం. మీరంతా ఆదరిస్తారని నమ్ముతున్నాం అన్నారు.హీరోయిన్ పాయల్ చెంగప్ప మాట్లాడుతూ 'మయూఖ' ఫీమేల్ ఒరియెంటెడ్ థ్రిల్లర్ మూవీ. ఇప్పుడు సినిమాల పరిస్థితి ఎలా ఉందో మనం చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఫీమేల్ ఒరియెంటెడ్ మూవీ చేయాలంటే ధైర్యం ఉండాలి. అలాంటి గట్స్ తో మా ప్రొడ్యూసర్ శశిధర్ ఈ సినిమా ప్రొడ్యూస్ చేశారు. డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. కథ వింటున్నంత సేపూ థ్రిల్ ఫీల్ కలిగింది. కొన్ని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు ఆ అమ్మాయి ఎలా రియాక్ట్ అవుతుంది అనేది గూస్ బంప్స్ తెప్పించింది. అన్నారు. డైరెక్టర్ శ్రీ తేజ్ ఎస్ . కె. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మద్రాస్ కరువు నేపథ్యంలో 'రణబాలి'



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదిన సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.'రణబాలి' నెవర్ ఫర్ గెట్ ది బ్రూటల్ పేరుతో రూపొందించిన 4 ఎపిసోడ్స్ డాక్యుమెంటరీ సిరీస్‌లో ఫస్ట్ ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్ గాట్' ఈ రోజు స్ట్రీమింగ్ కు వచ్చేసింది. ఈ ఎపిసోడ్‌లో 1876– 78 మధ్య కాలంలో బ్రిటీషర్స్ సృష్టించిన కరువు కోటి మంది భారతీయుల ప్రాణాలు తీసుకున్న విషాద ఘటనను వెల్లడించారు. భారతీయులు ఆకలితో చనిపోతుంటే, బ్రిటీషర్లు తమ దేశానికి టన్నుల కొద్దీ ధాన్యం ఎలా తరలించారో చూపించారు. 150 ఏళ్ల ఈ చరిత్రను రీసెర్చ్ చేసి ఈ సినిమాగా రూపొందించారు. ఈ భారీ ప్రయత్నాన్ని హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రశ్మిక, డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ తెలిపారు. డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ మాట్లాడుతూ- మేము బ్రిటీషర్స్, వారి సామ్రాజ్య చరిత్ర గురించి వందలాది చిత్రాలు చూశాం. ఎక్కడా కరువు గురించి వాళ్లు పేర్కొనలేదు. హిస్టరీలో 1976–78 మధ్య కాలంలో ది గ్రేట్ మద్రాస్ కరువు ఏర్పడింది అని ఉంది. ఈ రెండేళ్ల కాలంలో కరువు కారణంగా కోటి మంది భారతీయులు చనిపోయారు. ఆ కాలంలో భారతీయుల మొత్తం జనాభా 2530 కోట్లుగా ఉండేది. వారిలో కోటి మంది చనిపోవడం అంటే ఎంత విషాదమో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటన గురించి తెలుసుకునేందుకు లోతైన పరిశోధన చేశాం. కలెక్టర్ ఆఫీస్ లకు, లైబ్రరీలకు, పాత లైబ్రరీలకు వెళ్లి ఎన్నో పుస్తకాలు, గెజిట్ లను పరిశీలించాం అన్నారు. హీరోయిన్ రశ్మిక మందన్న, హీరో విజయ్ దేవరకొండ మాట్లాడారు.

## 'అనకాపల్లి' పెద్ద హిట్ అవ్వాలి

'ప్రీ రిలీజ్' ఈవెంట్‌లో డైరెక్టర్ వినాయక్



భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నటిస్తూ, నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం 'అనకాపల్లి'. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి త్రినాథరావు నక్కిన కథ, స్క్రీన్ ప్లేని అందించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.వి. వినాయక్ మాట్లాడుతూ 'లగడపాటి శ్రీధర్‌కు మా అందరికంటే సినిమా పిచ్చి ఎక్కువగా ఉంటుంది. ఆయనకి సినిమా పట్ల ఉన్న ప్యాషన్ గురించి నాకు తెలుసు. విక్రమ్ పెద్ద హీరో అయి శ్రీధర్ కోరికని నెరవేర్చుతాడు. తారక్ పొన్నప్ప అందరినీ భయపెట్టేస్తున్నాడు. దర్శక, నిర్మాతలకు మంచి లాభాలు రావాలి. 'అనకాపల్లి' చిత్రం పెద్ద హిట్ అవ్వాలి అని అన్నారు. ఆర్పి పట్నాయక్ మాట్లాడుతూ 'త్రినాథరావు ఆలోచనకు రూపమే 'అనకాపల్లి'. ఈ మూవీని ఆల్రెడీ నేను చూశాను. త్రినాథ రావు రూపం లో ఇండస్ట్రీలోకి మరో గొప్ప ఆర్టిస్ట్ దొరికారన్నారు. ఇంద్రజ మాట్లాడారు. నిర్మాత కాండ్రేగుల నాయుడు , ఆదిత్య మ్యూజిక్ నిరంజన్ , తదితరులు పాల్గొన్నారు.

## 'సమ్మక్క–సారలమ్మ'కు 'ది ప్యారడైజ్' టీమ్ పూజలు

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ది ప్యారడైజ్ టీమ్ మంగళవారం సమ్మక్క–సారలమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత చెరుకూరి సుధాకర్, నటుడు సంపూర్ణేష్ బాబు తదితరులు ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సినిమా మరింత పెద్ద హిట్ కావాలని, జీవితంలో మరిన్ని మంచి సినిమాలు చేసే అవకాశం కల్పించాలని సమ్మక్క సారలమ్మను మొక్కుకున్నట్టు సినిమా టీమ్ తెలిపింది.



## రణ్‌బీర్ కపూర్.. బర్త్‌డే స్పెషల్ గ్లింప్స్

రణ్‌బీర్ కపూర్ పుట్టినరోజు సందర్భంగా 'రామాయణ' మేకర్స్ స్పెషల్ బిహైండ్ ది సీన్స్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ కనిపించడంతో పాటు.. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక పాత్ర కోసం ఆయన చేసిన ప్రిపరేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను చూపించారు.శ్రీరాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ కూడా ఈ పాత్ర గురించి తన అనుభవాలను పంచుకున్నారు. ఈ పాత్రను తాను మరో సినిమా లేదా మరో క్యారెక్టర్‌లా చూడలేదని.. శ్రీరాముడి పాత్రకు న్యాయం చేయడం ఒక బాధ్యతగా భావించానని రణ్‌బీర్ తెలిపారు.ఈ గ్లింప్స్‌లో రణ్‌బీర్ సహనటులు కూడా ఆయన గురించి మాట్లాడారు. దశరథుడిగా నటిస్తున్న అరుణ్ గోవిల్, సీత పాత్రలో సాయి పల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే.. శ్రీరాముడి పాత్రకు రణ్‌బీర్ ఎందుకు సరిపోయారో వివరించారు. నటీనటుల లుక్స్, ట్రాన్స్‌ఫర్మేషన్స్‌తో పాటు కీలక సన్నివేశాల చిత్రీకరణను కూడా ఈ వీడియోలో చూపించారు. 'రామాయణం'ను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇండియా మినహా ప్రపంచవ్యాప్తంగా సోనీ పిక్చర్స్ ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తుండగా.. హిందీ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరిస్తోంది. 'రామాయణ' పార్ట్ 1 దీపావళి 2026లో, పార్ట్ 2 దీపావళి 2027లో విడుదల కానుంది. భారత్‌లో హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మించారు.



## ఆర్‌టిసి కార్మికుల భవిష్యత్తుకు 'ఇయు గెలుపు' కీలకం

**కాంగ్రెస్ కుతంత్రాలను కార్మికులు ఓడించాలి: కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఆర్‌టిసిలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) గెలుపు కీలకమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అక్టోబర్ 9న జరగనున్న ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బస్సు గుర్తుపై ఓటు వేసి ఇయును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప్పల్‌లోని బండి గార్డెన్స్‌లో హైదరాబాద్ రీజియన్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'నారీ భేరి' సభకు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల హక్కుల కోసం గతంలో ఇయు అనేక పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే ప్రస్తుతం యూనియన్ ఎన్నికలు జరుగుతున్నాయని అన్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న కార్మికుల చిరకాల డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఒక యూనియన్‌కు ప్రభుత్వం మద్దతు ఇస్తోందని, కార్మికులు దీనిని గుర్తించి ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. గతంలో కార్మిక వర్గాన్ని అణిచివేయాలని చూసిన బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కార్మికులు ఓడించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో నడిస్తే తగిన గుణపాఠం చెబుతారని సాంబశివరావు హెచ్చరించారు. సింగరేణి, ఆర్‌టిసి వంటి సంస్థల్లో కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ఎర్రజెండా అండతో కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా ఉన్న ఐఎన్‌టియుసిని పక్కనపెట్టి ఆర్‌టిసి ఎన్నికల్లో మరో వర్గానికి మద్దతు ఇవ్వడం సరికాదని విమర్శించారు. ఆర్‌టిసి కార్మికులు చైతన్యంతో వ్యవహరించి ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించాలని కోరారు. సభకు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు అధ్యక్షత వహించగా, ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. ప్రేమ్ పావని, జోనల్ సెక్రటరీ జె.ఎస్.రెడ్డి, అధ్యక్షుడు సత్యనారాయణ, యూనియన్ నాయకులు డి. గోపాల్, ఎం.డి. అంజద్ అలీ, ఎం.మంగ, సుకన్య, జ్యోతి తదితరులతో పాటు వందలాది మంది ఆర్‌టిసి మహిళా కార్మికులు పాల్గొన్నారు.




## మార్పు కోసం ఉద్యమం

(మూడవ పేజీ తరువాయి)



ఒకప్పుడు ఎఐఎస్ఎఫ్ నాయకులేనని గుర్తు చేశారు. ఒకప్పుడు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలకే ఓటు హక్కు అని నినదించి సాధిస్తే నేడు ఉన్న ఓట్లను తొలగిస్తున్నారని, అలా దేశ వ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని విమర్శించారు. విద్యారంగం సమస్యలతో పాటు ఏఐఎస్ఎఫ్ సామాజిక సమస్యలపై కూడా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నేడు సోషల్ మీడియా ప్రభావం కొనసాగుతున్నదని,దానిని ఉపయోగించుకున ఏఐఎస్ఎఫ్ నాయకులు మరింత చురుగ్గా పనిచేయాలన్నారు.

**90 ఏండ్ల గొప్ప చరిత్ర ఏఐఎస్ఎఫ్‌దే**
**మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**

బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 90 ఏండ్ల గొప్ప చరిత్ర ఏఐఎస్ఎఫ్ దేనని, ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడిందని చెప్పారు. నేడు కుల సంఘాల ప్రభావం పెరిగి పోతుండడం బాధాకరమని, అయినా వారి సమస్యలపై కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు దృష్టి సారించాలని సూచించారు. నేడు ఉన్నంత సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే నాలుగు దశాబ్దాల క్రితం తాము జెన్ జీ తరహాలో పోరాటాలు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. తాము విద్యార్థి దశలో ఎన్నో ప్రతిబంధకాలు ఎదుర్కొన్నా మని, నాటి పరిస్థితి నేడు లేదని చెప్పారు. అక్కడ సమస్య ఉంటే అక్కడ స్పందించాల్సిన బాధ్యత వామపక్ష విద్యార్థి సంఘాలదేనని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వరంగల్ లో ఏఐఎస్ఎఫ్ పెద్ద ర్యాలీ నిర్వహించడం ముందెన్నడూ చూడలేదని,కాకతీయ సామ్రాజ్య వారసులుగా వరంగల్ నుండే ఏఐఎస్ఎఫ్ గొప్ప ప్రస్తానం ప్రారంభించాలని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో అన్ని వర్గాల ప్రజల హక్కుల హననం జరుగుతున్నదని, రాబోవు రోజులు మరింత ప్రమాదకరంగా మారవచ్చునని, అంతకుముందే విద్యార్థి లోకం మేల్కొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చల్లా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం తాము చేసిన ఏఐఎస్ఎఫ్ పోరాటాల అనుభవాలు తనకు గొప్ప స్ఫూర్తిని కలిగించాయని చెప్పారు.

**ఘనంగా ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకులకు సన్మానం**

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పూర్వ నాయకులకు 90వ వార్షికోత్సవాల సందర్భంగా ఘనంగా సన్మానించారు. జాతీయ, రాష్ట్ర, వివిధ జిల్లాల నాయకులను శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, బాగం హేమంత రావు, బాల నర్సింహా, సాబిర్ పాషా, బి. విజయ సారథి, కర్రె బిక్షపతి,నేదునూరి జ్యోతి,పంజాల శ్రీనివాస్, బివి. విజయలక్ష్మి, వి. మదన్, ఆంజనేయులు, సృజన్ కుమార్, మేడిపల్లి శోభన్ బాబు, పల్లె నర్సింహా, డాక్టర్ బి.రాజ్ సిద్దార్థ, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ సిరంగి రాజన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంట రెడ్డి, పుట్టా లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్,సిపిఐ సీనియర్ నాయకులు టి. వెంకట్ రాములు, పంజాల రమేష్, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, బి. అజయ్, ఎన్.రాజమౌళి, పాక రవిందర్, సురవరం కపిల్, బిఆర్ లెనిన్, తోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది సహకారం? (మూడవ పేజీ తరువాయి)

పెట్టినట్లు తెలుస్తోంది. చోరీ చేసిన ఆయుధాలను స్కూటర్‌పై రెండు దఫాలుగా బయటకు తరలించినట్లు మల్లేష్ చెప్పినప్పటికీ, ఇంత భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఒంటరిగా తరలించడం సాధ్యమైందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, చోరీ చేసిన 9 ఎంఎం పిస్టల్, మ్యాగజైన్‌లోని పది బుల్లెట్లను మల్లేష్ జవహర్‌నగర్ సమీపంలోని తన అద్దె ఇంట్లో ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన ఆయుధాలను నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని తన తండ్రి ఇంటి ప్రాంగణంలో గుంతలో పాతిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. అతని అరెస్టు అనంతరం మొత్తం ఆయుధ సంపదను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్లేష్‌ను సెప్టెంబర్ 22న చంచల్‌గూడ జైలు నుంచి మల్కాజిగిరి పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. పది రోజుల పోలీసు కస్టడీ అక్టోబర్ 1తో ముగియనుంది. కస్టడీ ముగిసేలోపు మల్లేష్‌తో పాటు అనుమానిత ఆర్మీ సిబ్బందిని విచారించి, ఆయుధాల చోరీ వెనుక మరెవరైనా ఉన్నారా? అన్న అంశంపై స్పష్టతకు రావాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న తాజా సమాచారంలో వినోద్, శేషు ఇద్దరూ మల్లేష్‌కు సహకరించినట్లు తుది నిర్ధారణ లేదా అధికారిక అరెస్టు వివరాలు స్పష్టంగా వెల్లడికాలేదు. గతంలో ఆయుధాగారం, మందుగుండు సామగ్రి విభాగాల్లో పనిచేసే సిబ్బందిని పోలీసులు విచారించినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజా దర్యాప్తులో ప్రధానంగా మల్లేష్‌తో సంబంధం ఉన్న నలుగురు ఆర్మీ సిబ్బందిపై దృష్టి పెట్టినట్లు ఈరోజు వచ్చిన నివేదిక వెల్లడిస్తోంది. మల్లేష్ కస్టడీ గురువారంతో ముగియనున్న నేపథ్యంలో, అప్పటిలోగా ఇతరుల ప్రమేయంపై పోలీసులు ఆధారాలు సేకరిస్తారా? మరిన్ని అరెస్టులు జరుగుతాయా? అన్నది కీలకంగా మారింది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## ‘బికమింగ్ ది డివైన్ యూ’ పుస్తకావిష్కరణ




**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** బల్విందర్‌నాథ్ చాగన్ల రచించిన ‘బికమింగ్ ది డివైన్ యూ–అవేకెన్ ది పవర్ నితిన్ టూ ఫైండ్ ట్రూ హ్యాపినెస్’ పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా నరేన్ గ్రూప్ చైర్మన్ నరేంద్ర నాథ్ చాగన్ల , గౌరవ అతిథి, నటుడు మోటివేషనల్ స్పీకర్ కె.వి.ప్రదీప్ హాజర్రై, మాట్లాడారు. స్వీయ అవగాహన, ఆధ్యాత్మికత, భావోద్వేగాలు, సంబంధాలు, ధ్యానం, యోగా, నిజమైన ఆనందం వంటి అంశాలపై పుస్తకం రచించారు. కార్యక్రమంలో పద్మశ్రీ నటరాజ రామకృష్ణ, శిష్యుడు పేరిణి పవన్ కుమార్ బృందం, ప్రత్యేక పేరిణి శివతాండవ ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకొన్నది. అనంతరం పేరిణి పవన్ కుమార్, సంధ్యా పవన్‌ను సత్కరించారు.

## బిసి ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తు గడువు అక్టోబర్ 15 వరకు పొడిగింపు

బి. బాల మాయా దేవి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే బిసి, ఇబిసి విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బి. బాల మాయాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ 2026 ఫాల్ సెషన్‌కు సంబంధించి దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 30తో ముగియాల్సి ఉండగా, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరో 15 రోజులు పొడిగించినట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని మార్గాల ద్వారా కలిపి రూ.5 లక్షలలోపు ఉండాలని బాల మాయాదేవి తెలిపారు. దరఖాస్తు సమయంలో వయసు 35 సంవత్సరాలకు మించకూడదన్నారు. డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలని, జిఆర్‌ఇలో 260 లేదా జిమ్యాట్‌లో 500 మార్కులు పొందాలని పేర్కొన్నారు. అలాగే టొఫెల్‌లో 60, ఐఇఎల్‌టిఎస్‌లో 6.0 బ్యాండ్ లేదా పిటిఇలో 50 మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. అర్హతలు, ఇతర వివరాల కోసం తెలంగాణ ఇపాస్ అధికారిక వెబ్‌సైట్ telanganaepass.cgg.gov.inను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని బి. బాల మాయాదేవి సూచించారు.

## ప్రతిభ విద్యార్థులకు ‘ముత్తూట్’ అవార్డులు

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని, జీవితంలో సాధించాలనే తపన ఉంటే అవకాశాలు దానంతట అవే వస్తాయని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ చైర్మన్ ప్రొ. డాక్టర్ రియాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ కార్యాలయంలో సంస్థ సిఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా వరుసగా 17వ ఏడాది, ప్రభుత బడుల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ చూపుతున్న100 మంది పేద విద్యార్థులకు అవార్డుతోపాటు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. రియాజ్ మాట్లాడుతూ సంపదను సామాజిక సేవా కార్యక్రమాలకు ఉపయోగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిఎస్‌ఆర్ మేనేజర్ వై.లక్ష్మీ నారాయణ, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల జోనల్ హెడ్ బి.సంపత్, హైదరాబాద్ రీజినల్ మేనేజర్–1ఎం.పూర్ణచంద్ర గుప్త, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు వైస్‌చైర్మన్ పి.సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అహంకారం..అక్రమ దందాలతోనే బిఆర్‌ఎస్‌ను పాతాళంలో నెట్టారు



కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘‘అహంకారం.. అక్రమ దందాలతో బిఆర్‌ఎస్‌ను పాతాళంలోనికి నెట్టింది ‘మీరు’(బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్) అని తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సంపాదించుకున్న ఫామ్‌హౌస్‌లు, అక్ర మంగా ఇచ్చిన పర్మిషన్లు,ఆంధ్రా దోస్తులకు ఇచ్చిన నజరానాలు,క్విడ్ ప్రో కో దందాలతో బిఆర్‌ఎస్‌ను పాతాళంలోకి నెట్టిన వాళ్లే, ఇప్పుడు ఆ పార్టీ అధినేతను తప్పుపడుతున్నారన్నారు. ఈ మేరకు ట్విట్టర్‌లో పోస్ట్ చేసినట్టు కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను బిఆర్‌ఎస్ లోని ఒక అవినీతి గుంటనక్కను విమర్శిస్తేనే కొన్ని గంటల్లోనే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, అదే గుంటనక్కతో అంటకాగుతూ పార్టీ అధినేత కెసిఆర్ తీరును బహిరంగంగా ప్రశ్నించడం పార్టీకి వ్యతిరేకం కాదా అని కెటిఆర్‌ను ప్రశ్నించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్టు పార్టీలో ఆయన(కెటిఆర్) వైఫల్యాన్ని, చేతగాని తనాన్ని బిఆర్‌ఎస్ అధినేతపై మోపుతున్నారంటే ప్రత్యక్ష రాజకీయాల్లో ఆయన స్థానం ఏమిటో అర్థమవుతుందా అని ప్రశ్నించారు.

## కొంగరఖుర్దు(ఎ)లో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ భూ మాఫియా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా కొంగరఖుర్దు (ఏ) గ్రామంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకులు కలిసి రూ.5 వేల కోట్ల విలువైన 580 ఎకరాల భూములను కొళ్లగొడుతున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్న అర్బన్ క్రెస్ట్, సిటీ గ్రాండ్ ఎన్ క్యూ వెంచర్స్‌లపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ రెండు సంస్థలు ఇకపై ఒక్క గజం భూమిలో వెంచర్‌ను విస్తరించినా వెంటనే రంగారెడ్డి కలెక్టర్ ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టుకు లాగుతానని హెచ్చరించారు . కొంగరఖుర్దు (ఏ) గ్రామానికి చెందిన భూబాధితులతో కలిసి కవిత మంగళవారం హైదరాబాద్‌లోని టిఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నిషేధిత జాబితాలో ఉన్న వక్ఫ్ భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేసి అక్కడ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను నిలిపివేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆర్గనైజ్డ్ గా భూ మాఫియా పెద్ద ఎత్తున భూ కబ్జాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కొంగరఖుర్దు గ్రామంలోని సర్వే నంబర్లు 2 నుంచి 400 వరకు ఉన్న భూముల్లో 580 ఎకరాలను వక్ఫ్ భూమిగా 2007లో నోటిఫై చేసి నిషేధిత జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. ఆ భూములను అప్పటికే పలువురు రైతులు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని,నిషేధిత జాబితాలో ఉన్న 580 ఎకరాల్లో ఇప్పటికే 150 ఎకరాలు భూ మాఫియా చెరలోకి వెళ్లిపోయిందని వివరించారు. కొంగరఖుర్దు గ్రామంతో సంబంధం లేని వారి పేర్లతో ఓఆర్సీలు సృష్టించి వాటితో కోర్టుల్లో కేసులు వేసి అనుకూలంగా జడ్జిమెంట్ లు తెచ్చుకుని, రిజిస్ట్రేషన్ లు చేయించుకుంటున్నారని కవిత ఆరోపించారు.

# ధరణి రికార్డుల తారుమారుతో భూములు కోల్పోయాం

- సర్వే చేసి హక్కులు పునరుద్ధరించాలి
- శివారు వెంకటాపూర్ రైతుల విజ్ఞప్తి
- రికార్డులు, గ్రామ నక్షా, క్షేత్రస్థాయి సర్వేతో వాస్తవాలు తేలుస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ భూ సమస్యపై సమగ్ర విచారణ జరిపించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్ అమలు తర్వాత రికార్డులు తారుమారై తమ తాతముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములపై హక్కులు కోల్పోయామని గ్రామ రైతులు చేసిన వినతిపై మంత్రి స్పందిస్తూ, రికార్డులు, గ్రామ నక్షాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితర రైతులు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నెంబర్లు 38, 41, 47, 85, 88, 100 పరిధిలో ఉన్న సుమారు 134 ఎకరాల వ్యవసాయ భూములను తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అయితే ధరణి పోర్టల్ అమలులో రికార్డులు మార్పులకు గురి కావడంతో తమ భూములపై హక్కులు కోల్పోయామని వారు మంత్రికి మొరపెట్టుకున్నారు. ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాత పట్టాదారు పాస్‌బుక్కులు, గ్రామ నక్షా ప్రతులను మంత్రికి చూపించిన రైతులు, కొత్త పాస్బుక్కులు ఇస్తామని చెప్పి అధికారులు పాత పాస్‌బుక్కులను తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు కొత్తవి ఇవ్వలేదని, దీంతో తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమ భూముల రికార్డులు పూర్తిగా మారిపోయాయని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవెల్లి సర్వే నెంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలో కూడా సమగ్ర సర్వే చేపట్టి గ్రామ సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని, పాత రికార్డులు, పాస్‌బుక్కులు, గ్రామ నక్షాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరి భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పాండురంగ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని, దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా రిజర్వాయర్‌లో విలీనం చేయడంతో గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల వినతిని శ్రద్ధగా విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీస్తామని తెలిపారు. రికార్డులు, గ్రామ నక్షాలు, క్షేత్రస్థాయి సర్వే ఆధారంగా అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ‘ఖటీక్ సమాజ్ ప్రగతి సమ్మేళన్ 0.2’ ఉచిత ‘ఈసేవ ’



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘తెలంగాణ ఖటీక్ సమాజ్ నగర కమిటీ, గోషామహల్ చక్నావాడీ అరే ఖటీక సూర్యవంశీ సంఘం’ సంయుక్త ఆధ్వర్యంలో ‘ఖటీక్ సమాజ్ ప్రగతి సమ్మేళన్ 0.2’ పేరుతో ప్రారంభించిన ఉచిత ‘ఈసేవ’ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. గోషామహల్ పరిధిలోని చందన్వాడీ ఏకె భవన్‌లో మంగళవారం ‘ఈసేవ’ శిబిరాన్ని ప్రారంభించారు. బుధవారం వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు నేతికార్ ప్రేమ్‌లాల్, నేతికార్ మోహన్‌లాల్, గోగికార్ నర్సింగ్ రావు, బిచ్చుకరిన్ సూర్య, అరే ఖటీక సూర్యవంశీ సంఘం గోషామహల్ కమిటీ అధ్యక్షుడు డి. గోపాల్, గోగికార్ రాజేశ్,కాంబ్లేకర్ సందీప్ కుమార్,జమాల్పూర్ సాయిబాబా, ఎ.గంగారాం,యు.నర్సింగ్ రావు, డి.కె. మనీష్, పంతులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో ఆధార్ సేవలు, మీసేవ, ఓటరు గుర్తింపు కార్డులు, పాన్ కార్డు, జిహెచ్‌ఎంసీ సేవలు, ఎల్‌ఐసీ, ఆరోగ్య అవగాహన, ఆయుష్మాన్ భారత్ (పీఎంజేఏవై), రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల మార్గదర్శకత్వం, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక అక్షరాస్యత, గృహ రుణాల సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపైన అవగాహన కల్పించనున్నట్టు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

## 2న ‘తిరంగా అహింస కారు ర్యాలీ’




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్ నుంచి 200కుపైగా కార్లతో వినూత్న ‘తిరంగా అహింస కారు ర్యాలీ’ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మనోజ్ కొఠారి, ధర్మేంద్ర నహర్ తెలిపారు. శ్రీ వర్ధమాన్ స్థానకవాసి జైన శ్రావక సంఘ్, గ్రేటర్ హైదరాబాద్ కాచిగూడ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి సిఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్ ఎఫ్‌టిసిసిఐలో ర్యాలీ సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి, వారు మాట్లాడారు. అహింస, శాంతి, సోదరభావం, మతసామరస్యం, జాతీయ సమైక్యత వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమన్నారు. 23 కిలోమీటర్ల మేర ర్యాలీ ఉంటుందన్నారు. వివరాలకు 9848042020ను సంప్రదించాలని సూచించారు.

# పండుగల రద్దీకి చెక్..

- హైటెక్ సిటీలో 10 రైళ్లకు తాత్కాలిక హాల్ట్
- నవంబర్ 1 నుంచి మూడు నెలలపాటు నిలుపుదల..
- సికింద్రాబాద్, లింగంపల్లి స్టేషన్లపై రద్దీ తగ్గించేలా..
- దక్షిణ మధ్య రైల్వే చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పండుగల సీజన్‌లో పెరిగే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. సికింద్రాబాద్, లింగంపల్లి రైల్వే స్టేషన్లపై అదనపు రద్దీని తగ్గించడంతో పాటు ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించేందుకు హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో 10 రైళ్లకు తాత్కాలికంగా హాల్ట్ సౌకర్యం కల్పించింది. ఈ రైళ్లకు నవంబర్ 1, 2026 నుంచి జనవరి 31, 2027 వరకు మూడు నెలలపాటు హైటెక్ సిటీలో తాత్కాలిక నిలుపుదల ఉంటుంది. హైటెక్ సిటీలో నిలిచే రైళ్లలో 22718 సికింద్రాబాద్–రాజ్‌కోట్, 22717 రాజ్‌కోట్–సికింద్రాబాద్, 20967 సికింద్రాబాద్–పోర్‌బందర్, 20968 పోర్‌బందర్–సికింద్రాబాద్, 12731 తిరుపతి–సికింద్రాబాద్, 12732 సికింద్రాబాద్–తిరుపతి, 12702 హైదరాబాద్–సీఎస్‌టీ ముంబై, 12701 సీఎస్‌టీ ముంబై–హైదరాబాద్, 12025 పుణే–హైదరాబాద్, 12026 హైదరాబాద్–పుణే రైళ్లు ఉన్నాయి.సికింద్రాబాద్–రాజ్‌కోట్ (22718), సికింద్రాబాద్–పోర్‌బందర్ (20967) రైళ్లు హైటెక్ సిటీలో మధ్యాహ్నం 3.30 గంటలకు చేరుకుని 3.31 గంటలకు బయలుదేరుతాయి. తిరుగు ప్రయాణంలో రాజ్‌కోట్–సికింద్రాబాద్ (22717), పోర్‌బందర్–సికింద్రాబాద్ (20968) రైళ్లు ఉదయం 6.19 గంటలకు చేరుకుని 6.20 గంటలకు బయలుదేరుతాయి. అలాగే తిరుపతి–సికింద్రాబాద్ (12731) రైలు ఉదయం 6.08–6.09 గంటలకు, సికింద్రాబాద్–తిరుపతి (12732) తెల్లవారుజామున 4.35–4.36 గంటలకు హైటెక్ సిటీలో ఆగనున్నాయి. హైదరాబాద్–సిఎస్‌టి ముంబై (12702) తెల్లవారుజామున 3.17–3.18 గంటలకు, సిఎస్‌టి ముంబై–హైదరాబాద్ (12701) ఉదయం 11.07–11.08 గంటలకు నిలుస్తాయి.ఇక పుణే–హైదరాబాద్ (12025) రైలు మధ్యాహ్నం 1.33–1.34 గంటలకు, హైదరాబాద్–పుణే (12026) మధ్యాహ్నం 3.00–3.01 గంటలకు హైటెక్ సిటీలో తాత్కాలికంగా ఆగుతుంది.

**బోర్డింగ్ పాయింట్ మార్చుకునే అవకాశం..**

ఇప్పటికే పై రైళ్లలో సికింద్రాబాద్ లేదా హైదరాబాద్ నుంచి ప్రయాణానికి రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు అవసరమైతే అదనపు చార్జీలు లేకుండా తమ బోర్డింగ్ పాయింట్‌ను హైటెక్ సిటీ స్టేషన్‌కు మార్చుకోవచ్చు. ఆన్‌లైన్‌లో లేదా రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా నిబంధనల ప్రకారం బోర్డింగ్ పాయింట్ మార్చుకునే అవకాశం ఉందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీని విభజించి, సికింద్రాబాద్, లింగంపల్లి స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించేందుకు ఈ తాత్కాలిక హాల్ట్ సదుపాయం ఉపయోగపడుతుందని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని తమ ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా, ఇబ్బందులు లేకుండా చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## జీవనశైలిలో మార్పులతో గుండెపై పెరుగుతున్న ముప్పు

డాక్టర్ శైలజా మూర్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మారుతున్న జీవనశైలిలో గుండె సంరక్షణ అనేది కేవలం చికిత్సకే పరిమితం కాకూడదని, నివారణే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగాలని తార్నాక ఆర్‌టిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి పిలుపునిచ్చారు. ‘వరల్ హార్ట్ డే’ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌టిసి ఆసుపత్రిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమకాలీన సమాజంలో మారుతున్న జీవన శైలి, విపరీతమైన ఒత్తిడి వల్ల పెరుగుతున్న గుండె సంబంధిత సమస్యలపై ప్రజలకు, రోగులకు సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజా మూర్తి మాట్లాడుతూ సమాజంలో గుండె ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతమైన జీవనవిధానం వైపు మళ్లించడమే ఈ అవగాహన కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. తమ ఆస్పత్రిలో అన్ని వర్గాల వారికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా యోగా చేయడం, నూనె, ఉప్పు పదార్థాలను తగ్గించి సమతులాహారం తీసుకోవడం, పొగతాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండెను సురక్షితంగా ఉంచుకోవచ్చని, 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ అడ్మిన్ డాక్టర్ శ్రీనివాస్, కార్డియాలజిస్టులు డాక్టర్ రేణుక, డాక్టర్ రామ్మోహన్, పలువురు వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకులను సురక్షితంగా స్వదేశానికి రప్పించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉపాధి కోసం రష్యా వెళ్లి ఏజెంట్ల చేతిలో మోసపోయి ప్రస్తుతం యుద్ధంలో చిక్కుకున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నలుగురు తెలంగాణ వాసులను సురక్షితంగా భారతదేశానికి రప్పించాలని వారి కుటుంబ సభ్యులు ‘సిఎం ప్రజావాణి’ రాష్ట్ర ఇన్‌చార్జ్,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ‘సిఎం ప్రజావాణి’లో బాధితులు వినతిపత్రం అందజేశారు. ఉపాధి నిమ్మితం భుక్యా రవీందర్, సిర్పు అశోక్, మెగావత్ ప్రకాష్, మహమ్మద్ అఫ్జల్ ఖాన్ సుమారు ఏడు నెలల క్రితం రష్యాకు వెళ్లారని, ఆయిల్ కంపెనీలో మంచి వేతనంతో ఉద్యోగం ఇప్పిస్తామని ఏజెంట్లు మోసం చేసి, వారిని రష్యా సైన్యంలో చేరేలా చేశారని కుటుంబ సభ్యులు వివరించారు. దీనిపై విజయలక్ష్మి స్పందిస్తూ అవసరమైన దౌత్య సహాయం అందించి, వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు చేపట్టాలని జిఏడ్ ఎన్‌ఆర్‌ఐ అధికారులకు సూచించారు. ఈ విషయమై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు మాస్కోలోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. సిఎం ప్రజావాణి కార్యక్రమంలో సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి కె. విద్యాసాగర్, ప్రభుత్వ ఎన్‌ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జెన్‌కోకు రోజుకు 75,500 టన్నుల బొగ్గు..
# సింగరేణి ప్రత్యేక కార్యాచరణ

- విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి– జెన్‌కో సమన్వయ సమావేశం
- రైలు మార్గంలో 56 వేల టన్నులు.. రోడ్డు ద్వారా 19,500 టన్నుల సరఫరా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సింగరేణి కీలక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75,500 టన్నుల బొగ్గు సరఫరా చేసే లక్ష్యంతో సింగరేణి, తెలంగాణ జెన్‌కో సిఎండిలు ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. రైల్వే రేకుల లభ్యత, రవాణా, లోడింగ్–అన్‌లోడింగ్, బొగ్గు నాణ్యత, ప్లాంట్ల వారీ అవసరాలపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సిఎండి డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం జరిగింది. సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, జెన్‌కో విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, ఇరు సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోజువారీ లక్ష్యంలో భాగంగా రైలు మార్గంలో 14 రేకుల ద్వారా 56 వేల టన్నులు, రోడ్డు మార్గంలో 19,500 టన్నుల బొగ్గును సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్లాంట్ల వారీగా చూస్తే కొత్తగూడెం విద్యుత్ కేంద్రానికి రోజుకు 24 వేల టన్నులు, కాకతీయకు 4,500 టన్నులు, భద్రాద్రికి 15 వేల టన్నులు, యాదాద్రికి 34 వేల టన్నుల బొగ్గు అవసరంపై అధికారులు సమీక్షించారు.

**యాదాద్రికి ప్రత్యేక సరఫరా ప్రణాళిక..**

యాదాద్రి విద్యుత్ కేంద్రానికి బొగ్గు సరఫరా కోసం ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి రెండు రేకుల ద్వారా రోజుకు 8 వేల టన్నులు, స్థానిక సింగరేణి గనుల నుంచి ఆరు రేకుల ద్వారా 36 వేల టన్నులు రవాణా చేసే అంశంపై కార్యాచరణ రూపొందించారు. నైనీ బ్లాక్ నుంచి సరఫరాను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు తెలిపారు.

ఈ నెల 28వ తేదీ నాటికి జెన్‌కో విద్యుత్ కేంద్రాలకు రోడ్డు, రైలు మార్గాల ద్వారా కలిపి 15.02 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేసినట్లు సింగరేణి మార్కెటింగ్ అధికారులు వెల్లడించారు. గత ఏడాది సెప్టెంబర్ ఇదే కాలంలో 11.44 లక్షల టన్నులు మాత్రమే సరఫరా కాగా, ఈసారి 3.58 లక్షల టన్నులు అధికంగా, అంటే సుమారు 31 శాతం పెరుగుదల నమోదైందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ పెరిగిందని, ఉత్పత్తికి అనుగుణంగా మరింత బొగ్గు అవసరం అవుతోందని జెన్‌కో అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బొగ్గు సరఫరా, రవాణా, స్వీకరణలో ఎదురయ్యే సమస్యలను సింగరేణి ఏరియా జిఎంలు, విద్యుత్ కేంద్రాల సిఇలు పరస్పర సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు.

సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ , కె. వెంకటేశ్వర్లు , జిఎం టి. శ్రీనివాస్, జెన్‌కో విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

## 18 నెలలుగా జీతాల్లేవు..
# పోలీస్ స్టేషన్ల స్వీపర్ల ఆవేదన



-సిఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు సచివాలయానికి తరలివచ్చిన కార్మికులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న స్వీపర్లు తమకు 18 నెలలుగా జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.5,200 చొప్పున వేతనం చెల్లిస్తామని చెప్పినా నెలల తరబడి బకాయిలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తమ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు మంగళవారం సచివాలయానికి చేరుకున్నారు. రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో చాలాకాలంగా స్వీపర్లుగా పనిచేస్తున్నామని, పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుధ్య పనులు నిర్వర్తిస్తున్నామని వారు తెలిపారు. తమ శ్రమకు ప్రతిఫలంగా రావాల్సిన వేతనాలు సకాలంలో అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నెలలుగా ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని పలువురు స్వీపర్లు తెలిపారు. రోజువారీ అవసరాలు, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. తమ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇక నేరుగా ముఖ్యమంత్రిని కలిసి తమ గోడు వినిపించాలని నిర్ణయించుకుని సచివాలయానికి వచ్చామని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు రావాల్సిన 18 నెలల బకాయి వేతనాలను చెల్లించడంతో పాటు భవిష్యత్తులో ప్రతి నెలా జీతాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న తమను కూడా కార్మికులుగా గుర్తించి తగిన భద్రత, వేతన చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టమైన విధానం రూపొందించాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
30-09-2026
www.prajapaksham.in
జనరల్
STATE & REGIONAL NEWS



## యుద్ధప్రాతిపదికన 100 పడకల ఆసుపత్రి పనులు

### కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సమీక్ష

**ప్రజాపక్షం/కోదాడ** : కోదాడలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం కోదాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో హాస్పటల్ అభివృద్ధి కమిటి సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతి, వైద్యులు సిబ్బంది నియామకాలు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకాల కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నియోజక వర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో తాను, మంత్రి కలిసి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆసుప్రతి నిర్మాణానికి రూ.26 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. కోదాడను భవిష్యత్‌లో మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 100 పడకల ఆసుపత్రిని ఎన్.ఎ.బి.హెచ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలని, ఆసుపత్రి నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. సమావేశానికి ముందుగా గుండెపోటుతో మరణించిన రేడియోగ్రాఫర్ కరుణాకర్ మృతిపట్ల మౌనం పాటించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమబాబు, డిసిహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథ, ఆర్‌డిఓ సూర్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ రమాదేవి, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన పిఆర్‌సి కోసం కృషి చేస్తా

### ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చిట్యాల:** మెరుగైన పిఆర్‌సి సాధించేందుకు తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణం, మండలంలోని వనిపాకల గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి పిఆర్‌టియు కట్టుబడి ఉందని, వారి హక్కుల పరిరక్షణకు, పరిష్కారానికి సంఘం ఎల్లవేలలా ముందంజలో ఉంటుందన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలపై భావ సారైప్యత కలిగిన సంఘాలతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. దేశ పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడి పిల్లల భాగస్వామ్యం ఎంతో కీలకమని శ్రీపాల్‌రెడ్డి అన్నారు. వనిపాకల జడ్‌పిహెచ్‌ఎస్ కు చెందిన గంపల రవిందర్‌రెడ్డి పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను పాఠశాల ఆవరణలో ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం నారాయణరెడ్డి, మేకల జాన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కంచరగుంట్ల సుధాకర్‌రెడ్డి, ఎలకరాజు ఆంజనేయులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయండి

### గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు రేగట్టి లింగయ్య, కొండ కోటయ్య డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : లైసెన్సులు, రెన్యూవల్స్‌తో సంబంధం లేకుండా గీత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు రేగట్టి లింగయ్య, కొండ కోటయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరిండెంట్ చెరుకుపల్లి పెద్దులుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల అందజేస్తామంటున్న చేయూత పెన్షన్లలో భాగంగా గీత కార్మికులకు లైసెన్స్ రెన్యువల్‌తో సంబంధం లేకుండా పెన్షన్లు అందజేయాలన్నారు. టిసిఎస్, టిఎఫ్‌సిలు 51 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు లైసెన్స్ రెన్యువల్ అయితే ఇస్తామని అధికారులు అనటం అవగాహన లేనితనమని మండిపడ్డారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల గీత కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని లైసెన్సుల రెన్యువల్ చేయించుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సాకుగా చూపించి పెన్షన్లు మంజూరు చేయకపోతే గీత పనివారల సంఘం జిల్లా కమిటి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాలకూరి బాబు, బూర వెంకటేశ్వర్లు, ఎల్గూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్టు నాణ్యత పరిశీలన.. ప్రతిపాదనలపై ఆరా

**ప్రజాపక్షం/నందికొండ** : నాగార్జునసాగర్ ప్రాజెక్టును మంగళవారం ప్రాజెక్ట్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు చీఫ్ ఇంజనీర్ రవీందర్,ఎస్‌ఈ అక్బర్ ఖాన్ సందర్శించారు.ఈ సందర్భంగా వారు ఐకాడ్ (ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్) శాఖకు సంబంధించిన నీటిపారుదల వ్యవస్థ, ప్రాజెక్టు నిర్వహణ, కాలువలు,ఆయకట్టు అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి డ్యామ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత,డ్యామ్ నిర్వహణ,భద్రతకు సంబంధించిన అంశాలతో పాటు ప్రస్తుతం చేపడుతున్న పనులు,భవిష్యత్‌లో చేపట్టాల్సిన అవసరమైన పనులపై వివరాలు తెలుసుకున్నారు.డ్యామ్ పరిధిలోని వివిధ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, ప్రాజెక్టు నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిసింది. డ్యామ్‌కు సంబంధించి మరమ్మతులు, నిర్వహణ, భద్రత లేదా ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఏవైనా ఉంటే వాటిని సిద్ధం చేసి తమకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.వారి వెంట సాగర్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్లికార్జున రావు ఉన్నారు.



### ఆర్‌టిసి గుర్తింపు సంఘ ఎన్నికల్లో

# బస్సు గుర్తుకే ఓటు వేయాలి

### నల్లగొండ రీజనల్ కమిటీ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు



**ప్రజాపక్షం/నల్లగొండ:** టీజీఎస్‌ఆర్‌టిసిలో గుర్తింపు సంఘ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి కార్మికుడు అప్రమత్తంగా వ్యవహరించాలని టీజీఎస్‌ఆర్‌టిసిఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు పిలుపునిచ్చారు.ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ రీజనల్ కమిటీ సమావేశం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాండురంగయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పాటి అప్పారావు మాట్లాడుతూ 2026 అక్టోబర్ 9న రాష్ట్ర గుర్తింపు సంఘం కోసం ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు,నల్లగొండ రీజన్‌లో స్థానిక గుర్తింపు కోసం తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు కేటాయించిన నిచ్చెన గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఆర్‌టిసి గుర్తింపు సంఘ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసినట్లు అప్పారావు తెలిపారు.ఆర్‌టిసి ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే అంశంతో పాటు కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. టికెట్ తీసుకునే బాధ్యతను పూర్తిగా ప్రయాణికుడిదిగా చేసే విధానాన్ని తీసుకురావడం ద్వారా ఉద్యోగులపై ఉన్న ఒత్తిడిని తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మూడు రోజుల సమ్మె సందర్భంగా అంగీకరించిన 32 డిమాండ్లను అమలు చేయించేందుకు ఈడీల కమిటీపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల సందర్భంగా కొందరు నాయకులు అక్రమ పద్ధతులకు పాల్పడుతున్నారని పాటి అప్పారావు ఆరోపించారు. యూనియన్ గుర్తులను మార్చే ప్రయత్నాలు చేస్తూ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీని తప్పుదారి పట్టించడంతో పాటు కార్మికుల్లో అయోమయం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అశ్వద్ధామరెడ్డిపై కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ గుర్తును మార్చి కార్మికులను అయోమయానికి గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అప్పారావు ఆరోపించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ రీజన్‌లో ఎంప్లాయిస్ యూనియన్‌కు అత్యధిక మద్దతు ఉందని తెలిపారు. రాష్ట్ర గుర్తింపు సంఘంగా బస్సు గుర్తుకు,స్థానిక గుర్తింపు కోసం నిచ్చెన గుర్తుకు అత్యధిక ఓట్లు సాధించేలా ప్రతి డిపోలో సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బాసాని వెంకటయ్య, పాండురంగయ్య,ఎన్‌ఆర్‌సి రాజు,నందం,ఎ.ఎల్.స్వామి, వివిఎస్.రెడ్డి, జంగయ్య,హరి, వెంకన్న, సోమేష్,మహేందర్, సోమయ్య,ఎస్.కె.పర్వేజ్, ఎన్.సి.సైదులు, వి.జె.రెడ్డి పాల్గొన్నారు.

# 'ఎఐ' ద్వారా మెరుగైన బోధన సాధ్యం

### మాజీ ఎన్నికల కమిషనర్ పార్థసారథి



**ప్రజాపక్షం/నల్లగొండ** : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నవీకరించిన జ్ఞానాన్ని అందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) బాగా ఉపయోగపడుతుందని విశ్రాంత ఐఎఎస్ అధికారి,మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి. పార్థసారథి అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్ లో ఎంఈఓలు,స్కూల్ అసిస్టెంట్లు, ఎంఆర్‌పిలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మెరుగైన బోధన పై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కాలానుగుణంగా సాంకేతికత పెరుగుతోందని,బోధించే విధానంలోనూ మార్పులు వస్తున్నాయని, ముఖ్యంగా ఏఐ వచ్చిన తర్వాత బోధనలో ఉపాధ్యాయుల పాత్రపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.ఏఐ చాలా శక్తివంతమైన ఆయుధమని, దీన్ని ఎంత బాగా సద్వినియోగం చేసుకుంటే అంత ఫలితం ఉంటుందని,ఇది మంచి సహాయకుడిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి రంగంలో ప్రతి ఒక్కరూ ఏఐపై ఆధారపడుతున్నారని,ఏఐతో విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు పాఠశాలలకు సంబంధించిన సమాచారం, నివేదికలను వేగంగా రూపొందించవచ్చన్నారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా మారాల్సిన అవసరం ఉందని, ప్రతిరోజు బోధనతో పాటు రిపోర్టులు, ఎఫ్‌ఆర్‌ఎస్,అటెండెన్స్, మిడ్ డే మీల్స్, ఫిజిక్స్ వాలా తదితర రిపోర్టుల తయారీకి ఏఐని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనిని ఏఐ ద్వారా చేయవచ్చని,ఏఐ టూల్స్‌ను వినియోగించుకొని రోజువారీ కార్యక్రమాలను సులభంగా నిర్వహించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, ఎస్సీఈఆర్టీ రిసోర్స్ పర్సన్ లక్ష్మీనాథం పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా లభించిన న్యాయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తమ స్వంత ఇంట్లోనే నివసించే హక్కును కోల్పోయి అన్యాయానికి గురైన వృద్ధ తల్లిదండ్రులకు సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం పూర్తి స్థాయి న్యాయం చేకూరింది. మంగళవారం రెవెన్యూ, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల బృందం బాధితులైన వృద్ధ దంపతులను వారి స్వగృహంలోకి సురక్షితంగా ప్రవేశపెట్టి ఆశ్రయం కల్పించింది. వివరాల్లోకి వెళితే మిర్యాలగూడ పట్టణంలోని చైతన్య నగర్ రోడ్ నంబర్ 7 నందు నివసిస్తున్న 65 సంవత్సరాల వయోవృద్ధులు, రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ సింగం అంజయ్య, యాదమ్మ దంపతులకు పెద్దదేవులపల్లి త్రిపురారం మండలంలో వ్యవసాయ భూమితో పాటు మిర్యాలగూడ పట్టణంలో స్వంత ఇల్లు ఉంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, అందరికీ విద్యాభ్యాసం చేయించి వివాహ బాధ్యతలను నిర్వర్తించారు. ఒక కుమారుడు గతంలో మరణించారు. దాదాపు 12 ఏళ్లుగా తాము నివసిస్తున్న ఇంటిని కుమారుడి పేరిట పట్టా చేయడంతో, సదరు కుమారుడు తల్లిదండ్రులను ఇంట్లోకి రానివ్వకుండా వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. భౌతికంగా ఇబ్బందులు పెడుతూ, కొడుతూ, తిడుతూ నిరుపయోగంగా ఉన్న ఖాళీ ఇంట్లోకి కూడా వారిని రానివ్వకపోవడంతో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధ దంపతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.సదరు వృద్ధ దంపతులు గత నెలలో జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌ను కలిసి తమకు బ్రతికున్నంత కాలం ఆ ఇంట్లోనే నివసించేలా ఆశ్రయం కల్పించాలని, సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రకారం న్యాయం చేయాలని వేడుకున్నారు. బాధితుల ఆవేదనను ఆలకించిన జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కే. రమణారెడ్డిని ఆదేశించారు. ఆర్డీవో రమణారెడ్డి నిర్వహించిన విచారణలో కుమారుడు తల్లిదండ్రులను ఇంట్లోకి రానివ్వకుండా వేధిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో, తల్లిదండ్రులు బ్రతికున్నంత కాలం ఆ ఇంట్లో నివసించడానికి కేవలం ఆశ్రయం పొందే హక్కును కల్పిస్తూ ఆర్‌టీఓ ట్రిబ్యునల్ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆర్డర్‌ను అమలుపరిచేందుకు రెవెన్యూ, పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు ఉమ్మడిగా రంగంలోకి దిగారు. స్థానిక సీఐ నాగభూషణం, సీడీపీఓ వేణు, అధికారులు ప్రత్యేకంగా చైతన్య నగర్‌లోని సదరు ఇంటి వద్దకు చేరుకుని వృద్ధ దంపతులను సగౌరవంగా ఇంట్లోకి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజు, రాజశేఖరరెడ్డి, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ నుండి రాజు, నాగిరెడ్డి, నవీన్, సునీల్, అంగన్వాడీ టీచర్ గాయత్రి పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి

### మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం
### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని గోంగూరిగూడెం,బీరెల్లిగూడెం గ్రామపంచాయతీలకు మంజూరైన నూతన మహిళా శక్తి భవనాలను మంగళవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. గ్రామాలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చేరుకోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు.మహిళల ఆర్థిక,సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే గ్రామాల్లో మహిళా శక్తి భవనాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ భవనాలను మహిళలు తమ కార్యకలాపాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపర్చేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులకు ప్రత్యేక నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి,చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలుగూరి నరసింహ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,గోంగూరిగూడెం సర్పంచ్ గోపగోని పాపయ్య, బీరెల్లిగూడెం సర్పంచ్ దాసరి గోవర్ధన్ పాల్గొన్నారు.





## బాలల సంరక్షణపై చర్యలు తీసుకోవాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అన్ని ప్రభుత్వ శాఖల వారు సమన్వయంతో పనిచేసి జిల్లాలో పిల్లల సంరక్షణపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం యూనిసెఫ్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ, పిల్లల సమస్యల పరిష్కారంపై జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల సంరక్షణ, పిల్లలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలు వాటి మధ్య ఉన్న వ్యత్యాసాలు, సామాజిక వ్యవస్థలు పిల్లలపై చూపుతున్న ప్రభావం గురించి సుదీర్ఘంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న గణాంకాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై లోతుగా సమీక్షించాలన్నారు. బాలల సంరక్షణపై చర్యలు, డ్రగ్స్, చైల్డ్ మ్యారేజీలు లేని గ్రామాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. యూనిసెఫ్ (హైదరాబాద్) రిసోర్స్ పర్సన్ ఫిలప్సే మాట్లాడుతూ పిల్లల సమస్యల పట్ల ప్రతి ప్రభుత్వ శాఖ సమన్వయంతో స్పందించాల్సిన తీరును వివరించారు. బాలల సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడానికి శాఖల వారీగా ఎలాంటి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి, క్షేత్రస్థాయిలో పిల్లల్లో, ప్రజల్లో ఏ విధంగా అవగాహన కల్పించాలి అనే కీలక అంశాలపై అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, అడిషనల్ ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, ట్రైనీ డిప్యూటి కలెక్టర్ రవితేజ, అనూష, టి. వసంత్, డిడబ్ల్యుఓ కె. నరసింహారావు, బిసి సంక్షేమ శాఖ అధికారి విశాల్‌ధార, ఆర్‌టిఓ పురుషోత్తం రెడ్డిలతోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెనూ పాటించని వార్డెన్‌పై చర్యలు

### ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** :మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో మౌలిక వసతులు లేక హాస్టల్ విద్యార్థుల తీవ్ర అవస్థలు చెందుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ , ఏఐవైఎఫ్ నాయకులు కొండూరు రవితేజ అన్నారు. ఉదయం అల్పాహారం సమయంలో హాస్టల్ ను సందర్శించిన నాయకులు హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సిన నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపించారు. హాస్టల్ ముందు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పక్కన పెట్టి భోజనం అందిస్తున్నారని దానితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ఇన్చార్జి వార్డెన్ విధానాన్ని తొలగించి పర్మినెంట్ వార్డెన్ ను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరుకులు ఇవ్వడం లేదని, దాంతో విద్యార్థులు అర్ధాకలతో అలమటిస్తున్నారని విద్యార్థులు నాయకులతో తెలిపారు. మరోవైపు కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. తాగునీరు ,పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు శుభ్రం చేయించిన పాపాన పోలేదని అక్కడ ఉన్న పరిస్థితి చూస్తే అర్థమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు ఐత రాజు కిరణ్, సింగపంగ రమేష్, కే శ్రీనివాస్ ,మాజీ ఎంపీటీసీ బచ్చనగొని గాలయ్య, మాజీ సర్పంచ్ దుబ్బాక భాస్కర్, స్థానిక ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు పందుల యాదగిరి, వీరమల్ల యాదయ్య, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయికి ఎంపికైన గురుకుల బాలికలు



**ప్రజాపక్షం/నడిగూడెం** : నియోజక వర్గ స్థాయి ఎస్‌జిఎఫ్‌ఐ క్రీడలు మంగళవారం కోదాడలో నిర్వహించారు. అండర్ 14 విభాగం కోకో క్రీడలో నడిగూడెం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. సి.హెచ్. వర్షిని, డి. దుర్గ భవాని, కె. బ్లెస్సి, కె. దీక్ష జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగం కోకో క్రీడలో ఎం. వాసవి, డి. మేఘన, ఎం. కీర్తన, ఏ. రిషిత జిల్లాస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కోదాడ మండల విద్యాశాఖ అధికారి సలీం షరీఫ్, క్రీడల నిర్వాహకులు, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించి మెడల్స్ అందజేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయికి ఎంపికైన బాలికలను నడిగూడెం సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

# రైలు ఢీకొని 400 గొర్రెలు మృతి

### బీబీనగర్, ఘట్కేసర్ రైల్వే మార్గంలో ఘోర ప్రమాదం
### గొర్రెల కాపరి కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం

**ప్రజాపక్షం/బీబీనగర్** : రైలు ఢీకొనడంతో సుమారు 400 గొర్రెలు మృతిచెందిన విషాద ఘటన బీబీనగర్, ఘట్కేసర్ రైల్వే మార్గంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఔషాపూర్ సమీపంలోని కేపాల్ వద్ద కాజీపేట నుంచి హైదరాబాద్ నాంపల్లి వైపు వెళ్తున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైలు గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్ద సంఖ్యలో గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గొర్రెలు యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన బాలమోని కిష్టయ్యకు చెందినవిగా గుర్తించారు. రైలు రాక సమయంలో పెద్ద శబ్దం రావడంతో భయపడిన గొర్రెలు ఒక్కసారిగా రైల్వే పట్టాలపైకి పరుగులు తీసినట్లు తెలుస్తోంది. సమీపంలో నిద్రిస్తున్న కాపరి వాటిని అదుపు చేసేలోపే రైలు దూసుకురావడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతిచెందిన గొర్రెలను పట్టాలపై నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. భారీ సంఖ్యలో గొర్రెలు మృతిచెందడంతో కిష్టయ్య కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. జీవనాధారమైన గొర్రెలను కోల్పోవడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది. విషయం తెలియడంతో జూలూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నేతలు..**

ప్రమాద విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. తక్షణమే రూ.1లక్ష నగదు రూపంలో ఆర్థిక సహాయం అందించారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత గొర్రెల కాపరి బాలమోని కిష్ట య్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండబోయిన అయోధ్య యాదవ్, నాయకులు పాక వెంకటేశం యాదవ్, పోచంపల్లి మాజీ వైస్ ఎంపీపీ, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేష్ కురుమ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర ఐలయ్య పాల్గొన్నారు.



